॥ శ్రీహరిః ॥

929

మహాభక్తులు

महा भक्तुलु (तेलुगु)



శ్రీ హనుమాన్ ప్రసాద్ పోద్దార్

మహాభక్తులు

महाभक्तलू (तेलुगु)

హిందీ మూలం:
శ్రీ హనుమాన్ ప్రసాద్ పోద్దార్

ఆంధ్రానువాదం:
శ్రీ బులుసు ఉదయభాస్కరము

Sixth Reprint 2009 1,000
Total 16,000

❖ Price : Rs. 8
(Eight Rupees only)

ISBN 81-293-1042-2

Printed & Published by :

Gita Press, Gorakhpur—273005 (INDIA)
(a unit of Gobind Bhavan-Karyalaya, Kolkata)

Phone - (0551) 2334721; Fax - (0551) 2336997
e-mail : **booksales@gitapress.org** website : **www.gitapress.org**

॥ శ్రీహరిః ॥

విషయసూచిక

బిల్వమంగళుడు

(1)

పూర్వము దక్షిణదేశంలో కృష్ణవేణీ నదీ తీరమందలి ఒక గ్రామంలో రామదాసుడు అనే పేరుగల భగవద్భక్తుడైన బ్రాహ్మణుడు ఒకడు ఉండువాడు. అతనికి ఒక కుమారుడు ఉండువాడు. వాని పేరే బిల్వమంగళుడు. ఇతనికి ఇతని తండ్రి యథాసాధ్యంగా ధర్మశాస్త్రాలలో శిక్షణం ఇచ్చేడు. అతని శిక్షణమూ, భక్తినిష్ఠ కారణంగా చిన్ననాటనే బిల్వమంగళుడు పరమ శాంతస్వభావుడు, శిష్టలక్షణ సంపన్నుడు, శ్రద్ధాళువుగా పరిణతుడు అయ్యాడు. కాని విధివశమున అనతికాలమందే అతని మాతాపితరులు దివంగతులు అయ్యారు. నాటి నుండియు బిల్వమంగళునకు గృహసంపద మీద అధికారం ప్రాప్తించింది. క్రమంగా అతడు దుర్జనసాంగత్యానికి లోబడసాగాడు. పెద్దలు చెప్పియే యున్నారుకదా!-

యౌవనం ధనసంపత్తిః ప్రభుత్వమవివేకితా,
ఏకైకమప్యనర్థాయ కిము యత్ర చతుష్టయమ్.

(హితోపదేశం - ప్రస్తావిక 10)

'యౌవనము, ధనసంపద, దొరతనము (అధికారము) వివేకహీనత అను ఈ నాల్గింటిలోనూ ఏ ఒక్క లక్షణం మానవుని దగ్గఱ ఉన్నా, అందువలన వానికి తీరని అనర్థం వాటిల్లుతుంది. ఆ నాలుగు లక్షణాలు ఒకచోట ఉంటే ఇక వేఱుగా చెప్పవలయునది ఏముండును?'

బిల్వమంగళుని దగ్గఱ వలయునంత ధనమూ ఉంది. ఇంటిని పాలించే నాథుడు వేఱుగా లేని కారణంగా అధికారమూ ప్రాప్తించి యుంది. యౌవనపు పొంగూ ఉంది. దీనికితోడుగా దుర్జనమిత్రుల సాంగత్యం కారణంగా అవివేకం కూడ వానిలో ప్రవేశించి గూడు కట్టుకోవడం మొదలు పెట్టింది. క్రమక్రమంగా ఎన్నో దోషాలకు వాని యంతఃకరణం

నెలవు అయిపోయింది. ఇట్లుండగా ఒకనాడు గ్రామంలో ఎక్కడనో ఒక దిక్కున చింతామణి యను వేశ్యయొక్క నాట్యకార్యక్రమము ఏర్పాటు చేయబడింది. విలాస పరాయణులైన రసికజనులు తండోపతండాలుగా నాట్యస్థలం దిక్కుగా పోవనారంభించారు. బిల్వమంగళుడు కూడ తన మిత్రవర్గంతో అక్కడకు చేరుకొన్నాడు. వేశ్యను చూడగానే అతని మనస్సు వశం తప్పింది. అందులకు వివేక రహితమైన బుద్ధి తోడయింది. అతడు నిండుగా మోహసాగరంలో మునిగిపోయాడు. అస్థి మాంస చర్మపరికల్పితమైన రూపంకోసం తన సర్వస్వాన్ని అర్పించి వేసుకొన్నాడు. తన తనువు, మనస్సు, ధనము, కులము, ప్రతిష్ఠ, మర్యాద, ధర్మము ఆదిగా సర్వాన్ని త్యాగం చేసివేసాడు. బ్రాహ్మణకుమారుడు పూర్తిగా పతితుడు అయ్యాడు. నిద్రిస్తూ ఉన్నా, మేలుకొని యున్నా, లేస్తూ ఉన్నా, కూర్చుంటూ ఉన్నా, తింటూ ఉన్నా, త్రాగుతూ ఉన్నా సర్వకాల సర్వావస్థలయందూ చింతామణియే అతనికి చింతన వస్తువు అయిపోయింది. ఒకింత తడవు దుర్జనసాంగత్యం సాగినంత మాత్రాన సంభవించిన పరిణామం ఎంత భయంకరమైనదో పరికించితిరి కదా? వేశ్యల నాట్యగానాలను ఏర్పఱచి కులుకుతూ ఉండే విలాసపరాయణులారా! ఇట్టి యేర్పాటువలన మీరు ఎందఱను పతితులను గావించి యెంత మహాపాతకాన్ని మూటగట్టుకొంటున్నారో ఒకింత ఆలోచించుకొనండి!

(2)

ఒకనాడు బిల్వమంగళుని తండ్రియొక్క శ్రాద్ధదినం ప్రాప్తించింది. శ్రాద్ధం కారణంగా ఆనాడు బిల్వమంగళుడు నదికి అవలి యొడ్డున ఉన్న చింతామణి గృహానికి పోలేక పోయెను. శ్రాద్ధవిధికి ఏర్పాటులు సాగుతూ ఉన్నాయి. పండితుడైన కులపురోహితుడు అతనిచేత శ్రాద్ధ మంత్రాలను పలికిస్తూ ఉన్నాడు. కాని బిల్వమంగళుని మనస్సు ఇక్కడ లేదు. అది చింతామణి చింతనంలో వినిమగ్నమై యుంది. అతనికి ఇచ్చటి కార్యక్రమం ఏదీ రుచించడం లేదు. ఎట్లో అతి కష్టం మీద శ్రాద్ధతంత్రాన్ని ముగించి, ఏదో ఒక విధంగా తొందఱగా బ్రాహ్మణులకు

భోజనాదికం ఆరగింప జేసి అతడు చింతామణి గృహమునకు పోవ సన్నద్ధుడు అయ్యాడు. అప్పటికి సాయంకాలం అయిపోయింది. నాయనా! ఈ దినం నీ తండ్రి యొక్క శ్రాద్ధదినం. ఈనాడు నీవు వేశ్య యింటికి పోరాదని యిరుగు పొరుగులవారు అతనికి నచ్చజెప్పారు. అయినా వారి మాటలను వినేవారు ఎవరు? బిల్వమంగళుని మనస్సు ఎప్పుడో ధర్మకర్మపరిభ్రష్టం అయిపోయింది. అతడు పరుగు పరుగున నదీతీరానికి చేరుకొన్నాడు. భగవానుని మాయ అపారమైనది. ఆకస్మికంగా ప్రబలమైన తుఫాను చెలరేగింది. దానితోడనే రోకటి లావున కుంభవృష్టి మొదలు అయింది. అంబరం అంతా అంధకారం అలుముకొంది. జీవుల హృదయాలు బ్రద్దలగునట్లు మేఘాలలో ఉరుముల పెళపెళలు, మెరుపుల తళతళలు అధికం అయ్యాయి. అహర్నిశమూ నదిలోనే ఉండు నావికులు కూడ తమ పడవలను తీరమునకు చేర్చి కట్టివేసి వడివడిగా చెట్టుపట్టులకు పరుగులు పెట్టారు. అయినా ఇవి యేవియు బిల్వమంగళునకు అధైర్యం కలిగించలేదు. తనను ఎట్లయినా నదిని దాటింపుడని అతడు నావికులను కోరెను. దీనంగా వారిని బ్రతిమాలుకొన్నాడు. ప్రతిఫలం అధికంగా ముట్ట జెప్పెదును అని వారిని అభ్యర్థించాడు. అది యిచ్చెదను. ఇది యిచ్చెదను అని వారిని వేవిధాల ప్రలోభపెట్టాడు. అయినా వారు ఎవరూ అతనిని నదిని తరింప జేయుటకు సమ్మతించ లేదు. విలయతాండవం చేస్తూ ఉన్న మృత్యువును ఎదిరించుటకు ఎవడు ముందడుగు వేస్తాడు? ఆలస్యం అయిన కొలది అతనిలో ఆరాటం పెరిగిపోవసాగింది. కడకు ఆరాటం మేర మీఱిపోగా మనసును చిక్కబట్టుకోలేక ముందువెనుకలు ఏవీ ఆలోచింపక నదిని ఈదికొని దాటడానికి సంకల్పించుకొని అతడు ప్రవాహంలోనికి దుమికెను. ఎంత భయంకరమైన దుస్సాహసకృత్యం అది? అందుచేతనే పెద్దలు (కామాతురాణాం న భయం న లజ్జా) కామాంధకారంతో కన్నులు మూసుకొని పోయినవారికి భయమూ, లజ్జ – రెండూ ఉండవు అన్నారు. విధివశమున అప్పుడు ఆ నదిలో ఒక శవం కొట్టుకొని పోతూ ఉంది. ఒడలు తెలియని దశలో ఉన్న బిల్వమంగళుడు

అది యేదియో కొయ్యయని భావించి దానిని అవలంబముగా గ్రహించి యెట్లో యీదుకొని నదియొక్క ఆవలి తీరమునకు చేరెను. తన శరీరం మీద బట్టలు ఉన్నవో, లేవో, కూడ అతడు ఎఱుగడు. అతడు పూర్తిగా దిగంబరుడు అయిపోయాడు. ఎల్ల యెడల చిమ్మచీకటులు క్రమ్మియున్నవి. అడవి జంతువులు భయంకరారావాలు చేస్తూ ఉన్నాయి. ఎందునూ మానవసంచారం అన్నది లేదు. అట్టి ఆ వికట సమయంలో ఒడలు తెలియని దశలో బిల్వమంగళుడు ఉన్మత్తునివలె ముందు దెసకు సాగిపోతూ ఉన్నాడు. ఒకింత దూరంలోనే ఎదురుగా చింతామణి గృహం ఉంది. శ్రాద్ధం కారణంగా అతడు తాను ఆనాడు రానని చింతామణితో చెప్పియున్నాడు. ఆ కారణంగా ఆమె ఆనాడు తన యింటి తలుపులు అన్నీ మూసికొని నిశ్చింతగా నిద్రామగ్నురాలు అయింది. బిల్వమంగళుడు ఆ యింటి కడకు చేరి బిగ్గఱగా ఆమెను పిలిచాడు. కాని తుఫాను కారణంగా లోపల ఉన్న యామెకు ఏమీ వినిపించలేదు. అతడు ఇటు అటు పరికిస్తూ ఉండగా మెఱుపు వెలుగులో గోడమీద అతనికి త్రాడువంటి వస్తువు ఏదో కానవచ్చింది. అతడు వెంటనే దానిని పట్టుకొని దాని సాయంతో గోడను దాటి గృహంలోపల ప్రవేశించాడు. చింతామణి చెంతకు చేరి ఆమెను మేలుకొల్పెను. ఆమె కన్నులు తెఱచి బిల్వమంగళుని గాంచి కొయ్యబాఱిపోయింది. అతడు దిగంబరంగా ఉన్నాడు. శరీరం అంతా తడిసి యున్నది. దుర్భరమైన దుర్గంధం వెలువడుతోంది. ఇంత భయంకరమైన కాళరాత్రివేళ నదిని ఎలా దాటగలిగావు? తలుపులు మూసి ఉన్నాయీ యింటిలో ఎలా ప్రవేశించగలిగావు? అని యామె అతనిని ప్రశ్నించింది. కొయ్యసాయంతో నదిని దాటేనని, త్రాడు సాయంతో గోడను దాటేనని అతడు ఆమెకు బదులు చెప్పెను. అప్పటికి వర్షం నిలిచిపోయింది. చింతామణి చేత దీపం పట్టుకొని వెలుపలకు వచ్చి చూచింది. గోడమీద భయంకరమయిన కాలసర్పం వేలాడుతూ కానవచ్చింది. నదీతీరాన క్రుళ్ళి గవులుకంపు కొడుతూ ఉన్న శవం గోచరించింది. వానిని బిల్వమంగళుడు కూడ చూచాడు. చూచి కంపించిపోయాడు. అప్పుడు ఆమె అతనిని

చీదరించుకొని ధిక్కరించుచు ఇట్లు పలికింది. – ఛీ! ఛీ! ఛీ! నీవు బ్రాహ్మణ జన్మ యెత్తినవాడవు కావా? అయ్యయ్యో! యీ దినం నీ తండ్రియొక్క శ్రాద్ధదినం కాదా? అయినా ఎముకల మయము, మాంసమయము అయిన ఒక తోలుబొమ్మమీద నీకింత మక్కువయా? దీనికోసం నీవు నీ ధర్మకర్మలను అన్నిటినీ విడనాడి యీ కాళరాత్రిలో ఒక శవాన్ని, కాలసర్పాన్ని సాయంగా గ్రహించి యిక్కడకు పరుగిడి వచ్చావా? ఈనాడు ఏ తోలుబొమ్మను చూచి అందాలరాశి యని భ్రమించి మురిసి ఒడలు మఱచిపోవుచున్నావో దానికి కూడ ఒకనాటికి ఈ శవానికి పట్టిన దుర్గతియే పట్టనున్నదని యెఱుగవా? ఆఖ్! థూ! నీది యెంత నీచవర్తనము? నీవు ఈనాడు ఈ తోలు బొమ్మమీద ఎంత మక్కువను ప్రదర్శించితివో అంత మక్కువను ఆ మనోమోహరుడైన శ్యామసుందరుని మీద ప్రదర్శించి ఉంటే, అతనిని చేరుటకు విలవిలలాడి పరుగులు పెట్టి యుంటే, ఇప్పటికే అతనిని పడసి తప్పక ధన్యజన్మతను అందుకొని ఆనందసాగరంలో మునుకలు వేయు చుండువాడవు.

వేశ్య పలికిన యీ మాటలు బిల్వమంగళుని మనస్సుమీద బాగుగా పనిచేశాయి. అతడు మౌనంగా తనలో తర్కించుకొవడం మొదలు పెట్టెను. చిన్ననాట స్మృతి మనస్సులో మేలుకొంది. తండ్రియొక్క భక్తికి, ధర్మనిష్ఠకూ సంబంధించిన దృశ్యాలు ఒక్కొక్కటిగా కన్నులముందు సాకారములై కదలాడ సాగాయి. అతని హృదయతంత్రి నూతన స్వరాలను ప్రకటిస్తూ మ్రోగసాగింది. అతనిలో వివేకాగ్ని రగులుకొంది. భగవత్ప్రేమసముద్రం పొంగి పొరలింది. హృదయము నవనీతం లాగున ద్రవించి పోయింది. కన్నులలో కన్నీరు ఉరలి అజస్రధారగా పారసాగింది. తోడనే అతడు చింతామణి పాదాలు పట్టుకొని ఆమెతో "తల్లీ! నీవు ఈనాడు నాకు దివ్యదృష్టిని ప్రసాదించి నన్ను కృతార్థుని గావించితివ"ని పలికెను. మానసికంగా అతడు ఆమెనే తన గురువుగా భావించుకొని ఆమెకు ప్రణామం చేసాడు. మఱు క్షణమందే జగచ్చింతామణియైన శ్యామసుందరుని మనోహర చింతనంలో నిమగ్నుడయి ఉన్మత్తుని వలె

ఆమె గృహం నుండి వెలుపలకు పయనం అయ్యాడు. ఈ విధంగా బిల్వమంగళుని జీవననాటకంలో పటపరివర్తనం జరిగిపోయిది.

(3)

బిల్వమంగళుని కన్నులు విడివడినాయి. అవి శ్యామసుందరుని రూపమాధురిని అభిలషింప నారంభించాయి. అవి విలక్షణమైన ఉత్సాహంతో పరమానందరసాన్ని చవిచూచుటకు ఆరాటపడసాగాయి.

శ్యామసుందరుని ప్రేమమయమైన దివ్యసుందరమూర్తిని దర్శించాలి అన్న తహతహ వహించి అతడు పిచ్చివానివలె ఇందందు తిరుగాడ నారంభించెను. కొన్ని దినాలు గడచిన మీదట ఒకనాడు మార్గమధ్యంలో మహా సౌందర్యరాశి యైన యువతి ఒకతె ఆతని కంటబడింది. బిల్వమంగళునిలో పూర్వసంస్కారాలు ఇంకనూ పూర్తిగా అంతరించిపోలేదు. యువతి యొక్క సుందరరూపం గోచరించిన వెంటనే అతని నయనాలు చంచలములై దానిద్వారాన వాని మనస్సు ఆ యువతి దిక్కునకు ఆకృష్టం అయిపోయింది. ఈ విషయంలో భగవానుడు కూడ గీతలో ఇలా చెప్పియున్నాడు –

శ్లో॥ యతతో వ్యాపి కౌంతేయ! పురుషస్య విపశ్చితః,
ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః. (2/60)

అనగా 'కుంతీనందనా! అర్జునా! ఎంతయో ప్రయత్నశీలుడు, బుద్ధిమంతుడు అయినవాని మనస్సును కూడ, మథించివేసే స్వభావం గల (యీ) ఇంద్రియాలు బలిమి మీఱి హరించివేయును.'

దీనిననుసరించి బిల్వమంగళునిలో కూడ మఱల మోహం ఉదయించింది. భగవానుని విస్మరించి అతడు శలభమై (మిడుత) విషయాగ్నుల దిక్కుగా పరుగులు పెట్టెను. అతడు ఆ యువతిని అనుగమించి ఆమె యింటి వఱకు వెడలెను. ఆమె తన యింటిలోపలకు వెడలిపోయింది. అతడు ఆమె యింటి ద్వారము వెలుపల ఖిన్నుడై కూర్చుండిపోయెను. ఇంటిలోపల

నుండి ఆ యువతి భర్త వెలుపలకు వచ్చి తన యింటి ద్వారము చెంత మలినముఖుడైన అతిథి బ్రాహ్మణుడు ఒకడు కూర్చుండియుండగా చూచెను. అతడు కారణం ఏమని ఆ బ్రాహ్మణుని ప్రశ్నించెను. బిల్వమంగళుడు కపటం లేకుండా జరిగిన సంఘటన నంతా వినిపించి 'ఆర్యా! నేను ఒక్కమాఱు ఆ యువతిని తృప్తి గలుగ చూడగోరుచున్నాను. దయచేసి ఆమెను ఒక్కమాఱు ఇక్కడకు పిలవండి!' అని అతనిని అభ్యర్థించెను. ఆ యువతి అదే సేటు యొక్క ధర్మపత్ని, అతడు ఆమె యొక్క భర్త ఆమెను ఒక్కమాఱు కన్నులార చూచినంత మాత్రమున మనకు కలిగే నష్టం ఏమి? ఆమెను చూచినంత మాత్రమున ఇతనికి తృప్తి కలిగినచో తప్పేమి? పిలిచెదను గాక! యని తనలో తర్కించుకొని అతిథివత్సలుడైన ఆ సేటు వెంటనే భార్యను పిలిచికొని వచ్చుటకు లోనికి ఏగెను. అంతలో ఇక్కడ బిల్వమంగళుని అంతరంగంలో వేవిధాల భావనా తరంగాల తుఫాను చెలరేగింది.

ఒక్క మాఱు అనన్యభావంతో అశరణశరణ్యుడైన భగవానుని ఎవడు శరణు పొందునో, వాని యోగక్షేమభారం అంతా ఆ భగవానుడే స్వయంగా వహిస్తాడు అన్నది గీతావచనం. (యోగం అంటే భగవత్ప్రాప్తి, క్షేమం అంటే అందులకై చేసిన సాధనముల సంరక్షణము.) ఈనాడు బిల్వమంగళుని సంబాళించుకోవలసిన భారం కూడ భగవానుని మీద పడింది. దీనవత్సలుడైన భగవానుడు అజ్ఞానాంధుడైన బిల్వమంగళునకు దివ్యచక్షువులను ప్రసాదించాడు. తోడనే బిల్వమంగళునకు తన యథార్థపరిస్థితి తెలియవచ్చింది. అతని హృదయం దుఃఖ పరిప్లుతం అయిపోయింది. అంతట అతడు తనలో ఏమి తర్కించుకొన్నాడో ఏమో? చెంతనున్న రేగిచెట్టు నుండి వాడిగా ఉన్న రెండు ముండ్లను పెరికి చేత బట్టుకొన్నాడు. అంతలో సేటు యొక్క భార్య వెలుపలికి వచ్చింది. బిల్వమంగళుడు ఆమెను మఱల చూచెను. మానసికంగా తనను తాను పలుమాఱులు చీకొట్టుకొన్నాడు. ఓ అభ్యాగ్యనయనములారా! మీరు ఈనాడు లేకుండా పోతే నాకు ఇట్టి పతనావస్థ ప్రాప్తించి యుండదు కదా! అని పలుకుతూ

అతడు తన కన్నులకు శిక్ష విధించడం ఉచితం అని భావించుకొన్నాడు. అది యతని మానసికబలహీనతయే కావచ్చును. మఱి యేదైన కావచ్చును. ఏమైననేమి? అతడు ఆ రెండు ముండ్లతోను తన రెండు కన్నులను బలిమి మీఱ పొడిచివేసుకొన్నాడు. తోడనే అతని కన్నులనుండి నెత్తురు అజస్రధారగా పారసాగింది. అతడు నవ్వుతూ నాట్యం చేస్తూ తుములంగా హరినామధ్వని చేస్తూ ఆకాశాన్ని మాఱుమ్రోగించనారంభించెను. అతని దశను చూచి సేటు దంపతులకు ఎంతయో దుఃఖం కలిగింది. కాని చూస్తూ ఊరకుండడం తప్ప వారు ఏమి చేయగలరు? బిల్వమంగళుని మనస్సులో అవశిష్టం అయిన మాలిన్యం కూడ ఇప్పుడు పూర్తిగా సమసిపోయింది. ఇప్పుడు అతడు అనాథనాథుడైన శ్యామసుందరుని బడయుటకై ఎంతయో ఆరాటపడిపోతూ ఉన్నాడు. ఈ విధంగా అతని జీవననాటకంలో మూడవ మాఱు పటపరివర్తనం జరిగింది.

(4)

పరమప్రియతముడైన శ్రీకృష్ణ పరమాత్మతోడి వియోగాన్ని భరించలేక అతని దర్శనం కోసం తహతహలాడుతూ ఉన్న దశలో బిల్వమంగళుని గ్రుడ్డికన్నులు ఇరువది నాలుగు గంటలూ కన్నీటి జడిని కురియించనారంభించాయి. అతనికి ఆకలి తెలియడం లేదు. దప్పిక తెలియడం లేదు. నిద్రాపరిజ్ఞానమూ లేదు. జాగరూకతా పరిజ్ఞానమూ లేదు. "కృష్ణా! మురళీకృష్ణా! మోహనకృష్ణా! దర్శనమియగరావే! ననుదరిజేర్చగ రావే!" అని బిగ్గఱగా కృష్ణనామస్మరణం చేసి చేసి ఆకాశాన్ని ప్రతిధ్వనింపజేస్తూ అతడు వనాన వనాన, గ్రామాన గ్రామాన తిరుగాడసాగాడు. ఏ ప్రియతముని కోసం రెండు కన్నులను బుద్ధిపూర్వకంగా పొడుచుకోవడం సంభవం అయిందో, ఏ ప్రియతముడు లభించడంలో ఇంత విలంబం అవుతూ ఉంటే ఏ భక్తుడు మాత్రం ఎలా సహించ గలుగుతాడు? ఈనాటి స్వార్థపూరితుడైన భక్తుడు ఎవడైన అయితే విసుగు లేకుండా భగవానుని తిట్టుమీద తిట్టు, తిట్టుమీద తిట్టుగా నిర్విరామంగా తిట్లుతిడుతూ కాలం వెళ్ళ బుచ్చేవాడు. తనలోని భక్తిని ఏనాడో వదిలివేసేవాడు. కాని అచ్చమైన

హార్దిక భక్తుల పరిస్థితి అట్టిది కాదు. వారు తమ ప్రియతమునితోడి విరహావస్థలో యావజ్జీవమూ రోదనం చేస్తూ కాలం బుచ్చుతారు. ఎన్ని యిడుములు ఎదురైన భరిస్తారు. కాని తమ యిష్టదైవతం మీద దోషారోపణం మాత్రం ఎన్నడూ చేయరు. వారికి తమ ప్రియతముని యందు దోషం ఏదీ ఎన్నడూ కానరాదు. మేఘం నీటికి బదులుగా ఱాల వర్షం కురియించి చాతక పక్షియొక్క ఒక్కొక్క ఱెక్కను త్రుంచి వైచినా అదియా మేఘుని మీద కినుక వహించదు కదా!

స్వార్థంతోను, ప్రతిఫలాపేక్షతోను కూడి యెక్కడ ప్రేమ కలుషితం అవుతుందో అక్కడనే ప్రియతముని యందు దోషాలు గోచరిస్తాయి. కారణం ఏమంటే అక్కడ ఇచ్చి పుచ్చుకోవడాలు, తూకాలు, కొలతలు వంటి వ్యాపారలక్షణాల వ్యవహారం సాగుతుంది. కాని యెక్కడ నిర్మల ప్రేమ అగాధ సముద్రంగా ఉంటుందో అక్కడ ఒక్క ప్రేమకే కాని ఇతరమైన దానికి దేనికీ కూడ స్థానం ఉండదు. అట్టి ప్రేమికుని చెంతకు చేరనిదే ప్రియతమునకు సుఖశాంతులు గోచరించవు. అతడు తన ప్రేమికుని చేరువకు పరుగిడి రాక తప్పదు. ఈనాడు అంధుడై బిల్వమంగళుడు శ్రీకృష్ణప్రేమరసంలో నిమగ్నుడై మత్తిల్లి యిందందు తిరుగాడుతూ ఉన్నాడు. ఒకచోట క్రింద పడిపోతున్నాడు. ఒక చోట నడుస్తూనడుస్తూ దేనినో ఢీకొంటున్నాడు. అతనికి అన్నపానాదులను అందిచ్చే దిక్కు లేదు. అట్టి పరిస్థితిలో ప్రేమమయుడైన శ్రీకృష్ణ పరమాత్మ ఎలా నిశ్చింతగా ఉండగలడు? ఒక చిన్న గోపబాలకుని రూపంలో భగవానుడు బిల్వమంగళుని కడకు వచ్చి తన మునిజనమనోమోహకమైన సుమధురకంఠస్వరంతో 'అయ్యా! సూరదాసుగారూ! మీకు చాల ఆకలి యగుచున్నట్లు తోస్తోంది. ఇదిగో! నేను ఒకింత మిఠాయి, మంచినీరు తెచ్చాను. ఆరగించండి!' అని అతనిని పలుకరించాడు. అతని మధురస్వరం వీనులలో ప్రవేశించినంత మాత్రముననే బిల్వమంగళుని ప్రాణాలు ముగ్ధములు అయిపోయాయి. అతడు తన వరదహస్తంతో అర్పించిన ప్రసాదమును పడసి హృదయం అమందానంద తరంగములతో

పరవళ్ళు త్రొక్కింది. అప్పుడు బిల్వమంగళుడు 'నాయనా! నీ యిల్లు ఎక్కడ? నీ పేరు ఏమి? నీవు ఏమి చేస్తూ ఉంటావు?' అని ఆదరమార ఆ బాలకుని ప్రశ్నించెను.

అంతట బాలకుడు ఇలా బదులు చెప్పెను. 'నా యిల్లు చేరువలోనే ఉంది. నాకు ప్రత్యేకించబడిన పేరు ఏదీ లేదు. ఎవరికి తోచిన పేరుతో వారు పిలుస్తూ ఉంటారు. ఎవరు ఏ పేరుతో పిలిచినా పలుకుతూ ఉంటాను. నేను గోవును మేపుతూ ఉంటాను. నన్ను ఎవరు ప్రేమగా చూస్తే వారిని నేను కూడ ప్రేమగా చూస్తూ ఉంటాను.' బాలకుడు పలికిన యీ వీణావినిందితవాణిని ఆలకించి బిల్వమంగళుడు విముగ్ధుడు అయిపోయెను. బాలకుడు అక్కడ నుండి కదలిపోవుచు పోవుచు 'నేను ప్రతిదినమూ మీకు భోజనమును అందించి వెళుతూ ఉంటాను బాబా!' అని పలికి వెడలిపోయెను. 'మంచిది! మంచిది! నీవు రోజూ వస్తూ ఉండుమా!' అని బిల్వమంగళుడు బదులు పలికెను. బాలకుడు వెడలిపోయెను. వెడలునప్పుడు అతడు బిల్వమంగళుని మనస్సును కూడ తన వెంట లాగుకొని పోయెను. అతనిపేరే మనోహరుడు (మనముల దొంగ) కదా! అనేక విధాల సామగ్రులను సమకూర్చి నైవేద్యంగా సమర్పించి కూడ జనులు ఎల్లరూ ఎవని యనుగ్రహం కోసం ఆరాట పడిపోతూ ఉంటారో కరుణా వరుణాలయుడైన ఆ భగవానుడే యీనాడు తన వరదకరకమలాలతో బిల్వమంగళునకు భోజనమును ఆరగింప జేయబోవు చున్నాడన్నది యెంత ప్రశస్తవ్యమూ, పరమానంద జనకమూ అయిన విషయము? ఆహా! బిల్వమంగళుని జన్మయెంత ధన్యమైనది? భక్తునికోసం భగవానుడు ఏమేమి చేయకుండును?

ఇంతజరుగుతూ ఉన్నా బిల్వమంగళుడు తాను ఎవరికోసం ఈ ఫకీరు వేషాన్ని సంతరించుకొన్నాడో, ఎవరి ప్రాపును గోరి ముండ్లతో రెండుకన్నులను పొడుచుకొన్నాడో, అతడే యీ బాలకుడని అతనికి ఇంకనూ తెలియరాలేదు. కాని ఆ గోపబాలకుడు మాత్రం తన మాట యొక్కటి దక్క మఱి యెవ్వరి మాటయు బిల్వమంగళునకు

రుచించనంతగా అతని హృదయం మీద అధికారం స్థాపించుకొన్నాడు. ఒకనాడు బిల్వమంగళుడు తనలో యిలా తర్కించుకో సాగెను. - 'అన్ని యిబ్బందులను అధిగమించి యింత వఱకు వచ్చాను. ఇక్కడ ఇది యెంత క్రొత్త ఇబ్బంది యెదురు అయింది. స్త్రీ వ్యామోహవలయంలో నుండి బయల్పడ్డాను ఎట్లో అని అనుకుంటూ ఉండగా ఇక్కడ మఱియొక క్రొత్త విపత్తు వచ్చిపడింది. ఈ పిల్లవాడు ఎవడో నన్ను తన మోహంలో బంధించివేసాడు.' అతడు ఈ విధంగా ఆలోచించుకుంటూ ఉండగా అంతలో అక్కడకు ఆ రసికబాలకుడు వచ్చి కూర్చుండి విన్నవారికి పిచ్చి యెత్తించే తన మధురకంఠస్వరంతో అతనిని 'బాబాజీ! మౌనంగా కూర్చుండి ఏమి ఆలోచిస్తున్నారు? బృందావనానికి పోదాము వస్తారా?' అని పలుకరించెను. బృందావనం పేరు వినగానే బిల్వమంగళుని శుష్కహృదయం పచ్చబడింది. కాని అందులకు తన అసమర్థతను ప్రకటిస్తూ అతడు 'నాయనా! నేను గ్రుడ్డివాడను. బృందావనమునకు ఎట్లు పోవగలను?' అని బదులు పలికెను. 'ఇదిగో! నా కఱ్ఱ. దీని యగ్రమును పట్టుకొండి! లేవండి! రండి! నేను మిమ్ము బృందావనానికి తీసుకొని పోయెదను' అని బాలకుడు మాఱు పలికెను. ఆ మాట విని బిల్వమంగళుని ముఖం ప్రఫుల్లం అయింది. కఱ్ఱ యొక్క అగ్రభాగం పట్టుకొని భగవానుడు స్వయంగా భక్తునకు ముందు ముందు నడవడం మొదలు పెట్టెను. భక్తుని చేతికఱ్ఱను పట్టుకొని భగవానుడు స్వయంగా అతనికి మార్గదర్శకుడు అయ్యేడన్న ఆహా! స్వామి దయామయత్వానికి ఎంతటి పరాకాష్ఠ? ఒకింత దూరం పోయి ఆ బాలకుడు 'ఇదిగో! బృందావనం వచ్చింది. ఇక నేను వెడలి పోవుచున్నాను' అని పలికెను. తోడనే బిల్వమంగళుడు ఆ పిల్లవాని చేయి పట్టుకొన్నాడు. అతనిచేతిని తాకినంతనే బిల్వమంగళునకు విద్యుత్తును తాకిన విధంగా ఒక్కమాఱు ఒడలు అంతయు జల్లుమంది. సాత్త్విక ప్రకాశంతో సర్వద్వారాలు ఉద్భాసితములు అయ్యాయి. బిల్వమంగళునకు దివ్యదృష్టి ప్రాప్తించింది. బాలకుని రూపంలో సాక్షాత్తూ తన పరమేష్ట దైవతమైన శ్యామసుందరుడే తన ముందు నిలిచియుండగా అతడు

చూచెను. అతని శరీరం అంతారోమాంచితం అయింది. కన్నుల నుండి ప్రేమాశ్రుధారలు ఒలుకసాగాయి. భగవానుని హస్తాన్ని మరింత దృఢంగా అతడు పట్టుకొన్నాడు. 'ఆః! ఇప్పుడు నిన్ను గుర్తించాను. చాల కాలానికి నిన్ను పట్టుకోగలిగాను. నా ప్రియతమదైవత లలామా! ఇక నేను నిన్ను విడిచిపెట్టువాడను కాను' అని అతడు పలికేను. 'చేయి వదులుదువా? లేదా?' అని భగవానుడు అన్నాడు. 'వదలను! వదలను! ఎన్నడూ వదలను! త్రికాలాలయందూ ఈ వరదహస్తాన్ని విడిచి పెట్టను' అని బిల్వమంగళుడు పలికెను.

అంతట భగవానుడు బలిమి మీఱ తన చేతిని గింజుకొని విడిపించికొనెను. ఎవని బలంచేత బలాన్ని సమకూర్చుకొని మాయాదేవి సమస్త ప్రపంచాన్ని పదదళితం చేస్తూ ఉందో వాని బలం ముందు పాపం! ఆ గ్రుడ్డి బాపడు ఏమి చేయుగలడు? కాని యా భగవానుని అతడు ముందే తన మనములో తన భక్తిపాశంతో బంధించివేసి యున్నాడు. బాలకరూపంలో ఉన్న ఆ భగవానునకు ఆ బంధనాన్ని తెంచుకొని పోవగలుగుట సులభసాధ్యమైన విషయంకాదు. చేయి విడిపించుకోగానే బిల్వమంగళుడు ముద్దుల కృష్ణా! వెడలిపోవుచున్నావా? కాని ఒక్క విషయం గుర్తు ఉంచుకో!

శ్లో॥ హస్త ముత్క్షిప్య యాతోఽసి బలాత్ కృష్ణ! కిమద్భుతమ్,
హృదయాద్యది నిర్యాసి పౌరుషం గణయామితే.

ఆ॥ బల్మికరము పట్టు వదలించుకొని పోతె
దే? యిదేమి వింత? యెన్న కృష్ణ!
పోసి నాయెడంద పట్టు పోతెదవేని
పరిగణింతు నీదు పౌరుషంబు.

భక్తుని వీడి భగవానుడు పోవలేకపోయాడు. ఎలా పోవగలడు? భగవద్గీతలో ప్రమాణం చేసి యున్నాడు కదా! ఏమని అంటే –

"యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్" (4/11)

అనగా ఎవరు నన్ను ఏ విధంగా భజిస్తారో వారిని నేను కూడ ఆ విధంగానే భజిస్తాను అని భావం.

భగవానుడు తన వరదకరకమలాలతో బిల్వమంగళుని కన్నులను స్పృశించెను. తోడనే అతని కన్నులు విడివడినాయి. అతడు భగవానుని దర్శించెను. అతని అనుపమానమూ, భువనమోహనమూ అయిన రూపరాశిని సందర్శించి తననుతాను సంబాళించుకోలేక పోయెను. మొదలు నరకిన తరువువలె ఆ స్వామి పాదాలమీద తటాలున వ్రాలిపోయెను. అవిరళంగా ఉరలి వస్తూ ఉన్న ప్రేమాశ్రుధారలతో ఆ స్వామి యొక్క పావన చరణ కమలాలను ప్రక్షాళించసాగెను.

భగవానుడు ప్రియము మీఱ అతనిని లేవనెత్తి అక్కున జేర్చుకొని గాఢంగా ఆలింగనం చేసుకొన్నాడు. భక్తుని యొక్కయు, భగవానుని యొక్కయు మధురసమాగమంతో సమస్తప్రపంచంలోను మాధుర్యం అలముకొంది. దేవతలు పూలవానలు కురియించ సాగారు. సాధుజనులు, భక్తబృందాలు నాట్యం చేయసాగారు. పవిత్రమైన హరినామధ్వనితో అంబరం అంతా ప్రతిధ్వనితం అయింది. భక్తుడు, భగవానుడు ఇరువురూ ధన్యులు అయ్యారు. వేశ్య యైన చింతామణి, సేటు, అతని భార్య కూడ అక్కడకు వచ్చారు. భక్తుని ప్రభావం చేత భగవానుడు తన దివ్యరూప సందర్శనభాగ్యం కలిగించి వారిని కూడ కృతకృత్యులను గావించెను.

బిల్వమంగళుడు యావజ్జీవమూ భక్తి ప్రచారం గావించి భగవన్మహత్త్వాన్ని పెంపొందజేసెను. కడపట దేహం చాలించి గోలోక ధామానికి వెడలిపోయెను.

భక్తునకు జయము! భక్త పాలకుడగు భగవానునకు జయము!

* * *

భక్తకవి జయదేవుడు

జయదేవుడు భక్తకవిగా ప్రసిద్ధి గన్నవాడు. ఇతడు సుమారు అయిదు వందల యేండ్లకు పూర్వము బెంగాలు రాష్ట్రపు వీరభూమి జిల్లాలోని కెందుబిల్వమను గ్రామములో జన్మించెను. అతని తండ్రి భోజదేవుడు. తల్లి వామాదేవి. ఈ భోజదేవుడు పూర్వము కన్యాకుబ్జమునుండి బెంగాలు రాష్ట్రమునకు వచ్చి స్థిరపడిన పంచబ్రాహ్మణులలో భరద్వాజగోత్రమువాడగు శ్రీహర్షుని వంశమువాడు. బాల్యమునందే జయదేవుని మాతాపితరులు అతనిని ఒంటరివానిని జేసి దివంగతులయిరి. అటుపిమ్మట భగవద్భజనము చేసికొనుచు జయదేవుడు ఎట్లో తన జీవననిర్వహణము సాగించుకొనసాగెను. ఇతని పూర్వసంస్కారములు మంచివి. ఆ కారణమున ఇతడు ఇడుముల పాలైయుండియు చక్కగా విద్యాభ్యాసము చేసెను. భగవానుడు శ్రీకృష్ణపరమాత్మ మీద ఇతనికి సరళమైన ప్రేమయుండెను. ఆ కారణమున ఇతడు అనతికాలమున ఆస్వామి యొక్క పరమానుగ్రహమునకు పాత్రమయ్యెను.

జయదేవుని తండ్రితాను ఉన్న గ్రామములోనే నివసించుచున్న నిరంజనుడను బ్రాహ్మణునకు కొంత సొమ్ము ఋణపడియుండి మరణించెను. జయదేవుడు లోకము నెడల విముఖుడు. భగవద్భక్తిమార్గము నవలంబించినవాడును కాగా చూచి నిరంజనుడు అతని వలన అనుచిత లాభమును పొంద నెంచి ఏదియో యొక విధముగా అతని యింటిని స్వాయత్తము జేసికొన సంకల్పించుకొనెను. అతడు వెంటనే ఒక దస్తావేజును సృష్టించి జయదేవుని కడకు వచ్చి అతనితో – 'ఇటు చూడు! జయదేవా! నీ రాధాకృష్ణుని తోను, గోపీకృష్ణునితోను నాకు పనిలేదు. వడ్డీతోడ నా సొమ్మును నాకు ఇప్పుడే నీవు ఇచ్చివేయనైన ఇచ్చివేయవలెను. లేదా యీ దస్తావేజుమీద సంతకము చేసి నీ యిల్లు వాకిలి సర్వము నాకు

స్వాధీనమైన చేయవలెను' అని యతనిని నిర్బంధించెను.

జయదేవుడు సర్వవిధముల సర్వమునందు విరక్తి గన్నవాడు. అతనికి తన యింటి మీద ఆవంతయు మమకారము లేదు. అతడు వెనుకముందులు ఆలోచింపక వెంటనే కలము దీసికొని యాదస్తావేజుపై సంతకము. జేసి వైచెను. నిరంజనుడు ఎట్లయినను జయదేవుని గృహమును స్వాధీనము చేసుకొన నెంచియే వచ్చినవాడు కదా! అట్లే అతడు ఆ యింటిని స్వాయత్తము జేసివైచికొనెను. అంతలో అతని చిన్న కొమరిత పరుగు పరుగున వచ్చి 'తండ్రీ! త్వరగా పద! మన యింటికి నిప్పంటుకొని సర్వము కాలి బూడిద యగు చున్నది' అని అతనితో చెప్పెను. ఆ సమయమున భక్తుడైన జయదేవుడు అచ్చటనే యుండెను. అతని మనములో హింసాద్వేషభావములు ఈషణ్మాత్రమును లేవు. నిరంజనుని యింటికి నిప్పు అంటుకొన్న దన్న వార్తను విన్నంతనే యతడు పరుగిడి పోయి కనలుచున్న మంటల నడుమ నా యింటిలోనికి చొరబడెను. అతడు ప్రవేశించిన వెంటనే మెలకువ గలిగినంతనే సమసిపోవు కలవలె అగ్నియంతరించిపోయెను. అచ్చమైన భక్తులకు సాధ్యముకానిది ఏమియుండును? భగవానుని, భక్తుని చల్లని చూపులుప్రసరించిన చోట గరళము అమృత మగును. శత్రువు మిత్ర మగును. సముద్రము గోష్పదమగును. అనలము శీతల మగును.

జయదేవుని యీ యలౌకిక శక్తిని గాంచి నిరంజనుని కన్నుల గన్నీరు ఉరలెను. అతడు తన చేతకు చింతించుచు పోయి జయదేవుని చరణముల మీద వ్రాలిపోయెను. తానుసంతకము చేయించుకొన్న దస్తావేజును చించి యావల బాఱవైచి యతనితో 'భద్రా! నాయపరాధమును క్షమించుమా! లోభమునకు లోబడి అల్పద్రవ్యమును అపేక్షించి బుద్ధిపూర్వకముగా నిన్ను వంచించి గృహమును స్వాయత్తముజేసికొంటిని. ఈనాడు నీవు లేకున్న నా గృహమంతయు భస్మపటల మయ్యేడిది. నీవు ధన్యుడవు. నీవలన

నేను ఈనాడు భక్తుని మహత్త్వము ఇట్టిదని యెఱుగగలిగితిని' అని పలుకుచు అతనిని క్షమాభిక్ష వేడుకొనెను.

నాటి నుండియు నిరంజనుని హృదయము పరిశుద్ధ మయ్యెను. అతడు జయదేవుని సాంగత్యము వలన లాభమును పొంది భగవద్భజన కీర్తనములందు తన సమయమును వెచ్చింప సాగెను.

భగవానునకు తన మీద ఇంతటి కృప యున్నందుకు జయదేవునకు హృదయము ద్రవించెను. అతడు తన యింటిని వీడి పురుషోత్తమక్షేత్రమునకు అరుగదలచెను. తన యూరువాడగు పరాశరుడను బ్రాహ్మణుని వెంట నిడుకొని యొకనాడు అతడు పూరీక్షేత్రమునకు పయనము సాగించెను. భగవద్భజనకీర్తనములు సేయుచు తాదాత్మ్యము నందుచు నతడు ముందునకు అడుగిడసాగెను. అతని చెంత పాథేయము (దారి బత్తెము) ఏదియును లేదు. ఉన్నది కేవలము ముఖమునందు పవిత్రహరినామము, హృదయమునందు వ్యత్యస్తపాదారవింద సుందరమైన హరిస్వరూపము మాత్రమే. ఒకనాడు జయదేవునకు మార్గములో చాల దూరము వఱకు ఎందునా నీరము లభించలేదు. ఆ సమయమున సర్వత్ర గ్రీష్మతాప మధికముగా నుండెను. దప్పిక బాధకు తాళలేక నడచుచు నడచుచు జయదేవుడు క్రింద పడిపోయెను. అప్పుడు భక్త వాంఛాకల్పతరువగు శ్రీహరి స్వయముగా గోపబాలక వేషమును దాల్చి వచ్చి జయదేవునకు వస్త్రముతో వీవన వేసి నీరమును, సుమధురక్షీరమును ద్రాగించెను. అనంతరము వారికి మార్గమును ఎఱిగించి శీఘ్రముగా వారిని పూరీక్షేత్రమునకు జేర్చివైచెను. ఛద్మవేశముతో తమ చెంతకు వచ్చిన యా భగవానుని జయదేవుడు గుర్తింపలేక పోయెను. అతని సహచరుడగు పరాశరుడును గుర్తింపలేక పోయెను. తమను పూరీక్షేత్రమునకు చేర్చి భగవానుడు అంతర్ధానము చెందుటతో జయదేవుడు అతనిని భగవానుడని గుర్తింప గలిగెను. అప్పుడతడు ఎంతయో పశ్చాత్తాపమును బొందెను. కాని ప్రయోజనము ఏమి?

జయదేవుడు సర్వదా ప్రేమామృతరసమగ్నుడై శ్రీకృష్ణనామగానము చేయుచుండువాడు. ఒకనాడు భావావేశమును పొందిన తరుణమున అతనికి ఒక దివ్యదృశ్యము గోచరించెను. అది యెట్టిదనగా, నాలుగు వంకల నీలివన్నె పర్వశ్రేణులు నయనపర్వములు కావించుచున్నవి. క్రింద కలకలధ్వని చేయుచు కాళిందీనది పాఱుచున్నది. ఆ సుందర యమునా తీరమునందు కదంబ వృక్షము (కడిమి) క్రింద మనోమోహనమురళిని కేల ధరించి మందహాస భాసురవదనారవిందుడై శ్రీకృష్ణభగవానుడు నిలిచియున్నాడు. ఈ దృశ్యమును చూచినంతనే జయదేవుని ముఖమున ఆకస్మికముగా శ్లోకరూపమున ఈ మధురగీతము వెలువడెను –

మేఘైర్మేదురమంబరం వనభువ శ్శ్యామాస్తమాలద్రుమైః
నక్తం భీరురయం త్వమేవ తదిమం రాధేగృహం ప్రాపయ,
ఇత్థం నందనిదేశతశ్చలితయోః ప్రత్యధ్వకుంజద్రుమమ్
రాధామాధవయో ర్జయంతి యమునాకూలే రహఃకేలయః.

ఈ మధురగానమును ఆలకించి పరాశరుడు పరమానందమును పొందెను. ఇచ్చట నుండియే లలితలలితము, మధురమధురము నగు 'గీతగోవింద కావ్యము' మొదలయ్యెను.

ఇచ్చటనే జయదేవునకు భగవానుని దశావతారాల దర్శనభాగ్యము కలిగెనట. దానిచేత ప్రభావితుడై అతడు 'జయజగదీశ హరే' అను పల్లవితో దశావతారగీతమును కూర్చి భగవానుని స్తుతించుచు ఆలపించెనట. ఆ సమయమున ప్రాప్తించిన సమాధిదశవంటి దివ్యదశనుండి కొంత తడవునకు బాహ్యజ్ఞానదశకు చేరి చూడగా అతనికి అంతకు ముందు కానవచ్చిన బృందావనమునకు బదులు అనంత జలరాశి కానవచ్చెను. ప్రపంచమందు సర్వత్ర పరివ్యాప్తుడై యున్న విశ్వరూపపరమాత్మను గుర్తించి యతడు ఆ స్వామిని ఆనందము మీఱ స్తుతించెను. అనంతరము పరాశరుని వెంట నిడుకొని యతడు జగన్నాథస్వామిని దర్శింప బోయెను.

కన్నులార తనుపు గలుగ ఆ స్వామిని దర్శించి అతడు సంతసించెను. ఈ విధముగా అచ్చటకు చేరిన మీదట అతని హృదయము పరమానంద భరితమయ్యెను. అతడు క్షేత్రమునందు ఒక వీతరాగుడగు సన్యాసివలె కాలము బుచ్చసాగెను. అతనికి అచ్చట ఒక నిర్ణీతవాస స్థానము ఏదియును లేదు. ప్రాయికముగా అతడు చెట్టుక్రింద వాసము చేయువాడు. భిక్షాన్నముతో ఉదరపూర్తిగావించుకొనువాడు. రేయనక, పగలనక ప్రభువగు భగవానుని ధ్యానము, చింతనము, గుణగానము చేసుకొనుచు కాలము బుచ్చుటయే అతనికి జీవిత పరమార్థ మయ్యెను.

అ కాలములో పూరీక్షేత్రము నందు సుదేవుడను పేరుగల భగవద్భక్తుడగు బ్రాహ్మణుడు ఒకడు నివసించుచుండెను. అతనికి ఎంతకాలమైనను సంతానము గలుగలేదు. అతడు తన భార్యకోరికను అనుసరించి తనకు ఒక్క పుత్రుని ప్రసాదింపుమని జగన్నాథస్వామిని వేడుకొనుచు తనకు గలిగిన ప్రథమ సంతానమును ఆ స్వామి సేవకొఱకు అర్పించివేయుదు నని మ్రొక్కుకొనెను. భగవానుని దయవలన అతనికి అనతికాలమునందే ఒక యాడుబిడ్డ గలిగెను. ఆమెకు అతడు పద్మావతి యని నామకరణము గావించెను. పదియు, పండ్రెండు ఏండ్ల ప్రాయము వచ్చిన మీదట మాతా పితరులు ఆమెను శ్రద్ధాభక్తి పురస్సరముగా జగన్నాథస్వామికి అర్పించివైచిరి. తాను ఆమెను స్వీకరించితి నని యా స్వామి వారికి రాత్రిస్వప్నదశలో ఎఱుగజెప్పెను. అంతియేకాదు. ఆ ప్రభువు 'నాయనలారా! మీరు ఈమెను నా ఆజ్ఞానుసారముగా ఈ పూరీక్షేత్రమునందే నివసించుచున్న నా పరమభక్తుడగు జయదేవునకు ఇచ్చి పెండ్లి చేయుడు' అని కూడా వారితో చెప్పెను.

భగవానుని ఆదేశానుసారము ఆ మాతాపితరులు తమ కొమరితను దోడ్కొని తరుతలమున గూర్చుండి భగవద్గుణ కీర్తనము జేసికొనుచున్న జయదేవుని కడకు బోయి యతనికి భగవదాజ్ఞను ఎఱుగ జెప్పిరి. జయదేవుడు భగవదాజ్ఞపూర్వకమైన వారి సంకల్పమును ఎఱిగి యాశ్చర్యమును,

విషాదమును కూడ బొందుచు 'ఆర్యా! నేను గృహత్యాగము చేసిన విరాగిని. భిక్షుకుడను. నేను పెండ్లి చేసికొనుటకు ఇచ్ఛగింపను.' అని వారికి బదులు చెప్పెను. అప్పుడు ఆ విప్రదంపతులు మఱల అతనితో 'నాయనా! జయదేవా! మేము భగవదాజ్ఞను త్రోసిపుచ్చలేము. మేము ఈమెను నీకు అర్పించి వైచితిమి. స్వయముగా భగవానుడగు జగన్నాథస్వామి ఈమెను నీకర్పింప మాకాదేశ మిచ్చెను. ఆస్వామి యాదేశమును ఎవరు తిరస్కరింప గలరు? ఇక ఈ కన్య నీ చెంతనే యుండును. మేము ఈమెను ఇచ్చట వీడి వెడలిపోవుచున్నాము' అని పలికి వెడలిపోవసాగిరి. జయదేవుడు వారిని నిలువరింప యత్నించెను. కాని వారు నిలువలేదు. కడకు భగవదాజ్ఞను మన్నించి యా కన్యను పెండ్లి యాడుట అతనికి తప్పలేదు. కొన్ని దినములు గడచిన పిదప గార్హస్థ్యమును అవలంబించిన జయదేవుడు పతివ్రతయగు తన భార్యను వెంట నిడుకొని స్వగ్రామమగు కెందుబిల్వమునకు మఱలి వచ్చెను. ఆ దంపతులు ఇరువురును తమ యింట శ్రీరాధామాధవుల యుగళమూర్తిని ప్రతిష్ఠించుకొని భక్తితో నిత్యము పూజించికొన నారంభించిరి.

అట్లు కొంతకాలము కెందుబిల్వములో నివసించి యనంతరము జయదేవుడు యాత్ర చేయ బయలు వెడలెను. ఒక మహారాజు ఆ కాలములో అతనిని విశేషముగా సన్మానించి తన చెంత కొంత కాలము నిలిపికొనెను. తనను వీడి వెడలిపోవు వేళ ఆ మహారాజు అతనికి తనను అతడు ఏమియు కోరకున్నను పెద్ద మొత్తము ధనమును అర్పించెను. అప్పుడు జయదేవుడు ఆ మహారాజుతో ఇట్లనెను – 'రాజేంద్రా! భగవదనుగ్రహమును పొందగోరు మానవుని దృష్టితో ధనము, రతనాలు విషతుల్యములైనవి. ధనము మనుజుని మదాంధుని గావించును. ధనహీనత వలన లోభవృత్తి, రాగద్వేషాదులును ఆవిర్భవించును. ఇట్టి యనర్థహేతువగు ఈ యర్థమును నేను స్వీకరింప నొల్లను.' ఈ మాటలను వినికూడ మహారాజు జయదేవుని విడువలేదు. ధనమును స్వీకరింపక

తప్పదని అతనిని బ్రతిమాలెను. అప్పుడు ఆ మహారాజు ప్రసన్నతను గోరి నిర్మల భావముతోను, నిస్స్పృహత్వముతోను ఒకింత ధనమును స్వీకరించి జయదేవుడు స్వగ్రామము దిక్కుగా పయనమయ్యెను.

క్రుళ్ళిన మాంసమును నక్కలు, గృధ్రములు వంటి తుచ్ఛ ప్రాణులు మాత్రమే హరింప నుద్యమించు చుండును. అట్లే లోభగ్రస్తులైన మూఢమానవులు మాత్రమే ధనము వెంట పడుచుందురు. కొందఱు దొంగలు మార్గమధ్యమున జయదేవుని వెంబడించిరి. సరళహృదయుడగు జయదేవుడు చిత్తమును భగవదాయత్తముగావించుకొని ఒక విధమగు పారవశ్యదశలో ముందునకు సాగిపోవు చుండెను. దొంగలు తనను ధనమును ఇమ్మని కోరిన జయదేవుడు వారికి ఇచ్చివేయువాడే, కాని వారు అతనిని అడుగలేదు. తమ వంచనవృత్తినే వారు ఎఱుగుదురు. ఎవడైన శక్యమైనంత వఱకు ధనమును కాపాడుకొనుటకే యత్నించును. కాని అనాయాసముగా ఎవడు ఎవనికి ధనము నర్పించును? అని భావించుకొని దొంగలు జయదేవుని లోబఱచుకొనుటకు ఒక ఉపాయమును ఆలోచించిరి. లోభవృత్తి బహు చెడ్డది. అది మానవుని వివేకమును హరించి వానిని రాక్షసుని జేసివేయును. దొంగలు మానవులే. అయినను లోభవృత్తి వారిని రాక్షసులను జేసివైచెను. వారు వెనుకనుండి జయదేవునిపై ఆక్రమణము జేసి యతనిని క్రిందకు పడద్రోసి యతని కాలుసేతులను ఖండించి వైచి చెంత నున్న యొక పాడు నూతిలోపలకు అతనిని ద్రోసివైచిరి. అనిత్యమైన అతని ధనముతోబాటు మహాదుఃఖ హేతువగు మహాపాపపు మొత్తమును గూడ మూట గట్టుకొని తమ కార్యసాఫల్యము నెంచి గర్వించుచు వారు అచ్చట నుండి తమ యిచ్చ వచ్చిన దిక్కునకు వెడలిపోయిరి.

భగవానుని దయవలన ఆ నూతిలో నీరు పూర్తిగా ఇగిరిపోయి యుండెను. ఆ కారణమున జయదేవుడు నీట మునుగుట సంభవించలేదు. అతనికి శరీరముపై అవంతము గాయము కలుగలేదు. దైవానుగ్రహమును

పొందిన వానిని ఎవ్వరును ఏమియు చేయజాల రనుట నిజము.

జయదేవుడు ఆ నూతిలోపల ఒక శిలను ఆధారము గావించుకొని దానిపై గూర్చుండెను. జరిగిన సంఘటనమును భగవానుని విధానముగా దలచి యతడు పరితోషమునే పొందెను. భగవన్నామగుణకీర్తనము జేసికొనుచు పారవశ్యము నందసాగెను. భగవద్భక్తుడనైన నేను కూడని ధన సంగ్రహణమునకు పాల్పడిన కారణముననే నాకు ఈ దురవస్థ యెదురైనదని యతడు తనలో భావించుకొనెను.

కొంత తడవైన మీదట ఆ మార్గమున గౌడదేశీయుడగు లక్ష్మణసేనమహారాజు వాహనము పోవసాగెను. నూతిలోపల నుండి వినవచ్చు మానవధ్వని నాలకించి యా మహారాజు అది యేమియో పరిశీలింపుమని తన సేవకున కాదేశించెను. అతడు పోయి చూడగా ఒక మానవుడు నీరులేని నూతిలోపల శిలపై గూర్చుండి శ్రీకృష్ణనామస్మరణము జేసికొనుచు గానవచ్చెను. మహారాజు ఆదేశింపగా అతని సేవకులు జయదేవుని నూతిలోపల నుండి బహిర్గతుని గావించిరి. అతనికి చికిత్స చేయింప నెంచి మహారాజు అతనిని తన గౌడదేశమునకు తోడ్కొని పోయెను. జయదేవుని విద్వత్తును, అతని శ్రీకృష్ణభక్తిని గుర్తించి యామహారాజు ముగ్ధుడయ్యెను. అతని లోకోత్తర సుగుణ సంపదను గాంచి మహారాజు అతనికి భక్తుడే యయ్యెను. కాలుసేతులను ప్రణీతములను గావించిన వారి యానవాళ్ళను ఎఱిగింపుమని యతడు జయదేవునడిగెను. కాని జయదేవుడు వారి యూరు, పేరును ఎఱిగినవాడు కాడు. తనకు పీడ గలిగించిన దొంగల యానవాళ్ళను దెలిపినచో రాజభటులు వారిని పట్టి బంధించి బాధించుదురని యెంచి యతడు ఆ విషయమున మౌనము వహించెను. అచ్చమైన భక్తుడు తన శత్రువునకు గూడ అమంగళమును గోరడుకదా! అచ్చపు భక్తులు ఎల్లవేళల ఎల్ల జీవులయందును మైత్రీలక్షణమునే ప్రదర్శించుచుందురు. వారి దృష్టికి ఒక్కడును చెడును చేయువాడుగా గానరాడు. తమకు గలిగిన యనర్థమునందు కూడ వారు భగవత్కృపారూప పరమార్థమునే

దర్శించుచుందురు. ఆ యనర్థమునకు నిమిత్తమైన వానిని తమ పరమోపకారిగా భావించి యతనికి ధన్యవాదము లర్పింతురు. క్షమాగుణము వారిలో స్వభావసిద్ధమై యుండును.

చికిత్సవలన అనతికాలమునందే జయదేవుని గాయములు సమసిపోయెను. మహారాజు అతనిని తన పంచరత్న సభలో ప్రధానుని గావించి సర్వాధ్యక్షుని బాధ్యతలను అప్పగించి గారవించెను. అనంతరము కొన్ని దినములకు జయదేవుని భార్యయగు పద్మావతి కూడ శ్రీరాధామాధవ యుగళమూర్తిని గ్రహించి పతి చెంతకు వచ్చివైచెను. మహారాజు విశేషధనాదికమును అర్పించి సర్వవిధముల జయదేవుని పర్యాయముగా గారవింప యత్నించుచుండెను. కాని వీతరాగుడు, భక్తశిఖామణియు నగు జయదేవుడు తమ కగు సాధారణవ్యయము మేరలను మీఱి ధనమును ఎన్నడును గ్రహించుటకు ఇచ్చగింపలేదు. ఇట్టులుండగా ఒకనాడు రాజభవనములో ఏదియో యుత్సవము జరుపడెను. ఆ సందర్భమునందు చేయబడిన విందులో పాల్గొనుటకు ఎందఱో దరిద్రులైన బిచ్చగాండ్రు, అతిథులు, బ్రాహ్మణులు, సాధువులు మున్నగువారు విచ్చేసిరి. వారిలో జయదేవుని కాలుసేతులను గాయపఱచి యతనిని నూతిలో పడద్రోసిన చోరులు నలుగురును కూడ సాధువేషములను దాల్చి కూర్చుండిరి.

తాము ఏ వ్యక్తిని కాలుసేతులు ఖండించి నూతిలో పడద్రోసిరో, ఏ వ్యక్తిని మరణించెనని భావించుచుండిరో అతడే యిక్కడ సర్వాధ్యక్షుడై యుండెనని యా చోరులు ఏమెఱుగుదురు? వారు దూరమునుండియే జయదేవుని తమ చేత కాలుసేతులు నరకబడి నూతిలో పడద్రోయబడిన వానినిగా గుర్తించిరి. తోడనే వారు అచ్చట నుండి పాఱిపోవుటకు అవకాశమును అన్వేషింప సాగిరి. అంతలో జయదేవుడు కూడ వారిని చూచి గుర్తించెను. తోడనే యతడు చిరకాల వియుక్తులైన బంధువులను గాంచినంతగా ఆనందభరితు డయ్యెను. పిమ్మట అతడు తనలో – వీరికి ధనము ఆవశ్యకమై యుండును. మహారాజు నన్ను మాటికి

మాటికి ధనమును స్వీకరింపుమని బతిమాలుచున్నవాడు. ఈనాడు వీరికి నేను కొంత ధనమిప్పించ గలిగినచో నాకు పరమానంద మగును. అని యాలోచించి మహారాజును సమీపించి 'మహారాజా! కొందఱు నా పురాతనమిత్రులు ఇచ్చటకు వచ్చియున్నారు. మీకు సమ్మతమైనచో మీరు వారికి కొంత ధనమును ఒసగెదరు గాక!' యని అతనిని కోరెను. తోడనే మహారాజు వారిని తన చెంతకు రమ్మని పిలిచెను. ఆ పిలుపును విన్నంతనే భయముతో వారికి ప్రాణములు కంఠగతములయ్యెను. వారి మొగములలో కత్తివ్రేటునకు నెత్తుటి చుక్క లేకపోయెను. తప్పక యీ బ్రాహ్మణుడు మన చర్యను మహారాజునకు ఎఱిగించియుండును. ఇక మన ప్రాణములు మనకు దక్కవు అని వారు తమలో భావించుకొనిరి.

భయకంపితులైన చోరులు మెల్లగా తడబడుచు మహారాజు చెంతకు వచ్చిరి. జయదేవుని మిత్రములు అన్న భావముతో మహారాజు వారికి విశేషముగా స్వాగతసత్కారవిధు లాచరించి యిచ్చ వచ్చినంతధనమును, రత్నములను కోరుకొనుడని వారితో చెప్పెను.

ఆ మాట విని వారు పరమాశ్చర్యమును బొందిరి. జరుగు చున్నది ఏమియో వారికి అర్థముకాలేదు. తనను చంప నుద్యమించినవానిని కూడ ఎవడైన మిత్రముగా వాకొనునా? తనను హత్య చేయప్రయత్నించిన వానికి సొనందముగా లోకమునందు ఎవ్వడైన ధనమును ఇప్పింప బూనుట సంభవమా? ఆ చోరులు తమ కుటిల బుద్ధిని అనుసరించి యీ యేర్పాటంతయు జయదేవుని కుటిలనీతి యనియే భావించిరి. పెద్ద మొత్తము ధనధాన్యములను కోరి గ్రహించి వారు అచట నుండి వడివడిగా వెడలిపోవ నెంచుకొనుచుండిరి. వారికోరిక మేరకు సాదరముగా మహారాజు వారికి ఆతిథ్య మొసగి నూతన వస్త్రాలంకారపురస్సరముగా ధనము, ధాన్యమును సమర్పించి జయదేవునితోగూడి వారిని వీడుకొల్పెను. వారికి అర్పింప బడిన సంపత్తి పెద్ద మొత్తము, భారభూతమును అగుటచే మార్గమధ్యమున వారికి రక్షణ వ్యవస్థ యపేక్షితమగునని భావించి జయదేవుడు ఒక

యధికారిని నలుగురు సేవకులను కూడ వారికి తోడుగా నంపెను. త్రోవలో ఆ యధికారి వారు ఇంతటి ధనసన్మానము నందుకొనుటకు మూల మేమియో యెఱుగ నెంచి 'ఆర్యులారా! కామనారహితుడు, భక్తప్రవరుడును అగు జయదేవునితో మీకు గల సంబంధ మెట్టిది? మీకు ఇంతటి యపారసంపదను ఇప్పించి యతడు మీరు చేసిన ఏ యుపకారమునకు ప్రత్యుపకారము గావించెను? అని వారిని ప్రశ్నించెను.'

పాపవర్తనులగు ఆ చోరులు భగవానుని న్యాయమును, భయమును విస్మరించి కపట బుద్ధితో ఇట్లు బదులు చెప్పిరి – 'అయ్యా! మీ యధ్యక్షుడు, మేమును గూడి ఒక రాజ్యములో పని చేసితిమి. అప్పుడు మేము అధికారులము కాగా ఇతడు మాకు లోబడి పనిచేయు సేవకుడై యుండెను. ఇతడు ఒక మాఱు ఘోరకృత్యము ఏదియో యాచరింపగా అచ్చటి మహారాజు ఇతనికి శిరచ్ఛేదనదండనము విధించెను. అప్పుడు మేము ఇతనిపై దయ దలచి యితనికాలు సేతులను మాత్రము ఖండింప జేసి యితని ప్రాణములను గాపాడితిమి. ఆ రహస్యమును బయటపఱచెద మన్న భయముతో అతడు మాకింత విశేషసత్కారము గావింప జేసెను. మేము కూడ అతనికి కీడు గలుగునన్న భయముతో ఆ రహస్యమును బహిర్గత మొనరింపక యూరకున్నాము.'

ఈ మాటలు పలుకు చుండగా తత్కాలమందే భూమి పెద్ద శబ్దముతో బ్రద్దలై యా చోరులు నలుగురును యా భూవివరములోపలకు గూలి యసువులను బాసి మంట గలసిపోయిరి.

అంతట చోరుల వెంట వచ్చిన యధికారి వారు తెచ్చిన ధనము, ధాన్యమును అంతను మఱల తన వెంటనున్న సేవకుల భుజములకు ఎత్తి రాజధానికి మఱలి వచ్చి యా సమాచారము నెల్ల మహారాజునకు ఎఱిగించెను. ఆ సమాచారము నాలించి మహారాజు చకితుడై జయదేవుని బిలిచి యీ విషయమును అతనికి ఎఱుగ జెప్పెను. తోడనే జయదేవుని కన్నుల నుండి కన్నీరు ఉరలి పాఱసాగెను. అతనికి అతని ఖండిత

హస్తములు, పాదములును యథాపూర్వముగా పుట్టుకొని వచ్చి యతని శరీరము స్వాభావిక దశను పొందెను. అది చూచి మహారాజు మఱియింత పరమాశ్చర్యమును బొందెను.

అప్పుడతడు కుతూహలపరుడై జయదేవుని యుదంతమును సమగ్రముగా నెఱుగగోరెను. జయదేవుడు అంతట నిజమైన నిజోదంత మంతయు వినిపింప వలసినవా డయ్యెను. అతడు ఇట్లు ఎఱుగ జెప్పెను. 'మహారాజా నేను మిక్కిలి యభాగ్యుడను. వారి ప్రాణములు పోవుటకు నేను కారణభూతుడ నయితిని. నేను ధనమును అనర్థహేతువని భావించి నాకు వలదని పరిత్యజించితిని. కాని మహారాజు మఱి మఱి వేడగా వలదన్న ధనమును మఱల గ్రహించితిని. ఆ ధనము కారణముగానే ఆ నలుగురు మానవుల బుద్ధియు లోభావిష్టమై కలుషితమైనది. వారు నా చెంత నున్న ధనమును హరించుటకై నా కాలుసేతులను ఖండించి నన్ను నూతిలోనికి పడద్రోసిరి. ఈ విధముగా వారు ధనము వలన, ధన గ్రహణము వలన అనర్థము వాటిల్లుటను ప్రత్యక్షముగా చూపి నా కన్నులను దెఱపించి నా పాలిట మిత్రులుగా వ్యవహరించినవారైరి. వారి యుపకారభారము నాపై నిలిచిపోయినది. అందుచే మీ చేత వారికి ధనమును ఇప్పించితిని. వారి ధన కాంక్ష తిరిగిపోయినచో వారు పాపభూయిష్ఠమైన చోరవృత్తిని మాని మానవతాదృక్పథమును అవలంబింప గలరని భావించుట కూడ నేను వారికి అధికధనమును ఇప్పించుటకు గారణమైనది. నా కాలుసేతులు ఖండింపబడి నేను అవిటివాడ నగుటకు తప్పక నా పురాకృతకర్మము ఏదియో కారణమై యుండును. వారు కేవలము నా యీ దురవస్థకు, నిమిత్త మాత్రులు అయిరని నా భావము, ఈ నాడు నా కారణమున వారికి అప్రాకృతికమైన మరణము ప్రాప్తించిన దన్న వార్త వినుటతో నాకు ఏడుపు వచ్చుచున్నది. వారి వంక దోషమున్న భగవానుడు వారిని క్షమింప వచ్చును. కాని వారు ఇట్టి కఠినదండనమునకు గుఱి యగుటకు నేను కారణభూతుడనయితినన్న నా వలన నేమి యపరాధ

మయ్యెనో యెఱుగరాదు. ఏది యేమైనను ధనముతోడి సంబంధము బహు చెడ్డది. అనుట నిజము. నా దోషమువంకకు చూడక భగవానుడు నా యందు దయ వహించి నాకు యథాపూర్వముగా గాలుసేతులను ప్రసాదించుట పరమాశ్చర్యకారణము కాదా? మహారాజా! ఇట్టి నా ప్రియతమ దైవతలలామును, శ్రీకృష్ణ పరమాత్మను భజింప నేరని వాని కన్న అధికమందభాగ్యుడు వేఱెవడుండును?'

భక్త ప్రవరుడు జయదేవుడాడిన యీ మాటల నాలకించి మహారాజు చకితుడై అతని చరణముల మీద వ్రాలిపోయెను. భక్తుని హృదయములోని మహత్త్వమును ప్రత్యక్షముగా పరికించి ప్రభావితుడై యతడు ఆతని భక్తునిగా మారి పోయెను.

జయదేవుని భార్య పద్మావతి కూడ నీడ వలె అతనిని వెన్నంటి యుండి సర్వవిధముల అతనికి అనువర్తనురాలై మెలగు చుండెను. ఆమెయందు భగవద్భక్తి కూడ అపరిమితముగా నుండెను. ఆ భక్తికి కూడ ఆమె తన భర్తనే లక్ష్యముగా నెంచుకొని తనువును మనమును ఒడ్డి అతనికి సర్వవిధ పరిచర్యలను అందించుచుండెను. పాతివ్రత్యమహత్త్వమును చక్కగా నెఱిగిన యిల్లాలు ఆమె. జయదేవుడు రాజానుగ్రహమునకు పాత్రమైనవాడు. ఆ కారణమున మహారాజ్ఞి, రాజమాత మున్నగు శుద్ధాంతములోని మహిళా మణులు సైతము జయదేవుని యింటికి వచ్చి పద్మావతి చెంత గూర్చుండి సత్సాంగత్యలాభమును పొందుచుండువారు. మహారాజ్ఞి కూడ సౌశీల్యవంతురాలు. సాధ్వీమతల్లి. ధర్మపరాయణురాలు. పతివ్రతాలలామ. కాని యీమె మనములో ఒకింత యభిమాన ముండెను. తత్కారణముగా నామె యప్పుడప్పుడు ఏదియో యొక దుస్సాహసమునకు బాల్పడు చుండునది. ఒకనాడు ఆమె పద్మావతి విషయమున కూడ ఒక దుస్సాహస చేష్టకు పాల్పడెను. అది యెట్టిదనగా –

సత్సంగము సాగుచుండెను. ప్రసంగవశమున పద్మావతి సతీధర్మ మహత్త్వమును ఉగ్గడించుచు ఇట్లు పలికెను. "మహారాజ్ఞీ! పతిమరణించిన

మీదట ఏ స్త్రీ అతని శవముతోడ సహగమనము చేయునో, నిజమరయగా ఆమె ఉత్తమ శ్రేణికి చెందిన పతివ్రతగాజాలదు. నిమ్నశ్రేణికి చెందినదే యగును. ఉత్తమ శ్రేణికి చెందిన పతివ్రత పతి మరణించెనన్న వార్త విన్న వెంటనే ప్రాణపరిత్యాగము గావించును. పతి మరణవార్త చెవుల బడిన మీదట క్షణము కూడ ఆమె ప్రాణములు ఆమె బొందిలో నిలువవు." ఈ మాటలు మహారాజ్ఞికి రుచించలేదు. పద్మావతి తానొక మహాపతివ్రతనని తెలియజెప్పుటకు ఇట్టి ప్రగల్భవచనము లాడుచున్నదని యీమె భావించెను. తోడనే ఆమెలో ఈర్ష్య జనించెను. ఆమె యీ విషయమున పద్మావతిని పరీక్షించి చూడవలె నని తన మనములో నెనుకొని మౌనముగా తన రాజభవనమునకు దరలిపోయెను.

అనంతర మొకనాడు మహారాజుతోడ జయదేవుడు వెలికి వెడలియుండెను. అదియే తగిన యదను అనియెంచి మహారాజ్ఞి దంభవర్తనురాలై పైకి విషాదపు మొగము పెట్టుకొని పద్మావతి కడ కరిగి దొంగ యేడుపు సాగించుచు 'అమ్మా! ఎంత పని జరిగినది? ఎంత పని జరిగినది? జయదేవపండితుని ఈనాడొక సింహము, వనములో చంపివైచిన దమ్మా!' అని యీమెకు పిడుగు వంటి వార్తను కల్పించి వినిపించెను. తోడనే పద్మావతి 'కృష్ణ కృష్ణ' యనుచు తటాలున నేలమీదకు ఒరగిపోయెను. రాణి యులికిపడి చూడగా పద్మావతి చేతనారహితురాలై గోచరించెను. పరీక్షించి చూడగా ఆమెలోని ప్రాణపక్షులు ఎగసిపోయినట్లు తెలిసెను. తోడనే రాణికి భయముతోచెను. తాను చేసిన దుస్సాహసచర్యను తలచుకొని యీమె యెంతయో పశ్చాత్తప్తురాలయ్యెను. ఆమె తనలో అన్నన్నా! ఎంత పని చేసితిని? ఇప్పుడు నేను మహారాజునకు మొగమెట్లు చూపగలను? తమ గురుదేవులగు జయదేవునియొక్క ధర్మవర్తనురాలగు సతీమణి మరణమునకు నేను కారణభూతురాలను అయితినన్న విషయమునెఱిగినచో నా పతిదేవులకు ఎంత దుఃఖము గలుగును? మహానుభావులగు ఆ జయదేవులకు ఎంత పరితాపమొదవును? హా! హతవిధీ! ఎంతటి

దారుణకృత్యము నావలన నయ్యెను? అని తర్కించుకొనసాగెను. అంతలో జయదేవుడు అచ్చటకు వచ్చెను. పద్మావతి మరణవార్త మహారాజు కడకు కూడ చేరెను. అతడు కూడ అచ్చటకే ఏతెంచెను. అప్పుడు అతని దుఃఖమునకు కూడ అవధులు లేక పోయెను. రాణి సజీవురాలై యుండి మృతప్రాయురా లయ్యెను. ఒక్క మాఱుగా భూమి బ్రద్దలై యందు విలీనురాలను అయిపోయిన ఎంత బాగుండును? అని ఆమె తనలో తలపోయసాగెను. ఆమె యొక్క చెలికత్తెల వలన జరిగిన సంఘటన స్వరూపమును ఎఱిగి జయదేవుడు – 'తల్లులారా! ఆరాటపడవలదని మీరు రాణిగారితో చెప్పుడు! నా మరణవార్తను విని కదా పద్మావతి ప్రాణములు ఎగిసి పోయినవి? నేను ఇప్పుడు ఇక్కడకు సజీవుడనై వచ్చియున్నాను. కావున ఆమె ప్రాణములు కూడ వెనుకకు మఱలి రాక తప్పదు.' అని వారితో చెప్పెను. అనంతరము తాను మానసికముగా పద్మావతిని సజీవురాలిని చేయుమని భగవానుని ప్రార్థించెను. ఈ ప్రార్థనమును అతడు పద్మావతి శరీరముమీద తనకు ఆసక్తి యేదియో యుండుట చేత చేయలేదు. తానట్లు ప్రార్థింపకున్న, పద్మావతి పునరుజ్జీవితురాలు గాకున్న రాణి హృదయమునకు తగిలిన యాఘాతము ఆమెను యావజ్జీవము ములికి వలె కెలికి బాధించుచుండును. ఆమెకు ఆవేదనను తొలగింప నెంచియే యతడు పద్మావతిని జీవింప జేయుమని ప్రార్థించుట సంభవ మయ్యెను. భగవానుడు భక్తుని ప్రార్థనమును ఆలకించెను. నామసంకీర్తనము మొదలయ్యెను. జయదేవుడు పారవశ్యముతో పాడ సాగెను. క్రమక్రమముగా పద్మావతి శరీరములో ప్రాణసంచార మారంభ మయ్యెను. చూచుచు చూచుచుండగా ఆమె లేచి కూర్చుండెను. ఆమె కూడ హరినామధ్వని సేయ మొదలు పెట్టెను. ఆనందాతిరేకవశమున రాణికి ఏడ్పు వచ్చెను. ఆమె కళంకహారియైన శ్రీకృష్ణభగవానునకు కృతజ్ఞతా పూర్వకధన్యవాదము లర్పించికొనుచు భావికాలమున ఇట్టి దుస్సాహస చర్యకు ఎన్నడును పాల్పడనని శపథము చేసెను. అంతట

ఎల్లయెడల ఆనందము అలముకొనెను. జయదేవుని భక్తికి, పద్మావతి యొక్క పాతివ్రత్యనిష్ఠకు సంబంధించిన యశశ్చంద్రికలు ఎల్ల దిక్కులందును విస్తరించెను.

కొంతకాలము గౌడదేశములో నివసించి యనంతరము పద్మావతిని వెంట నిడుకొని, రాధాకృష్ణ విగ్రహాలను కేల గ్రహించి రాజానుమతిని పొంది జయదేవుడు స్వగ్రామమునకు వెడలిపోయెను. అక్కడ అతని జీవితము మఱింతగా శ్రీకృష్ణప్రేమ సుధారసధారలో వినిమగ్న మయ్యెను. ఆ దశలోనే అతడు గీతగోవింద కావ్యమును రచించెను.

ఒకనాడు జయదేవుడు గీతగోవిందమునకు సంబంధించిన కవితను ఒకదానిని రచించుచుండెను. కాని అది ఎంత ప్రయత్నించినను యుక్తమైన పదము తలపునకు రాక సమాప్త మగుట లేదు. అంతలో పద్మావతి వచ్చి 'స్వామీ! మీకు స్నానమునకు వేళ యైనది. వ్రాతపని ముగించి స్నానమాచరించి వచ్చుట మేలు' అని పలికెను. 'పద్మా! వెడల చున్నాను. వెడలక యేమి చేయుదును? ఒక గీతము రచించితిని. అందు కడపటి చరణము కుదురుటలేదు. ఇదిగో! వినిపించుచున్నాను. నీవు కూడ ఆలకించుమా! యని జయదేవుడు –

స్థలకమలగంజనం మమ హృదయరంజనం
జనితరతిరంగ పరభాగమ్
భణ మసృణవాణి కరవాణి చరణద్వయం
సరస రసద లక్తరాగమ్.

స్మరగరళఖండనం మమ శిరసి మండనమ్ – అని పాడి వినిపించి దీని యనంతరము ఏమి వ్రాయవలెనో స్ఫురించుట లేదు' అని మాఱు పలికెను. 'దానికై ఆరాటపడనేల? గంగాస్నానము చేసి వచ్చి శేషచరణమును వ్రాసికొందురు గాక!' యని పద్మావతి యనెను.

'సరియు! కానిమ్ము! గ్రంథమును, కలము, సిరాబుడ్డిని తీసి భద్రపఱచుము. నేను స్నానము చేసి వచ్చెదను' అని పలికి జయదేవుడు స్నానమాచరించుటకు వెడలి పోయెను. కొన్ని నిమిషముల మీదట శ్రీకృష్ణభగవానుడు జయదేవుని రూపమును దాల్చి వచ్చి 'పద్మా! ఒకింత ఆ గీతగోవింద కావ్యమును ఇటు తెమ్మా!' యనెను.

'ఇప్పుడే కదా మీరు స్నానము చేయవెడలితిరి? ఇంతలోనే మఱలి వచ్చితిరేల?' యని పద్మావతి విస్మయముతో ప్రశ్నించెను.

'త్రోవలోనే కడపటి చరణము తలపునకు వచ్చి వెనుకకు మఱలి వచ్చితిని' అని ఛద్మవేషధారి, మహామాయావి యగు శ్రీకృష్ణుడు బదులు పలికెను. అప్పుడు పద్మావతి గ్రంథమును, కలమును, సిరాబుడ్డిని తెచ్చి యతనికి అందించెను. అప్పుడు జయదేవ వేషధారి యగు భగవానుడు **'దేహి మే పదపల్లవ ముదారమ్'** అని వ్రాసి యాగీతమును పూర్తి చేసెను. అటు పిమ్మట స్నానమునకు పద్మావతి చేతనే నీరము సిద్ధము చేయించుకొని స్నానము చేసి పూజాది నిత్యకార్యక్రమమును నిర్వర్తించి పద్మావతి చేత వండబడిన అన్నాదికమును భగవానునకు నైవేద్యము పెట్టిన పిదప కడుపార తానారగించి మంచముపై పరుండి విశ్రమించెను.

అనంతరము పాత్రలో శేషించిన పదార్థమును తన స్వామి ప్రసాదముగా పద్మావతి ఆరగింప సాగెను. అంతలో స్నానార్థము బయటకు వెడలిన జయదేవుడు మఱలి వచ్చెను. అతనిని గాంచి పద్మావతి సంభ్రమాశ్చర్యమునకు లోనయ్యెను. తనకంటె ముందు తన భార్య భోజనము చేయుచుండగా చూచి జయదేవునకు కూడ విస్మయము గలిగెను. అప్పుడు – 'పద్మా! ఇదేమి? ఈనాడు రాధామాధవులకు ఆరగింపు సేవ చేయుటకు ముందుగా, నాకు భోజనము పెట్టుటకు ముందుగా నీవు ఏల భుజించుచున్నావు? నీ యీ విధమైన యాచరణమును నేను ఇంతకు ముందు ఎన్నడును చూచియుండలేదు' అని పద్మావతిని ప్రశ్నించెను.

అప్పుడామె యిట్లు బదులు చెప్పెను – 'ఇదేమి? మీరు ఏమి మాట యనుచున్నారు? మీరు ఇప్పుడే కదా కవిత్వములోని శేషచరణమును పూరించుటకొఱకు మార్గమధ్యమునుండి మఱలి వచ్చితిరి? ఇప్పుడిప్పుడే కదా స్నానము, పూజనము, భోజనము పూర్తి చేసికొని శయనించితిరి? మఱి యింతలోనే మీరు ఎక్కడనో బయట స్నానము చేసినవారివలె ఎట్లు రాగలిగితిరి? మిమ్ము చూడగా ఈ మాయాస్వరూపము ఏమియో తెలియరాకున్నది' ఆమె మాటలు విని జయదేవుడు వెంటనే తన శయనస్థానమునకు పోయి చూచెను. అక్కడ మంచముమీద అతనికి ఎవ్వరును కానరాలేదు. అవశ్యముగా యీనాటి ఈ సంఘటనము భక్తవత్సలుడగు భగవానుని కృపాస్వరూపమే యని యతడు తెలిసికొనెను. అటుపిమ్మట అతడు మఱల 'పద్మా! గ్రంథమును ఇటు తెమ్ము! కవితా చరణము ఎట్లు పూరింపబడెనో చూచెద గాక!' యని భార్యను అడిగెను.

పద్మావతి గ్రంథమును తెచ్చి యిచ్చెను. జయదేవుడు దానిని తెఱచి చూచెను. అందుతాను వ్రాయని పదప్రయోగము అతనికి గానవచ్చెను. ఈ ప్రయోగమే నా మనములో మెదలుచున్నది. కాని సంకోచవశమున వ్రాయకుంటిని అని అతడు తనలో అనుకొనెను. అనంతరము అతడు రెండు చేతులను మీదికెత్తి రోదనము చేయుచు భగవానుని ఈ విధముగా వేడుకొనసాగెను – 'ఓ కృష్ణా! నందనందనా! రాధికామనోహరా! వ్రజవనితా జనతానంద కారణా! గోకులేశ్వరా కరుణాసాగరా! ప్రాణాధిక ప్రియుతమదైవతలలామా! గోపాలా! నేను ఏమి యపరాధము చేసితినని నన్ను వీడి పద్మావతిని సఫలమనోరథురాలిని గావించితివి?' ఇట్లు పలుకుచు అతడు పద్మావతి యొక్క భోజన పాత్రమునుండి శ్రీహరి ప్రసాదమును ఎత్తుకొని తినివేయ నారంభించెను. 'స్వామీ! వలదు! వలదు! నా యుచ్ఛిష్టము (ఎంగిలి) ఇది మీరు తినవలదు' అని యేడ్చి యేడ్చి పద్మావతి యతనిని వారింప సాగెను. అయినను హరిప్రసాదలోభియైన యా భక్తజయదేవుడు ఆమె మాటను పాటి చేయుటలేదు.

ఈ సంఘటనము గడచిన పిదప అతడు శీఘ్రముగా తన గీతగోవింద కావ్య రచనమును సమాప్తము చేసి యానందతన్మయుడై యందలి గీతములను సుమధురస్వరమున ఆలపించుచు ఇందందు తిరుగాడ నారంభించెను. అతని కోమలగీతముల నాలకించి యాలకించి తన్మయత్వమును పొందనెంచి నందనందనుడు గుప్త రూపమున అతనిని వెంబడింప నారంభించెను. ఆహా! ఎంతటి భక్తానుగ్రహము?

జయదేవునకు గంగాస్నాన నియమ ముండెను. ఆ గంగ గ్రామమునకు 18 క్రోసుల దూరమున నుండెను. వార్ధక్యదశలో అతడు అంతదూరము పోవజాలకుండె ననియు, తత్కారణముగా గంగయే తరలి వచ్చి యతని యింటికి చేరువగా పాఱసాగె ననియు, మకరవాహనగా గంగ యతనికి ప్రత్యక్షముగా దర్శన మొసగెనని యు, ఆ సందర్భమునందే జయదేవుడు గంగాపరముగా ఒక గీతమును రచించి యాలపించె ననియు నొక జనశ్రుతి యున్నది. ఆ మధురగీతము ఇదిగో! ఇది –

దేవి సురేశ్వరి భగవతి గంగే
త్రిభువనతారిణీ! తరలతరంగే
శంకరమౌళి విహారిణీ విమలే
మమ మతి రాస్తాం తవ పదకమలే॥ 1

భాగీరథి సుఖదాయిని మాతః
తవ జలమహిమా నిగమే ఖ్యాతః
నాహం జానే తవ మహిమానం
పాహి కృపామయి మా మజ్ఞానమ్॥ 2 (ఇత్యాదిగా)

అవసానదశయందు జయదేవుడు పతిపరాయణురాలగు తన భార్యను పద్మావతిని, భక్తుడగు పరాశరుడు, నిరంజనుడు మున్నగువారిని వెంట నిడుకొని బృందావనమునకు విచ్చేసెను. అచ్చట శ్రీకృష్ణభగవానుని మధురలీలలను మాటికి మాటికి వీక్షించుచు ఆనందమును చూఱగొనుచు

కాలము బుచ్చెను. కడకు ఆ పుణ్యదంపతులు ఆ బృందావనమునందే దేహత్యాగము చేసి భగవానుని నిత్యనికేతనమగు గోలోకధామమునకు వెడలి పోయిరని జనులు చెప్పుదురు.

జయదేవుడు స్వగ్రామమునందే దేహత్యాగము చేసెననియు, అతని యింటికి చేరువగానే యతని సమాధి మందిరము నిర్మింప బడియున్న దనియు కొందరు వాకొందురు.

జయదేవుని సంస్మరణార్థము ప్రతియేట మాఘ సంక్రాంతిదినమున కెందుబిల్వగ్రామములో నేటికిని పెద్ద తీర్థము సాగింప బడుచున్నది. అందు లక్షకు మించి జనులు పాల్గొనుచుందురు.

భక్తునకు జయము! భక్తపాలకుడగు భగవానునకు జయము!

★ ★ ★

శ్రీరూపసనాతనులు

అప్పుడప్పుడు లోకములో భగవంతుని ప్రతిరూపములు అనదగు మహాపురుషులు పుడమిపై నావిర్భవించుచుందురు. అట్టివారు ఆవిర్భవించినప్పుడు వారితోబాటు కొన్ని వైలక్షణ్యము గల విభూతులు గూడ పుట్టుకొని వచ్చి యుందందు నివురు గప్పిన నిప్పువలె దాగి యుండు చుండును. అవి అదను వచ్చినప్పుడు ఆ మహాపౌరుషుల సంకేతములను అనుసరించి వెలుగులోనికి వచ్చి తమ పవిత్రకార్యసాధనకు పాటుపడుచుండును. ఇట్టి విభూతులని యెన్నదగినవారే శ్రీరూపుడు, సనాతనుడును అనువారు. అప్పటికే బెంగాలు రాష్ట్రములోని నవద్వీపము అనబడు విద్యాకేంద్రమునందు నిమాయి పండితుడు అను పేరుతో ప్రవర్తిల్లిన చైతన్య మహాప్రభువు ఆవిర్భవించి యుండెను. ఈ మహామహుని లోకపావనలీలతో తమ తోడ్పాటును అందించుటకై శ్రీ రూపుడు, సనాతనుడును అనువారు జన్మించి యుండిరి.

నాలుగు వందల యేండ్లకు ముందు హుస్సేనుషా అను మహమ్మదీయ శాసకుడు ఒకడు బెంగాలు సింహాసనమును అధిష్ఠించి యుండి రాజ్య పాలనము చేయుచుండెను. అతడు తనను బెంగాలు రాజ్యపు చక్రవర్తిగా ప్రకటించుకొనెడివాడు. ఆనాడు బెంగాలు రాజధాని 'రాజమహలు'నకు చేరువగా నెలకొన్న గౌడనగరమునందు ఉండెను. (ఆ నగరమిప్పుడు లేదు. పాడువడిపోయినది.) ఈ పాదుషా మహమ్మదీయుడైనను ఇతని కడ ప్రాయికముగా ఉన్నత పదవులను హిందువులే గ్రహించి పనిచేయు చుండువారు. వారు హిందువులైనను వారి యాచరణములు మహమ్మదీయాచరణములనే పోలిసాగుచుండెడివి. ఆ పాదుషా చెంత నున్న ఉన్నత పదాధికారులలో దక్షిణదేశమునకు చెందిన బ్రాహ్మణ సోదరులిరువురు మంత్రి పదవులను అధిష్ఠించి యుండిరి. వీరు తమ దేశమును వీడి వచ్చి బెంగాలులోని 'రామకేళి' యను గ్రామములో నివసించి తమ విద్యాబుద్ధుల ప్రాబల్యము

కారణముగా ఇంతటి యున్నతస్థాయిని అందుకొనగలిగిరి. రాజ్యములో వీరు దబీరుఖాసు, సాకరమల్లికు అను పేర్లతో ప్రసిద్ధి చెందిరి. ముందు పేర్కొనబడిన శ్రీరూపసనాతను లనగా వీరే. వీరిలో సనాతనుని తొలుతటి పేరు అమర్, శ్రీరూపుని పేరు సంతోష్. హుస్సేనుషా వీరిని తన కుడి భుజముగా భావించువాడు. వీరు పాదుషా చేయు ప్రతి పనికి తోడ్పడు చుండువారు. ధనలోభము కారణముగా ప్రాయికముగా వీరు పాదుషా చేయు అనుచితకృత్యములను సైతము ప్రతిఘటింపక సమర్థనమే చేయుచుండువారు. హైందవ దేవాలయములను నాశనము చేయుట, గోవధమును సాగించుట, దేశమును ధ్వంసము చేయుటవంటి క్రూరములైన మహమ్మదీయ కృత్యములలో ప్రత్యక్షముగా పాల్గొనకున్నను పరోక్షముగా మహమ్మదీయులుగానే కానవచ్చువారు. వీరి కృత్యములు కూడ వారి కృత్యములనే పోలు చుండెను. అర్థమును (ధనము) గోరి మానవుడు ఎంతటి యనర్థమునకైన పాల్పడును గదా! ఈ బ్రాహ్మణబాలకులు ఇరువురును అర్థమును అపేక్షించి యెంతటి హీనకృత్యము చేయుటకైన వెనుకాడువారుగారు. వీరు పుష్కలముగా ధనోపార్జనము చేసిరి. రామకేళి గ్రామములో వీరు 'రాజా'లని పిలువబడువారు. ఈ విధముగా వీరిలో ఎన్ని అవలక్షణములు ఉన్నను వీరి హృదయములు మాత్రము హిందువుల భావములతోనే నిండియుండెను. శ్రీరాముడన్నను, శ్రీకృష్ణుడన్నను వీరి మనములలో అనురాగము ఉండెను. బ్రాహ్మణ సాధువులయందు భక్తి యుండెను. రామకేళి గ్రామములో తఱచుగా వీరియింటి దగ్గఱ తీర్థప్రజవలె బ్రాహ్మణులు చేరుచుండువారు. వీరి చెంత ధనమునకు కొఱత లేదు. మనములలో వలయునంత ఔదార్యమున్నది. ఇకేమి కావలయును? వీరు విరివిగా ధనవితరణము చేయుచుండువారు. వీరివలన ఎందఱో పండిత బ్రాహ్మణులు భరణపోషణములను అందుకొనుచుండువారు. ఈ విధముగా ప్రవర్తించుచున్న కారణమున ఈ యధికారుల యెడల హిందుమాత్రునకు ఎప్పునికిని అప్రసన్నత యన్నది కలిగెడిది కాదు. వీరి కడగొట్టు సోదరుడు అనుపముడు అనువాడు ఇంటికడ నుండువాడు. వీరు ఇరువురును ఎక్కువ

సమయము పాదుషా చెంతనే ఉండి గౌడనగరములో కడపు చుండువారు.

చైతన్యమహాప్రభువు యొక్క ప్రశస్తిని ఆలకించి వీరికి ఆ మహాత్మునియందు స్వాభావికముగానే శ్రద్ధాభక్తులు ఉదయించెను. ఆ శ్రద్ధాభక్తులు క్రమముగా పెంపొంది విరహవేదనగా పరిణతములు అయ్యెను.

దబీరు ఖాసు, సాకరమల్లికుల యుల్లములలో ప్రబలిన దర్శనాభిలాష చైతన్యమహాప్రభుని మనమును ఆకర్షించెను. ప్రేమ సంబంధమైన యాకర్షణము ప్రబలమై యుండును. ఆ యాకర్షణము చైతన్య మహాప్రభువును ఇక నిలువనీయలేదు. ఆ ప్రభువు బృందావనమునకు అరుగు నెపమున గంగాతీరమార్గమున పయనము సాగించి క్రమముగా గౌడనగరమును సమీపించెను.

చైతన్య మహాప్రభువు గౌడనగరమును సమీపించినంతనే అతని వెంట నున్న భక్తబృందము చేయు తుములహరినామఘోషముతో నగరమంతయు నొక్క మాఱుగా మాఱుమ్రోగి పోయెను. ఆ కోలాహలము నాలకించి పాదుషా శత్రురాజు ఎవడో తన నగరము మీదకు సేనాసమేతముగా దండెత్తి వచ్చెనని తలచి భయకంపితుడయ్యెను. ఎవని చెంత ఎంత యధికముగా ధనము ఉండునో, వానికి అంత యధికముగా భయము కూడ గలుగుచుండును. ధనికులకు, మహారాజులకు సుఖము అధికముగా ప్రాప్తించును అని సాధారణ జనులు తలపోయుచుదురు. కాని అడుగడుగున వారికి గలుగు భయంకరదుఃఖమును ఆ సాధారణ జనులు ఊహింపనైన జాలరు. హుస్సేనుషా భయమును వీడక కేశవుడను ఉన్నత పదాధికారిని రావించి కోలాహలమునకు కారణమును అరసెను. 'జహాపనాహ్! (జగద్రక్షకా) భయపడవలసిన పనిలేదు. ఒక సన్యాసి తన శిష్యవర్గముతో బృందావనమునకు అరుగుచున్నాడు. వినవచ్చునది వారి కోలాహలమే యని ఆ యధికారి బదులు చెప్పెను. కాని పాదుషా మనమును సందేహము వీడలేదు. ఇంత కోలాహలము కొందఱు శిష్యుల వలన గలుగునట్టిది కాదు అనియే యతడు భావించుచుండెను. అతడు విచారణ చేయించెను. ఆ సన్యాసి వెంట వేనవేలు శిష్యులు సాగిపోవు చున్నారని తెలిసెను.

అయినను పాదుషా భయము తొలగలేదు. తోడనే అతడు దబీరు ఖాసును, సాకర మల్లికును రావించి సన్యాసి విషయమున వారిని ప్రశ్నించెను. ఆ సోదరులు ఇరువురును ఇంతవఱకు ఆ మహాపురుషుని దర్శించి యుండలేదు. అయినను చైతన్యమహాప్రభువు సాధారణ మానవమాత్రుడు కాడని, అతడు సాక్షాత్తు భగవానుడే యని వారికి ప్రగాఢమైన విశ్వాస ముండెను. వారు ఆ మహామహుని గుణములను కొనియాడుచు పాదుషాతో 'జహాపనాహ్! సాక్షాత్తు భగవానుడే ధరాతలముపై అవతరించి సన్యాసివేషమున సంచారము సాగించుచుండెనా? యని తోచుచున్నది. ఎవరి యనుగ్రహమున మీరు ఈనాడు ఈ గౌడదేశమునకు పాదుషాలు కాగలిగితిరో, ఆ భగవానుడే నేడు మీ ద్వారము చేరువకు వచ్చియున్నాడు' అని బదులు చెప్పిరి.

'నిజమే. నాకును అట్లే తోచుచున్నది. నేను గౌడ భూమికి పాదుషాను లక్షలాదిగా గల జనులను జీవింప జేయవలెనన్న జీవింపజేయ గలవాడను. చంపివేయవలెనన్న చంపివేయగలవాడను. అయినను నేను ఒక సాధారణ సేవకునకు ఒకనాడు జీతము ఈయకుంటినేని అతడు కూడ ఇచ్ఛాపూర్వకముగా నా ప్రతిమాటను చెవిని పెట్టక నిరాకరింప నారంభించును. ఒక యారు మాసములకాలము నేను నా సైనికులకు భృతిని చెల్లింపకుంటినేని వారే కుట్ర చేసి నన్ను మట్టుపెట్టుటకు ఉద్యమింప వచ్చును. మఱి యీ ఫకీరును చూడగా ఇతడు చేత గవ్వ కూడ లేనివాడు. అయినను ఇతని వెంట వేనవేలు మానవులు తమ యిండ్లను, వాకిండ్లను వీడి వచ్చి నిద్రాహారము లెఱుగక బానిసలై తిరుగాడు చున్నారు అన్న ఇంతకన్న ఆశ్చర్యజనకమైన విషయము ఏమి యుండును? ఈ విధమైన శక్తి భగవానుని యందుగాక మఱి యెవ్వరియందు ఉండును?' అని అతడు సవినయముగా పలికెను.

పాదుషా యీ విధముగా పలికినవి యేవో మంచి మాటలే పలికెను. కాని స్వేచ్ఛాచారి, నిరంకుశుడును అయిన ఆ పాదుషా మహాప్రభుని బృందమునకు ఏమి కష్టము గలిగించునో యని సోదరులకు ఇరువురకును భయమగుచునే యుండెను. ఆ మహాప్రభువు ఇచ్చట నుండి యెంత

శీఘ్రముగా వెడలిపోయిన అంత మంచిదని వారు ఆలోచింప సాగిరి. కాని ఆ మహాప్రభువును దర్శింపవలెనని వారికి ప్రబలమైన కోరిక కలుగుచుండెను. ఆ కారణమున వారు ఆ స్వామిని బయట నున్న వానిని బయట నుండియే పంపివేయుటకును ఇష్టపడకుండిరి. ఆ మహాప్రభువు కూడ తాను ఎట్లును గౌడనగరమును చేరినవాడయ్యెను. అతడు దర్శనమీయక యెట్లు వెడలిపోవును. అతడు వచ్చినది కూడా ఆ సోదరులను ఇరువురను సంసారకూపమునుండి సముద్ధరించుటకే కదా! నాటి రాత్రియందు ఆ సోదరులు ఇరువునురును ఆ చైతన్య మహాప్రభుని కొలువులో ప్రవేశించిరి. ఆ మహాప్రభువు ఆ సమయమునందు తన యిష్టదైవతముపై ప్రబలమైన ప్రేమదశను పొంది సమాధిస్థితుడై యుండెను. శ్రీ నిత్యానందుడు ప్రయత్నించి సమాధిదశకు భంగము గలిగించి యీ సోదరులను ఇరువురను ఆ మహాప్రభువునకు పరిచితులను జేసెను. వారు వెంటనే ఉత్తరీయములను మెడకు చుట్టుకొని శ్రద్ధాభక్తి పురస్సరముగా ఆ స్వామి చరణయుగళిపై వ్రాలిపోయి యిట్లు ప్రార్థించిరి.

"ప్రభూ! మీరు పతితులను, దీనులను సముద్ధరించుటకే యీ యవనిపై అవతరించితిరి. మావంటి జాలి దలపవలసిన పతితజనులు మఱి మీకెందు లభింతురు? మీరు జగాయిని, మధాయిని ఉద్ధరించితిరి. కాని వారు అజ్ఞానవశమున పాపము జేసినవారు. మీరు ముందుగా మమ్ము ఉద్ధరింపవలయును. కాని వారిని కాదు. కారణము ఏమన్న మేము బుద్ధి పూర్వకముగా పాపాచరణమునకు బాల్పడినవారము, నిజముగా పతితులము అని చెప్పదగిన వారము మేమే – నాథా! ఇప్పుడు మీరు దక్క మాకు శరణ మొసగువారు వేఱుగా ఎవ్వరును లేరు."

దబీరుఖాసు, సాకరమల్లికులను ఈ యిరువురును గౌడసామ్రాజ్యసంచాలకులు అనదగినవారు. ఒకవిధముగా చెప్పవలెనన్న మొత్తము బెంగాలు రాష్ట్రము మీద వీరి ప్రభుత్వమే సాగుచుండెనని చెప్పవచ్చును. పాదుషా యొక్కడు దక్క దక్కినవారు అందఱును వీరికి లోబడినవారే. ఇంతటి మహాబలవంతులు ప్రభుకృపకు పాత్రులు కావలెనన్న అందులకు సాధనము

ఒక్కటియే యున్నది. అది దైన్యము. వారు దానినే అవలంబించిరి. దీనత్వము మూర్తీభవించెనా యనునట్లు ఇరువురును చైతన్యమహాప్రభుని చరణారవిందముల మీద చాగిలబడిపోయిరి. వారు ఆ ప్రభువుతో చెప్పుకొన్నది వారి హృదయములోని మాటయే. శబ్దాడంబరము ఏమియు లేదు. అత్యుక్తి ఆవంతయును లేదు. నిజముగానే వారు లోకములో తమను అందఱికన్న అభాగ్యులనుగాను, దీనులను గాను తలపోయుచుండిరి. ఇట్టి దీనత్వమే భగవానునకు అత్యంత ప్రీతిపాత్రమైనది.

మహాప్రభువు వారి నిష్కపటదైన్యమును గాంచి ముగ్ధుడయ్యెను. ఆయన హృదయముదయార్ద్రము అయ్యెను. అప్పుడు ఆ మహాప్రభువు–"నాయనలారా! లెమ్ము! దీనత్వమును వీడుము! మీ యీ దైన్యమును చూడగా నా హృదయము విదీర్ణమగుచున్నది. మీరు నాకు అత్యంత ప్రీతిపాత్రులురు. నేను ఇక్కడకు మిమ్ము ఇరువురను గలిసికొనుటకే వచ్చితిని. మీరు నిశ్చింతతను వహించుడు! శీఘ్రముగనే మీరు శ్రీకృష్ణభగవానుని కృపకు పాత్రులు గాగలరు. నేడు మొదలు మీరు సనాతనుడు, రూపుడు అను పేర్లతో వ్యవహరింపబడగలరు." అని పలికి వారికి ఊఱట గలిగించెను. ప్రభువు ఆడిన యీ మాటలను ఆలకించి రూపసనాతనుల హృదయాలు అమందానందభరితములు అయ్యెను. వారు కృతజ్ఞతాభావము ఉట్టిపడునట్లు మహాప్రభుని మొగమువంకకు నిర్నిమేషముగా చూడ నారంభించిరి. ఆ మహాప్రభువు సాక్షాత్తు భగవానుడే యన్న విశ్వాసము వారి హృదయాలలో కుదురుకొనెను. వస్తుతః వారు ఆ సమయమున మహాప్రభువునందు శ్రీకృష్ణభగవానునే దర్శించిరి. క్షణములో వారి జీవన ప్రవంతి దిశ మారిపోయెను.

అనంతరము మహాప్రభువు సనాతనుని సూచనను అనుసరించి యింత మంది జనుల బృందమును వెంట నిడికొని బృందావనమునకు పోవు సంకల్పమును విరమించుకొని తాను వచ్చిన మార్గమున వెనుకకు నీలాచలము (పూరీజగన్నాథక్షేత్రము) వంకకు మఱలి పోయెను.

ఇక్కడ రూపసనాతనుల పరిస్థితిలో ఊహింపరాని మార్పు సంభవించెను. వారిలో వైరాగ్య ధార ఒక్కమాఱు పొంగిపొరలెను. రాజ్యవైభవము, మంత్రిపదవి యున్న వారి మదులలో రోత జనించెను. రాజకార్యనిర్వహణము చేయుచు క్షణము కాలము గడపుట కూడ వారికి నారకీయయంత్రణవలె మహాదుఃఖకారణమయ్యెను. వారు మహమ్మదీయప్రభువు తమకు అనుగ్రహించిన బంగారు సంకెలలను త్రెంచుకొని శీఘ్రముగా బయల్పడుటకు ఉపాయములను ఆలోచింప నారంభించిరి. సనాతనుని సెలవు గొని రూపుడు కొంతకాలము తనకు సెలవును ఇమ్మని పాదుషాను కోరి స్వగ్రామమగు రామకేళికి వెడలిపోయెను. సనాతనుడు అనారోగ్యము అను నెపము పెట్టి తన శిబిరమందే నిలిచియుండసాగెను. రూపుడు తన యింటికి చేరి చూడగా అది యతనికి నాలుగు వంకల కనలుచున్న దావానలము వలె కనుపట్టెను. అతడు ఎంతయో ప్రయాసపడి కూడబెట్టుకొన్న విలాససామగ్రులు అన్నియు అతనికి విషమువలె చూపట్టుచుండెను. ధనసంపదతో నింపబడిన భండారము వల్లకాడు వలె పొడగట్టుచుండెను. పెద్ద పెద్ద సుందరభవనాలు శూన్యములుగా తోచుచుండెను. హృదయభూమికపై శుభకారిణియగు వైరాగ్యధార పాఱినప్పుడు ఎవరికైన ఇట్టి దశయే ప్రాప్తించుచుండును. రూపుడు ఇరువురు గుప్తచరులను చైతన్యమహాప్రభుని సన్నిధికి నీలాచలమున కంపెను. ఆ మహాప్రబువు ఆ యెడనుండి కదలి బృందావనమునకు పయనమైన వెంటనే వచ్చి తనకు ఆ విషయమును ఎఱిగింపుడని వారికి ఆదేశమిచ్చెను. ఇతని యనుజుని పేరు అనుపముడు. అతడు ముందునుండియు ఈ మార్గమందు అభిరుచి గలవాడే. అతడు కూడ అన్నతోడగూడి తాను కూడ ఇల్లు వీడుటకు వలయు సన్నాహము చేసికొనియే యుండెను. రూపునకు, సనాతనునకు సంతానము లేదు. కాని అనుపమునకు జీవుడను ఒక కుమారుడు ఉండెను. ఉన్న ధనములో కొంత వానికి ఇచ్చి తక్కినది యెల్ల పేదలకు కొల్లబెట్టబడెను. అంతలో పాదుషా సనాతనుని పట్టి బంధించెనని వార్త వచ్చెను. అట్లు జరుగునని వీరు ముందే యెఱుగుదురు. రూపుడు, అనుపముడును శీఘ్రముగా తాము

ఉన్న తావును వీడి వెడలిపోవుటకు నిశ్చయము చేసుకొనియుండిరి. గుప్తచరులు నీలాచలమునుండి మఱలి వచ్చి ప్రభుని బృందావనగమనవార్తను వారికి ఎఱిగించిరి. తోడనే ఆ సోదరులు ఇరువురును బృందావనమునకు వెడలిపోయిరి. వెడలునప్పుడు వారు సనాతనునకు ఒక లేఖ వ్రాసిరి. 'మేము ఇరువురము బృందావనమునకు వెడలుచున్నాము. ఏదియో ఒక విధముగా పాదుషా పీడను వదలించుకొని నీవు కూడ వచ్చి వేయుము. ఆవశ్యకవ్యయము నిమిత్తము పదివేల రూపాయల సొమ్మును ఇక్కడ అముక వైశ్యవరుని చెంత నుంచి వెడలు చున్నాము' అని వారు ఆలేఖలో సూచించిరి.

ఎల్లవేళల ధనవైభవముతో తులదూగుచు మదమత్తులై చరించిన రూపునకు, అనుపమునకును ఈనాడు విలక్షణమైన దశ ప్రాప్తించెను. వారు నేడు బహుమూల్యవస్త్రాభరణములను అన్నిటిని విసర్జించి ఒడలిపై ఒక గుడ్డ పేలికను, కటిప్రాంతమందు ఒక కౌపీనమును మాత్రము ధరించిరి. వారికి నిద్రాహారపానీయముల చింతలేదు. చేతిలో సొమ్ము రూపమున చిల్లిగవ్వ కూడ లేదు. ఈ నాడు రూపుడు, అనుపముడు ఇరువురును పేదలలో నిరుపేదలుగా మాఱి ఎల్ల కష్టములకు తల యొగ్గి కాలినడకను సాగిపోవు చుండిరి. అయాచితముగా ఏది లభించిన దాని నారగించి, రాత్రికి ఎచ్చటకు చేరిన అచ్చట పడియుండ నారంభించిరి. అయినను వారి మనములలో ఆవంతయు దుఃఖము లేదు. ప్రభువుయొక్క చరణారవిందాలను సందర్శింప వలెను అన్న కోరిక వారిని పిచ్చివారిని జేసివైచినది. వారి మనములలో క్రొత్తక్రొత్త యుత్సాహపు మొలకలు బయలువెడల నారంభించెను. వారు ముందు దెసకు పదములు ఇడుచున్నకొలదియు అవి ప్రవర్ధమానములుగా సాగెను. వారి యుద్దేశ్యము ఒక్కటి, లక్ష్యము ఒక్కటి. ఆశ యొక్కటి. విశ్వాసము ఒక్కటి. అది ప్రభువు యొక్క చరణారవిందములను సందర్శింప వలెనన్న కోరిక. ఈనాడు భవబంధ హరణదక్షమైన ప్రభువు యొక్క సుందరముఖారవిందమును గాంచి నా కన్నులు చరితార్థములు గాగలవని మధురభావనలు చేసికొనుచు ఆ సోదరులు ఇరువురును క్రమముగా

ప్రయాగకు చేరిరి. అక్కడకు చేరిన వెంటనే ఆ మహాప్రభువు అక్కడనే యున్నట్లు వారికి తెలిసెను. ఎందు పొగ యున్న అందు అగ్నితప్పక యుండును అన్న విధముగా ఏ యెడ స్త్రీపురుషులు ప్రేమోన్మత్తులై యవిరామముగా హరినామ సంబంధ మగు తుములఘోషము గావించి వాయుమండలమును పవిత్రము చేయుచుందురో ఆ యెడ చైతన్య మహాప్రభువు ఉండునని భావింప వలయును.

శ్రీ చైతన్యచరితామృతములో ఇట్లు వ్రాయబడియున్నది-

ఆ. యమునయైన, గంగ యైన నేనాడైన
ముంచెనే 'ప్రయాగ'ఁ బొంగి పారలి,
ముంచె నేడు దానిఁ బూర్తిగాఁ జైతన్య
ప్రభుని భూరికృష్ణభక్తిధార.

మహాప్రభుని సన్నిధికి క్రమముగా సోదరులు ఇరువురును చేరిరి. ఆ సమయమున ప్రభువు వేణీమాధవుని దర్శించి ప్రేమాతిరేకమున నాట్యము చేయుచుండెను. ఇరువురు సోదరులును దూరము నుండియే ఆ యద్భుత ప్రేమలీలా చమత్కారమును అవలోకించిరి. కొంత తడవైన పిదప మహాప్రభువు తన శిబిరమునకు వెడలిపోయెను. అప్పటికి మధ్యాహ్నమయ్యెను. ఆవేళ స్వామి యేకాంతమందు ఉండునని యెఱిగి యిరువురు సోదరులును మహాదైన్యము వహించి యనాథులవలె కంపించుచు, రోధించుచు, పడుచు, లేచుచు పోయి యా మహామహుని చరణయుగళిపై వ్రాలిపోయిరి. ఇరువురును ప్రేమావేశము కారణముగా ఒడలెఱుగని దశలో నుండిరి. కొంత తడవు అయిన మీదట ఒకింత ధైర్యము వహించి 'ఓ దీనదయాపరతంత్రా! ఓ పతితపావనా! ఓ యశరణశరణదా! మావంటి పతితులకు మీరు గాక మఱి యెవ్వరు ఆశ్రయమిత్తురు' అని వేడుకొనిరి.

మహాప్రభువు ఇంతకు ముందు రూపుని కేవలము ఒక్కనాటి రాత్రివేళ మాత్రమే చూచెను. అయినను ఇప్పుడతనిని చూడగానే గుర్తించి చిఱునవ్వు వెలయించుచు ఆ ప్రభువు ఇట్లు పలికెను.

'లెమ్ము! లెమ్ము! దైన్యమును వీడుము! మీమీద శ్రీకృష్ణభగవానునకు

అపారమైన కృప యున్నది. ఆ కారణముననే ఆ స్వామి మిమ్ము మహాభయంకర విషయకూపమునుండి సముద్ధరించినాడు. రూపా! భగవానునకు భక్తునిపై నున్న యంతప్రీతి మఱి యెవరిమీదను ఉండదు. భగవానుడుకూడ ఇట్లు చెప్పి యున్నాడు -

నమేఽభక్తశ్చతుర్వేదీ మద్భక్తః శ్వపచః ప్రియః,
తస్మై దేయం తతో గ్రాహ్యం స చ పూజ్యో యథాహ్యహమ్.

"నాయందు భక్తిలేనివాడు నాలుగు వేదాలను ఎఱిగినవాడైనను నాకు ప్రియుడు కాడు. నా యందు భక్తి గలవాడు చండాలుడైనను నాకు ప్రీతిపాత్రుడు. అట్టివానికి నేను నా ప్రేమ నర్పింతును. అతని వలన ప్రేమను గ్రహింతును. లోకములో నేనెట్లు పూజ్యుడ నగుదునో అట్లే నా భక్తుడు కూడ పూజ్యుడగును." ఈ భావము గల ఈ శ్లోకమును చదివి యా మహాప్రభువు ప్రేమాశ్రువులను ఒలికించుచు ఆ సోదరులను ఇరువురను బలిమిమీఱ చెంతకు లాగుకొని యక్కున చేర్చుకొని ఆలింగనము చేసుకొని దగ్గఱ కూర్చుండ బెట్టుకొని సాదరముగా సమాచారములను అడుగ నారంభించెను. అప్పుడు రూపుడు 'ప్రభూ! సనాతనుని పాదుషా జైలులో నిర్బంధించెనట' అని పలికెను. 'ఆరాట పడకు! సనాతనుడు చెఱ నుండి విముక్తుడు అయ్యెను. అతడు నా చెంతకు వచ్చుచున్నాడు' అని ప్రభువు బదులు చెప్పెను. రూపుడు, అనుపముడును ఆనాడు ప్రభువు చెంతనే నిలిచిపోయిరి. అచ్చటనే ప్రసాదమును గ్రహించిరి. ఆ సమయమున వల్లభభట్టు అనుపేరు గల వైదికుడైన యాజ్ఞిక బ్రాహ్మణుడు ఒకడు మహాప్రభువును దర్శించుటకు వచ్చెను. చాలసేపు అతడు కృష్ణప్రేమ సంబంధమైన చర్చ సాగించెను. ప్రభువు అతనికి రూపుని, అనుపముని పరిచితులను జేసెను. వారు దూరమునుండియే యా బ్రాహ్మణునకు సాష్టాంగనమస్కారము చేసిరి. భట్టు కూడ ప్రతినమస్కారము చేసి వారిని కలిసికొనుటకు యత్నించెను. కాని వారు ఇరువురును దూరముగా తొలగి 'బ్రాహ్మణవరేణ్యా! మేము అస్పృశ్యులము, పామరులము మమ్ము తాకకుడు!' అని పలికిరి. ఆ

మాట విని భట్టునకు ఆశ్చర్యము కలిగెను. కాని భక్తులైన యా సోదరులలోని యాదీనత్వమును గాంచి మహాప్రభువు పరమానందమును పొందెను. వారి జీవనవృత్తాంతమును ఎఱిగి 'ఆర్యా! తమరు కులీన బ్రాహ్మణులు. వీరు జాతి భ్రష్టులు. వీరిని స్పృశించకుడు!' అని తాను కూడ భట్టుతో పలికెను. అప్పుడు భట్టు ఇట్లు పలికెను. – 'ప్రభూ! ఎవరి పవిత్ర రసనపై నిరంతరము శ్రీకృష్ణనామము నర్తించుచుండునో వానికంటె మంచివాడు లోకములో మఱి యెవ్వడుండును? భాగవతములో దేవహూతి యేమన్నదో చూడుడు!

అహో బత శ్వపచోఽతో గరీయాన్
యజ్జిహ్వాగ్రే వర్తతే నామ తుభ్యమ్,
తేపుస్తపస్తే జుహువు స్సస్నురార్యా
బ్రహ్మానూచుర్నామ గృణంతి యే తే. (3-33-7)

అనగా 'ఎవని నాలుక మీద మీ నామము వర్తిల్లునో అతడు చండాలుడైనను శ్రేష్ఠుడే. ఎవరు మీ నామమును స్మరించుచుందురో వారే తపస్సు చేసిన మహాపురుషులు. వారే హోమాలు చేసినవారు. వారే తీర్థస్నానము లాచరించినవారు. వారే వేదాధ్యయనము చేసినవారు.' అని భావము.

భట్టు ముఖమున ఈ శ్లోకమును ఆలకించి మహాప్రభువు అతనిని ప్రశంసించుచు మఱల ఇట్లు పలికెను. మీరు అన్న మాట నిజమే.

శుచిస్సద్భక్తి దీప్తాగ్ని దగ్ధదుర్జాతికల్మషః
శ్వపాకోఽపి బుధైః శ్లాఘ్యో న వేదజ్ఞోఽపి నాస్తికః,
భగవద్భక్తిహీనస్య జాతిశ్శాస్త్రం జపస్తపః
అప్రాణస్యైవ దేహస్య మండనం లోకరంజనమ్.

ఎవని హీనజాతిగత పాపములు అన్నియు సద్భక్తి యనెడు ప్రజ్వరిల్లిన అగ్నిచేత దగ్ధములు అయిపోవునో అతడు చండాలుడైనను పండితులకు కొనియాడదగినవాడే యగును. ఆస్తిక్యబుద్ధి లేనివాడు వేదవేత్త అయినను ప్రశంసకు పాత్రుడు గాడు.

ఈ విధముగా ప్రేమపూర్వక సల్లాపములు సాగించుచు మహాప్రభువు రూపుని, అనుపముని పెక్కు దినములు తన చెంతనే ప్రయాగలో నిలిపి యుంచుకొనెను. ఆ స్వామి రూపుని చేత ఒక మహాకార్యమును సాధింపజేయ నెంచి యుండెను. ఆ ప్రభువు బృందావనములోని దివ్యప్రేమలీలను పునరుజ్జీవింప జేయ సంకల్పించుకొనెను. అందుచేత రూపుని ఏకాంతమందు ఉంచి పెక్కు దినముల వఱకు మహాప్రభువు అతనికి భక్తితత్త్వ సంబంధమైన వాస్తవిక ప్రబోధము గావించెను. అనంతరము తాను కాశీ నగరమునకు వెడలి పోవుచున్నానని రూపునితో చెప్పెను. తమ యెడబాటును నేను సైపజాలను అని రూపుడనెను. అయినను ప్రభువు మెత్తపడలేదు. ప్రభూ నాకు ఎడము అయినచో నా ప్రాణములు నిలుచుట కష్టము అని రూపుడు మఱల రెట్టించెను. అట్లు రెట్టించినను ప్రభువు ప్రభావితుడు గాలేదు.

'రూపా! ఇది యేమి? నా మాట వినుము! బృందావనమునకు వెడలిపొమ్ము! నా యాదేశమును పాటించుము! లోకకల్యాణము కొఱకు పాటుపడుము! నిజసుఖాభిలాషను వీడి బృందావమునకు వెడలుము! అనంతరము నీకు ఇచ్ఛ గలిగినచో నన్ను నీలాచలములో (పూరీజగన్నాథక్షేత్రము) కలిసికొనుము!' అని మఱల మఱింత రూక్షముగా పలికి ప్రభువు ఆ యెడనుండి కదలి వెడలిపోయెను. అంతట రూపుడు మూర్ఛాక్రాంతుడై పడిపోయె నట. (ఈ మాట రూప చైతన్య చరితామృతములో వ్రాయబడి యున్నది.)

అనంతరము రూపుడు, అనుపముడు ఇరువురును బృందావనము చేరిరి. అక్కడ అప్రయత్నముగా వారు మహారాజు సుబుద్ధిరాయని దర్శించుట సంభవ మయ్యెను. భగవానుని లీల విచిత్రమైనది. పూర్వము ఒకప్పుడు రూపుడు ఆ సుబుద్ధిరాయని కడ మంత్రిగా పనిచేసినవాడు. ఆ సుబుద్ధిరాయుడు ఆనాడు స్వయముగా గౌడాధిపతిగా ఉన్నవాడు. అతని కడ పూర్వము హుస్సేను సేవకుడుగా పనిచేసెను. ఒకమాఱు ఏదియో అపరాధము కారణముగా సుబుద్ధిరాయుడు అతని వీపుమీద కశాఘాతము

(కొరడాదెబ్బ) చేసెను. ఆ దెబ్బ తీవ్రమై హుస్సేను వీపుమీద చాల కాలము ఆనవాలు నిలిచిపోయెను. ఆ యవమానమును మనములో నుంచుకొని యనంతరకాలమునందు ఆ హుస్సేను ఏదియో కుట్ర జేసి యా సుబుద్ధిరాయని గద్దెదింపి తాను స్వయముగా గౌడశాసకుడయ్యెను. హుస్సేనుఖాను అను తన పేరును హుస్సేనుషాగా మార్చుకొనెను. అతడు ప్రాణములు హరించకుండునంతటి మంచితనమును మాత్రము ఆ సుబుద్ధిరాయని యెడల ప్రదర్శించి యతనిని సాదరముగా తన చెంతనే నిలిపికొనెను. ఒకనాడు దైవవశమున అతని రాణి అతని వీపుమీద ఉన్న కొరడాదెబ్బ మచ్చను చూచి యందులకు కారణము ఏమని యతనిని అడిగెను. సుబుద్ధిరాయని కశాఘాత మని యతడు ఆమెకు ఎఱిగించెను. అప్పుడామె యెంతయో కుపితురాలై తన భర్త వలదన్నను వినక యా సుబుద్ధిరాయని నోట బలవంతముగా ఎంగిలినీరు పోయించెను.

ఆ కారణమున సుబుద్ధిరాయడు జాతిభ్రష్టుడయ్యెను. అతడు ఇచ్ఛాపూర్వకముగా మహమ్మదీయుల నీటిని గ్రోలినవాడు కాడు. అయినను నాటి సమాజము అతనికి తగిన ప్రాయశ్చిత్త వ్యవస్థ యేదియు చేయక అతనిని జాతి నుండి బహిష్కృతుని గావించెను. రాజ్యభ్రష్టుడైన ఒక పేదవాని మొఱను ఎవరు ఆలింతురు? అతని కడ ధనమే పర్యాప్తముగా ఉండెనేని ఏ ప్రాయశ్చిత్త విధానము మూలముననో అతడు సంఘములో తగిన సముచితస్థానమును పడసియుండెడివాడు. సుబుద్ధిరాయడు సంఘ బహిష్కృతుడై మహాదుఃఖమున క్రుంగుచు ప్రాయశ్చిత్తమును అపేక్షించి కాశీ నగరమునకు అరిగెను. అచ్చటి పండితులను తగిన ప్రాయశ్చిత్త విధానమును ఏర్పరచుడని అతడు కోరెను. పొంగుచున్న నేతిని త్రాగి ప్రాణపరిత్యాగము చేయుట యొక్కటే ప్రాయశ్చిత్త విధానము అని వారు బదులు చెప్పిరి. ఆ మాట విని సుబుద్ధిరాయడు భయకంపితుడై యీ విధముగా ప్రాణపరిత్యాగము చేయుటకంటె జాతి భ్రష్టుడనై యేదియో యొక విధముగా జీవించి యుండుటయే మేలని తలచికొనెను. అతడు ప్రాణపరిత్యాగము చేయలేదు. కాని తన నికృష్ట జీవితమును

తలచుకొని నిరంతరము చింతామగ్నుడై యుండువాడు. ఈ విధముగా హిందూజాతికి చెందిన వారు ఎందఱు రత్నము లనదగిన పురుషులు అనాడు బలవంతముగా ధర్మభ్రష్టులు గావింప బడిరో కదా?

చైతన్యమహాప్రభువు అని పిలువబడు నొక దీనజనోద్ధారకుడగు మహాపురుషుడు విచ్చేసెననియు, ఆయన ఎవరి యెడలను హేయభవమును ప్రదర్శింపక యెల్లరను తనవారినిగా ప్రేమించుననియు ఒక మాఱు సుబుద్ధిరాయడు ఆలకించెను. అంతట అతని వేదనాపూరితమైన యంతఃకరణములో ఒకింత యుత్సాహము ఉదయింపగా అతడు ఆ మహాప్రభువుకడకు పరుగిడి పోయెను. ప్రభువును దర్శించి తన యుదంతమును ఆయన కెఱిగించి తనకై తగు ప్రాయశ్చిత్త వ్యవస్థ చేయవలెనని ఆయనను ప్రార్థించెను. "కృష్ణనామైవ కేవలమ్" శ్రీకృష్ణభగవానుని పరమపావననామమే సర్వపాపములకు ప్రాయశ్చిత్తచర్య అని యాస్వామి బదులు చెప్పెను. ఆ యాజ్ఞను శిరసావహించి సుబుద్ధిరాయడు బృందావనమునకు వెడలిపోయెను. అక్కడ అతడు తన జీవనమును శ్రీకృష్ణనామస్మరణమునందు సంలగ్నము గావించెను. ఈనాడు ఆ సుబుద్ధిరాయనినే ఆకస్మికముగా చూచి రూపునకు, అనుపమునకు అమందానంద మయ్యెను. ప్రభువు యొక్క కృపవలన గౌడనగరమును ఒకప్పుడేలిన మహారాజును, అతని మంత్రియు ఇరువురును ఒకే చోట ఒకేలక్ష్యముతో బృందావనములో చేరి యుండుట సంభవ మయ్యెను.

(2)

రూపుని, అనుపముని బృందావనమునకు పంపి మహాప్రభువు కాశికి వెడలి అక్కడ చంద్రశేఖరుని యింట నిలిచెను. ఇక్కడ సనాతనుడు గౌడప్రాంతపు చెఱసాలలో ఉండి రూపుని లేఖను అందుకొని తదనుగుణముగా అచ్చట నుండి సాధ్యమయినంత శీఘ్రముగా బయల్పడి మహాప్రభువు సన్నిధికి వెడలిపోవ సంకల్పించుకొనెను. అదను చూచి ద్వారరక్షకునకు ఒకింత లంచము చూపి కారాగారమునుండి బయల్పడెను. 7 వేల దీనారములు ఇచ్చి

యాతని సహాయముతోనే రాత్రి రాత్రి గంగానదిని తరించి యావలి తటమునకు చేరి ముందు దెసకు పయనము సాగించెను. ఈశానుడు అను సేవకుడు ఒకడు అతనిని అనుసరించి యుండెను. ఆ సమయమున సనాతనుని కడ ధనము ఏమియును లేదు. ఒక చినిగి తూటులు పడిన పంచెను మాత్రము అతడు ధరించి యుండెను. అన్నపానీయములను గాని, యితర వస్తువులనుగాని అతడు తన వెంట నుంచుకొనక వింటినుండి విడివడిన బాణము వలె బృందావనము దిక్కుగా సాగిపోవసాగెను. రేయనక పగలనక నడచి యతడు ఒకనాటికి 'పాతాడా' అను గ్రామమునకు చేరెను. అక్కడ స్థానికుల సహాయమున కొండను దాటి ముందునకు సాగెను. అతని అనుయాయి అయిన ఈశానుడు గుప్తముగా తన చెంత 8 దీనారములను (బంగారు నాణెములు) ఉంచుకొనెను. స్థానికులు నాణెములపై గల యాశ చేత సనాతనుని యెడల విశేషాదరమును చూపసాగిరి. వారి మనములలో పాపపుటాలోచన దాగియుండెను. వారు ఆనాటి రేయి సనాతనుని, ఈశానుని చంపి వారికడ నున్న దీనారములను హరింప నెంచి యుండిరి. ధనము యొక్క మహత్త్వమే యట్టిది. మాంసఖండమును అపేక్షించి మాంసాహారులగు పక్షులు తమలో తాము కలహించుకొనుచు మరణించు చుండును. అట్లే ధనము అను మాంసపు ఖండమును అపేక్షించి యా మానవలోకములో కూడ హింసామయములైన పోరాటములు సాగుచుండును. ఎక్కడ ధనము ఉన్న అక్కడకే చోరులు, దగాకోరులు, ముఖస్తుతులు చేయువారు, చుట్టాలవారును అధికముగా చేరుచుందురు. ఆ యెల్లర లక్ష్యమును ఒకటియే. అయినను వారి వారి సాధనములు మాత్రము వేఱువేఱు. ఒకడు ఎదుటివానిని వెంటనే చంపివైచి వాని ధనమును హరించిన, మఱియొకడు తీయతీయని మాటలతో ఏమరజేసి, మోసగించి హరించును. ఈ ధనము కారణముగానే యీనాడు స్థానికులు సనాతనుని మీదను, ఈశానుని మీదను అధికారమును చూపసాగిరి. అప్పుడు సనాతనుడు తనలో ఇదేమి? వీరు ఇంతగా నా మీద ఆదరమును ప్రదర్శించుచున్నారేల?

ఇందులకు ఏది కారణమై యుండును? వీరిలో లోభమును గలిగించు వస్తువు ఏదియునాదగ్గఱ లేదయ్యెను. అని తర్కించుకొనెను. అంతలో అతనికి ఈశానునికడ ఏమైన ఉన్నదేమోయన్న యనుమానము గలిగి 'అన్నా! నీ దగ్గఱ ధనము ఏమైన ఉన్నదా?' యని అతనిని అడిగెను. ఈశానుడు ఒకదీనారమును గుప్తమొనర్చికొని తన కడ ఏడు మాత్రము దీనారములు ఉన్నవని బదులు చెప్పెను. అప్పుడు సనాతనుడు మఱల 'అన్నా! ఈ పాపమును నీకడ ఏల దాచియుంచితివి? ఇప్పుడు నీవు తెలిపియుండకున్న ఈ స్థానికులు ఈరేయి మన ప్రాణములను హరింపక మనలను విడచువారు గారు' అని యీశానునితో పలికి యతని కడనుండి ఆ ఏడు దీనారములను గ్రహించి స్థానికులకు ఇచ్చివైచెను. అటుపిమ్మట ఈశానుని కడింకను ఒక దీనారము ఉన్నట్లు తెలిసికొని దానిని అతని కడనే ఉండనిచ్చి యతనిని వెనుకకు స్వదేశమున కంపివైచెను. అంతట గాలిపీడ వదలెను. అనంతరము సనాతనుడు సుఖముగా ఒంటరిగా ముందునకు పయనింపసాగెను. సాయంసమయ మగునప్పటికి అతడు హాజీపూరు అను తావునకు చేరెను. అక్కడ అతడు ఒక్క యెడ కూర్చుండి బిగ్గఱగా శ్రీకృష్ణుని పావననామ సంకీర్తన మారంభించెను. అతనికి అందే అచ్చమైన శాంతి, సుఖమును గోచరింప సాగెను. అట్లు గోచరించుట కూడ వాస్తవమే.

సనాతనునకు శ్రీకాంతుడను బావమఱది (సోదరి భర్త) యొకడు ఉండెను. అతడు ఆ దినములలో హాజీపూరులోనే యుండెను. అతడు గౌడప్రభుని కొఱకు గుఱ్ఱాలను కొనుటకై అచ్చటకు వచ్చియుండెను. సాయంత్ర మయ్యెను. శ్రీకాంతుడు ఒక వంక ఆ యెడ సేద దీర్చుకొను చుండెను. అతని చెవులలో హరినామధ్వని ప్రవేశించెను. ఆకంఠస్వరము పరిచితమైన దాని వలె నుండెను. వెంటనే శ్రీకాంతుడు లేచి యా ధ్వని వచ్చుదిక్కున కరిగెను. అక్కడ సనాతనుని గాంచి యతడు స్తంభితుడయ్యెను. అతడు ఇంతవఱకు సనాతనుని గూర్చి యే మాటయు విని యుండలేదు. అతనికి ఎంతయో యాశ్చర్యమయ్యెను.

చూడగా అతనికి సనాతనుడు జీర్ణమైన శరీరముతో, చినిగి తూటులు పడి మలినమైన వస్త్రముతో, పెచ్చు పెరిగిన గడ్డముతో, ముఖమునందు ఉట్టిపడు వైరాగ్యలక్షణముతో బిగ్గఱగా నున్మత్తుని వలె హరినామధ్వని చేయుచు గానవచ్చెను. శ్రీకాంతుడు సనాతనుని పలుకరించి తెలివిలోనికి వచ్చునట్లు చేసెను. అతని చెంత కూర్చుండి యతని యీ పరిస్థితికి కారణ మెఱుగగోరెను. సనాతనుడు తన యుదంత మంతయు సంగ్రహముగా ఎఱిగించెను. 'ఇది యుక్తము కాదు. ఇంటికి మఱలి రమ్ము' అని శ్రీకాంతుడు అతనిని కోరెను.

ఇంటికే వెడలుచున్నాను. ఇంత వరకు ఇంటిని విస్మరించి యుంటిని. పరగృహమును స్వగృహమని భ్రమించుచు కాలము బుచ్చితిని. ఇప్పుడు స్వగృహము జాడలను ఎఱుగగలిగితిని. అందుచేతనే పరుగిడుచున్నాను. జ్ఞాననేత్రములు తెఱవబడిన మీదట స్వప్న మందిరాలలో ఉండుటకు ఎవడు ఇచ్చగించును? ఈ సంసార సంబంధమైన మాయా మయగృహమే గృహముగా ఎంత వఱకు తోచుచుండునో అంతఱకు నిజమైన గృహము మానవునకు దూరముగానే ఉండిపోవును. తన నిజమైన గృహము ఇదియని తెలిసినప్పుడు మానవుడు దాని వంకకు ఈ విధముగానే ఉన్మత్తుడై పరుగులు పెట్టును. ఈ మాటలను వినికూడ శ్రీకాంతుడు సనాతనునకు నచ్చజెప్పి అతనిని వెనుకకు గొనిపోవుటకు విశేషప్రయత్నము చేసెను. మార్గమును ఎఱుగనివాడు, ఎఱిగినవానికి ఏమని నచ్చజెప్పగలడు? వైరాగ్య సముద్రము పొంగి పొరలు చోట విషయములు అను పెంటలకు స్థానము ఎట్లుండును? శ్రీకాంతుని మాటలు సనాతనముని జాగృతహృదయమును స్పృశింప లేకపోయెను. అవి పైపైనే యెగసి సమసిపోయెను. ఇక ఇతడు ఎంత చెప్పినను వినువాడు కాడని శ్రీకాంతుడు అవగతము చేసుకొనెను. అటుపిమ్మట అతడు సనాతనుడు మఱలి వచ్చునన్న ఆశను వీడి అతనికి దారిబత్తెముగా ఏదియో కొంత యీయబోయెను. కాని దానిని అతడు స్వీకరించలేదు. ఆ సమయమున చలి యధికముగా ఉండెను. అందుచేత శ్రీకాంతుడు

సనాతనునకు మూల్యవంతమైన దుశ్శాలువను ఒకదానిని ఈయనెంచెను. కాని దానిని కూడ అతడు గ్రహింప సమ్మతించలేదు. ఇదియే కదా భక్తులు, భగవత్ప్రేమోన్మత్తులైన సాధువులు నగువారి విలక్షణదశ? వారికి ఆకలిదప్పుల చింత యుండదు. చలివేడిముల బాధ యుండదు.

"శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సంగవివర్జితః" (12-18) అని గీతకూడ చెప్పుచున్నది.

అంతట శ్రీకాంతుడు రోదింప నారంభించెను. అతని రోదనమును ఆలకించి సనాతనుని హృదయము ద్రవించిపోయెను. భక్తులు కోమలహృదయులై యుందురు. పరుల దుఃఖమును వారు చూడలేరు. ఆ కారణమున శ్రీకాంతుని మనమునకు శాంతిని, సుఖమును గలిగించుటకై సనాతనుడు అతనినుండి ఒక కంబడిని మాత్రము గ్రహించి వెంటనే అటనుండి తిరిగి ముందునకు సాగిపోయెను. శ్రీకాంతుడు మౌనముగా రోదించుచు నిలిచిపోయెను.

మహాప్రభువు ఎందుఉండెనని సనాతనుడు ఎవ్వరిని అడుగలేదు. తెల్లవాఱిన మీదట ఆ ప్రభువు ఎందును దాగియుండ జాలడని సనాతనుడెఱుగును. ఆ మహాప్రభువు ఏ యెడనున్న ఆయెడ వేనవేలు స్త్రీపురుషులు తుములముగా హరినామధ్వని చేయుచునే యుందురు. తుఫాను దూరమునుండియే గోచరమగును. హరినామధ్వనిరూపమగు ఈ సుఖదాయకమైన తుఫాను కూడ అట్లే దవ్వులనుండి గోచరమగునట్టిదియే. మహాప్రభువు ఏమార్గమునందు, ఏ గ్రామమునందు, ఏ నగరమునందు సాగిపోవుచుండునో ఆయా తావులయందు ఒక ఆనవాలును వీడిపోవు చుండును. హరినామ సంబంధమగు తుముల ఘోషమే ఆ యానవాలు. కాబట్టి సనాతనుడు మహాప్రభువును వెదకుకొనవలసినవాడు కాలేదు. అతడు భగవత్ప్రేమ పరవశుడై హరినామపరాయణులైన వారినే మహాప్రభుని మార్గము నెఱిగించు చిహ్నములుగా ఎన్నుకొని క్రమముగా కాశీ నగరమును చేరెను. అట్లు యతడు మెల్లగా చంద్రశేఖరుని గృహము చెంతకు జేరెను. అక్కడ అతనికి తనయన్వేషణ లక్ష్యము ప్రత్యక్షము అయ్యెను. వేనవేలు

స్త్రీపురుషులు కూడి హరినామధ్వని చేయుచుండిరి. సనాతనుని హృదయము ప్రఫుల్లిత మయ్యెను. శరీరము పులకితమయ్యెను. అతడు క్రమముగా చంద్రశేఖరుని గృహద్వారము చరణములను ధ్యానించుకొనుచుండెను. లోనికి పోవుటకు అతనికి ధైర్యము చాలకుండెను. తన పాపములను తలచుకొనగా అతనికి ఏమి ఇట్టినాపై ప్రభువు కృప జూపునా? నావంటి ఘోరనారకీయ ప్రాణివంకకు ఆ ప్రభువు కన్నెత్తి చూచునా? అని సందియ మగు చుండెను. అతని హృదయములో కపట వృత్తి, దంభవృత్తి ఆవంతయును లేదు. సరళము, పరిశుద్ధమును అగు హృదయముతో తానొనర్చిన పాపములను తలచుకొని పశ్చాత్తాపమున క్రుగ్గుచు ఈనాడు సనాతనుడు ప్రభుని శరణమును గోరుచున్నాడు. ఇట్టి దశయందే యెవరికైన భగవానుని కృపాకటాక్ష స్వరూపము అనుభవములోనికి వచ్చుచుండును. మానవుడు కల్లకపటముల నెల్ల వీడి అత్యంత దైన్యము వహించి దీనదయాపరతంత్రుడు, పతిత పావనుడును అగు పరమాత్మను ఎప్పుడు శరణు పొందునో అప్పుడే భగవానుడు వానికి తన చేయి నందించి చెంతకు చేర్చుకొని అక్కున గదియించి యాలింగనము చేసుకొనుటయే కాక అతనిని సమస్త పాపతాప విముక్తుని గావించి శాశ్వతముగా అభయుని జేసివేయును. తెచ్చి పెట్టుకొన్న పశ్చాత్తాపము, కృత్రిమమైన దీనత్వము, హృదయపూర్వకము కాని స్తోత్రముల వలన మాత్రము భగవానుడు ఎన్నడును ప్రసన్నుడు కాడు. ఆ స్వామికి కపటి యెవడో, నిష్కపటుడు ఎవడో, బాగుగా తెలియును.

సర్వజ్ఞుడైన మహాప్రభువు గృహములోపల నుండియే సనాతనుడు బయట తనకై వేచియుండుటను తెలిసికొనెను. తోడనే ఆ స్వామి 'గుమ్మము దగ్గఱ వైష్ణవుడు ఒక్కడు కూర్చుండి యున్నాడు. లోపలకు పిలుచుకొని రమ్మా!' యని చంద్రశేఖరునితో చెప్పెను. తదనుసారముగా చంద్రశేఖరుడు వెలికి వచ్చి చూడగు అతనికి అచ్చట ఎవ్వరును గానరాలేదు. అతడు మఱలి వచ్చి 'బయట వైష్ణవుడు ఎవ్వడును లేడు' అని ప్రభువుతో చెప్పెను. 'గుమ్మము దగ్గఱ ఎవరైన కూర్చుండి యున్నారా?' అని ప్రభువు మఱల

అడిగెను. 'ఫకీరు వంటివాడు ఎవడో ఒకడు ఉన్నాడని' చంద్రశేఖరుడు బదులు చెప్పెను. 'పొమ్మా! పోయి వానినే లోనికి గొని రమ్మా!' యని ప్రభువు మఱల అనెను. సనాతనుడు ధరించిన బట్టలు వైష్ణవుల బట్టలను పోలినవి కావు. అయినను అతని అంతరము విష్ణుమయమైనది. అంతరమును గుర్తించుట అంతర్యామికి సాధ్యమగు పని కదా!

ప్రభువు అన్న మాట వినగా చంద్రశేఖరునకు ఆశ్చర్యమయ్యెను. ఈనాడు ప్రభువు ఈ ఫకీరును ఏల పిలిపించుచున్నారు? అని అతడు ఆలోచింపసాగెను. కాని మహాప్రభుని ముందు ఏమైన మాటాడుటకు అతనికి ధైర్యము చాలలేదు. అతడు మఱల వెలుపలకు అరిగి తమరు ఎవరు? తమను స్వామి పిలుచుచున్నారు అని సనాతనునితో చెప్పెను. ఆ మాటలు సనాతనుని యెడల విద్యుత్తరంగముల వలె పని చేసెను. అతని హృదయములో హర్షము, ఆశ, చింత, భయము, భక్తి, లజ్జ మున్నగు అనేక విధములగు భావతరంగములు ఉదయింప నారంభించెను. ఏమేమి? ప్రభువు పిలుచుచున్నారా? నిజముగానే నన్ను పిలుచుచున్నారా? మీరు పొరపడుట లేదు కదా? ప్రభువు నన్నేల పిలుతురు? వేఱెవ్వరినో పిలుచుచుండవచ్చును. అని యతడు సందేహమును ప్రకటించప నారంభించెను. కాదు! తమరినే పిలుచుచున్నారని మఱల చంద్రశేఖరుడు అనెను. అయినను సనాతనుని సందేహము నివృత్తము గాలేదు. అతడు తనలో ఇట్లు తర్కించుకొనసాగెను. 'ప్రభువు నన్ను చూచినది ఒక్కమాటే కదా! ఈ విధముగా నిత్యము ఆయన యెందఱనో వ్యక్తులను చూచుచుందురు. నేను జాతిభ్రష్టుడను. పామరుడను. ఇట్టినన్ను ప్రభువు జ్ఞప్తియందు ఉంచుకొనుట సంభవమా? సంభవమైనను ఆయన నన్నెందులకు పిలుతురు? నేను వచ్చితిని అన్న వార్తను ఆ స్వామికి తెలిపి యుండలేదే! వారు నన్నేల రమ్మందురు?' ఈ విధముగా ఆలోచించుకొని అతడు 'అయ్యా! మీరు లోనికి పోయి ప్రభువు ఎవరిని పిలుచుచున్నారో మరి యొక్క మాఱు తెలిసికొనుడు' అని చంద్రశేఖరునితో పలికెను.

అతని విచిత్రభావరీతులను పరికించి, ప్రలాపములను ఆలకించి యాశ్చ

ర్యచకితుడై 'ఆర్యా! ప్రభువు మిమ్మే పిలుచుచున్నారు. లోపలకు దయచేయుడు!' అని చంద్రశేఖరుడు మఱల నొక్కి చెప్పెను.

సనాతనుని హృదయములో ఒక్క మాఱుగా ఆనందసాగరము పెల్లుబికెను. అయినను అతడు తన స్వాభావికదైన్యమును వీడక అపరాధము చేసినవాని వలె మౌనముగా లోనికి అరిగి ప్రభుని చరణముల మీద దండమువలె వ్రాలిపోయెను. అతని కన్నుదోయి నుండి యజస్రముగా అశ్రుధారలు పాఱసాగెను. అప్పుడు అతడు ఇట్లు వేడుకొనెను. – 'ప్రభూ! నేను పామరుడను. యావజ్జీవము కామక్రోధాది షడ్వికారములను సేవించినవాడను. విషయభోగము లందే సుఖము ఉన్నదని భావించిన పరమమూఢుడను. రేబవళ్ళు నీచులతో గూడి నీచ కార్యములను ఆచరించినవాడను. నాయీ మానవజన్మమును నిరర్థకముగావించి కొన్నవాడను. నావంటి పాపాత్ముడు, అధముడు, నీచుడు, కుటిలుడు మఱి యెవడు ఉండును? దేవా! యీనాడు మీ పాదారవిందములను శరణు వేడుకొనుచున్నాను. మీ స్వభావసిద్ధమగు దయామయత్వమును తలపులో ఉంచుకొని యీదీనునకు మీ చరణముల చెంత ఒకింత స్థానమును అనుగ్రహింపుడు! ఈ యధమునకు మీ చరణములు తప్ప వేఱు శరణము లేదు'.

ప్రభువు సనాతనుని పలుకులను ఇక వినలేక పోయెను. ఆయన హృదయము దయార్ద్రవిత మయ్యెను. సనాతనుని బలవంతముగా లేవనెత్తి తటాలున అక్కున జేర్చుకొని బిగియార కౌగిలించుకొనెను. సనాతనుని యశ్రుధార పావనగంగాఝురివలె ఉరలి ఉరలి స్వామి యొక్క శరీరమును, చరణములను తడిపి వేయసాగెను. మహాప్రభుని కన్నుదోయి నుండి ప్రేమాశ్రుధారలు ఉరలి ఉరలి సనాతనుని సిరమును అభిషేకించి వానిని శీఘ్రముగా పాప విముక్తుని గావింప నారంభించెను. భగవానుడు, భక్తుడును ఒకరిని ఒకరు కూడినప్పుడు వారి కన్నుల నుండి వెలువడు ప్రేమాశ్రుధార సమస్తపాపహారిణి యగు గంగకు ఎంతమాత్రమును తీసిపోవునది కాదనవచ్చును.

'ప్రభూ! నన్ను ఏల స్పృశింతురు? నాయీ పాపిష్ఠి శరీరము మీరు స్పృశింతదగినది కాదు. ఈ ఘృణితము, కల్మషభరితము అయిన శరీరమును మీరు తాకవలదు.' అని సనాతనుడు వాపోవసాగెను. అప్పుడు ప్రభువు అతనికి ఊఱట గొలుపుచు ఇట్లు పలికెను –

'నాయనా! సనాతనా! దైన్యమును మానుము! నీ యీ దైన్యమును చూడగా నా గుండె బ్రద్దలగుచున్నది. శ్రీకృష్ణభగవానుడు తన భక్తులపై దయ జూపు నెడల ఉత్తమత్వాధమత్వములను పరిగణింపడు. ఆ స్వామి ఇప్పుడు నీకు సుముఖుడై యున్నాడు. అతనికి నీపై నున్న దయ వర్ణింపనలవికానట్టిది. ఆ కారణముననే ఆ దేవుడు నిన్ను విషయకూపమునుండి సముద్ధరించివైచినాడు. నీ దేహము ఇప్పుడు నిష్పాపమైనది. కారణమేమన నీ బుద్ధి యిప్పుడు శ్రీకృష్ణభక్తితత్పరమై యున్నది. నేను నిన్ను పవిత్రుని జేయుటకు కాదు. నన్నే పవిత్రుని గావించుకొన నెంచి నిన్ను స్పృశించుచున్నాను. హేతువు ఏమన్న నీవు నీ భక్తిబలముతో సమస్త బ్రహ్మాండమును పావనము చేయగలిగి యున్నావు.

భవద్విధా భాగవతాస్తీర్థభూతాః స్వయం విభో!
తీర్థీకుర్వంతి తీర్థాని స్వాంతస్థేనగదాభృతా॥
(శ్రీమద్భాగవతం – 1-13-10)

ఒకప్పుడు యుధిష్ఠరుడు విదురునితో అన్నమాటలివి. – "ప్రభూ! మీవంటి భగవద్భక్తులు స్వయముగానే తీర్థముల వంటివారు. పాపాత్ముల చేత కలుషితములైన తీర్థములకు మీవంటివారు తమలో నెలకొని యున్న గదాధర భగవానుని ప్రభావము చేత మఱల తీర్థత్వమును ప్రసాదించుచుందురు."

ఒకప్పుడు ప్రహ్లాదుడు నృసింహభగవానునితో యేమనెనో చూచితిరా?

శ్లో॥ విప్రాద్ద్విషడ్గుణయుతాదరవిందనాభ
పాదారవిందవిముఖాచ్ఛ్వపచం వరిష్ఠమ్,
మన్యే తదర్పితమనోవచనేహితార్థ
ప్రాణం పునాతి స కులం న తు భూరిమానః.
(శ్రీమద్భాగ-7/9-10)

ధర్మము, సత్యము, దమము, తపము, ద్వేషరాహిత్యము, లజ్జ, తితిక్ష (సహనము), హింసారాహిత్యము, యజ్ఞము, దానము, ధృతి, వేదాధ్యయనము అను ఈ పంద్రెండు గుణాలును గలవాడైన బ్రాహ్మణుడు కూడ భగవానుడు పద్మనాభుని పాదారవిందములయందు వైముఖ్యము వహించినచో దానికంటె తన మనము, ధనము, వచనము, కర్మము, సర్వమును భగవదర్పణము గావించుకొన్న చండాలుని శ్రేష్ఠునిగా భావింతును. కారణ మేమన హరిభక్తుడైన చండాలుడు తన కులమును ఎల్లపవిత్ర మొనరించుకొనును. కాని విశేష గౌరవాదరములు గలవాడైనను భక్తిలేని బ్రాహ్మణుడు తనను కూడ పవిత్రుని గావించుకొనలేడు అని భావము. ఈ రెండు శ్లోకములను వినిపించి మహాప్రభువు ఇట్లనెను.

సనాతనా! నీవు హరిభక్తుడవు. నిన్ను చూచినను, స్పృశించినను, నీ గుణములను కీర్తించినను మానవుని శరీరము పవిత్రతను పొందును.

అక్ష్ణోః ఫలం త్వాదృశదర్శనం హి
తన్వాః ఫలం త్వాదృశగాత్రసంగః
జిహ్వాఫలం త్వాదృశకీర్తనం హి
సుదుర్లభా భాగవతా హి లోకే॥ (హరిభక్తిసుధోదయము-13-2)

నీవంటి భక్తులను దర్శించుటవలననే కన్నులకు చరితార్థత ప్రాప్తించును. నీవంటివారి శరీరసంస్పర్శము వలన శరీరము పావన మగును. నీవంటివారి గుణగానము చేయుట వలన నాలుకకు సాఫల్యము చేకూరును. లోకములో భాగవతోత్తముల దర్శనము దుర్లభమైనది.

ఇట్లు పలికి మహాప్రభువు సనాతనుని భాగ్యమును ఎంతయో ప్రశంసించెను. శ్రీకృష్ణప్రేమ ప్రాప్తించిన వానిలో నిజము చెప్పవలె నన్న ఇట్టి దైన్యమే ఉదయించుచుండుట సహజము అని కూడ ఆ స్వామి అతనికి ఎఱుగజెప్పెను. అటుపిమ్మట చెఱనుండి విముక్తుడైన విధమును గూర్చి స్వామి ప్రశ్నింపగా సనాతనుడు ఆ విషయమును సంగ్రహముగా వినిపించెను.

అనంతరము మహాప్రభువు నాయనా! నా సనాతనునకు వెంటనే క్షౌరము సేయించి, స్నానమాచరింప జేసి నూతన వస్త్రములను ధరింప నిమ్మా! యని చంద్రశేఖరునకు ఆదేశ మిచ్చెను. స్నాన విధి ముగిసిన మీదట తపనమిశ్రుడు అను భక్తుడు ఒకడు సనాతనునకు క్రొత్త పంచె నీయబోయెను. అప్పుడు సనాతనుడు ఆర్యా! నాకు మీరు వస్త్రము నీయనెంచినచో క్రొత్తది కాదు. ప్రాత వస్త్రము ఏదైన ఒసగుడు! చాలును! అని పలికి అతనిని వారించెను. అప్పుడతడు ప్రాత పంచె నొకదానిని తెచ్చి సనాతనునకు ఒసగెను. సనాతనుడు దానిని నడుమకు చించి రెండు కౌపీనములు గావించుకొనెను. అతని యీ వైరాగ్యవిధమును చూచి మహాప్రభువు ఎంతయో ప్రసన్నత చెందెను. కాని శ్రీకాంతుడు ఒసగిన కంబడి (మూల్యవంతమైనది) అతని బుజము మీద ఇప్పటికిని పడియే యుండెను. మహాప్రభువు నాలుగైదు మాఱులు గాని వంకకు చూచెను. ఆ విషయమును పరికించి సనాతనుడు తనలో అన్నన్నా! ఎంత యేమరితిని. ఇంత వఱకు ఈ మూల్యవంతమైన కంబడి నా బుజము మీదనే ఉండిపోయినదే! దీనిని బట్టి నాలో విషయవాసన తొలగలేదని తోచుచున్నది. అందుచేతనే పర్యాయముగా నావంకకు చూచుట మూలమున ప్రభువు నన్ను హెచ్చరించుచున్నారు అని తర్కించుకొనెను. తోడనే అతడు గంగాతీరమున కరిగి అక్కడ ఉన్న ఒక పేదవానికి ఆ కంబడిని అర్పించి దానికి బదులుగా అతని కడనున్న గుడ్డపేలికను గ్రహించి దానితో తనదేహమును గప్పుకొనెను. ఆ దశలో ఉన్న సనాతనుని గాంచి మిక్కిలి ప్రసన్నత చెంది మహాప్రభువు 'సనాతనా! శ్రీకృష్ణపరమాత్మ యీనాడు నీ విషయభోగరూపమగు రోగమును సమూలముగా నశింపజేసివైచెను. వైద్యుడు ఉత్తముడయ్యేనేని ఆ వంతయు రోగశేషమును ఉండనీయడు కదా!'

అనంతరము మహాప్రభువు నిర్విరామముగా సనాతనునకు రెండు నెలల కాలము భక్తితత్త్వ ప్రబోధము గావించి 'నాయనా! ఇక నీవు బృందావనమునకు వెడలిపొమ్ము! అక్కడ రూపునితోను, అనుపమునితోను

కూడి శ్రీకృష్ణుని కార్యమును సాధించుచుండుము!' అని యాదేశించెను.

అటు పిమ్మట మహాప్రభువు నీలాచలమునకు వెడలిపోయెను. సనాతనుడు బృందావనమునకు సాగిపోయెను. ఆయన ఆదేశమును అనుసరించి సనాతనుడు బృందావనము దెసకు సాగిపోయెను. అక్కడకు చేరిన సనాతనునకు రూపు, అనురూపుడు, ఇరువురును అచ్చట నుండి కదలి కాశి మీదుగా దేశమునకు వెడలిపోయిరని తెలిసెను. అప్పుడు అతడు సుబుద్ధిరాయని వాసస్థానమున నిలిచెను. రాయడు అతనిని పరమాదరముతో తన చెంత నిలిపికొనెను. కాని సనాతనునకు ఆయెడ నుండుటకు మన మంగీకరింపలేదు. అత్యల్పమైన భోగసామాగ్రియైన యెందుండునో అందు ఉండుట అతనికి దుస్సహము అగుచుండెను. అంతట సనాతనుడు రాయని వాసస్థానము మాని వనమునకు పోయి అందొక తరుతలమున వాసము చేయ నారంభించెను. ప్రతిదినము అడవిలో పుల్లలను సేకరించి బజారులో విక్రయించి అందువలన ప్రాప్తమైన ద్రవ్యముతో జీవననిర్వహణము చేయ మొదలుపెట్టెను. శేషము ఏమైన ఉన్న దీనులకు పంచియిచ్చి వేయుచుండెను. ఒకనాడు బెంగాలురాష్ట్రమును ముంచగలవాడైన అతడే, తేల్చగలవాడైన అతడే యనునట్టి స్థాయిలో ఉన్నవాడు ఈనాడు శ్రీహరిప్రేమ సంబంధమగు ఉన్మాదమునకు లోబడి తత్ప్రభావమున ఇంతటి దైన్యదశను సహర్షముగా స్వీకరించెను.

సనాతనుడు దినదినము యమునలో స్నానము చేయవెడలుచుండువాడు. ఒకనాడు అతనికి ఆ నదీ తీరమునందు ఒకచోట ఒక వజ్రము పడియుండి కానవచ్చెను. దానిని అతడు ఏ పేదవానికైన ఇచ్చి వేయుదమని యెంచి అట్టివాని కొఱకు నిరీక్షించుచు కొంత తడవు ఆ నదీతటమున గూర్చుండెను. ఎంత తడవైనను ఆ వంకకు ఎవ్వడును రాలేదు. అప్పుడు అతడు ఆ వజ్రము మీద మట్టిని పోసి, పోయి యమునలో స్నానము చేయసాగెను. అంతలో ఒక బ్రాహ్మణుడు ఆ యెడకు వచ్చి మహాత్మా! నాకు ఈనాడు ఒక కల వచ్చినది. అందు మీరు నాకు అపారమైన ధనమును అర్పించి నన్ను పరమైశ్వర్యశాలిని గావించివైచితిరి. అందువలననే

నేనిప్పుడు మీ కడకు పరుగిడి వచ్చితిని. అని అతనితో పలికెను. బ్రాహ్మణుడాడిన యీ మాటలను ఆలకించి సనాతనుడు ఆర్యా! నేను అకించనుడను (ఏమియు లేనివాడు). కాని యిక్కడ ఒక వజ్రము మట్టిలో పడి యున్నది. శ్రీకృష్ణభగవానుడు ఆ వజ్రమును మీ కొఱకే పడియుండ జేసెనేమో? వలతునంటిరేని మీరు దానిని కొనిపోవుడు! అని యతనికి బదులుచెప్పెను. అప్పుడు బ్రాహ్మణుడు ఇందందు వెదకెను. కాని అది యతనికి కానరాలేదు. అంతట సనాతనుడు యమునలో నుండి వెలికి వచ్చి బ్రాహ్మణునకు ఆ వజ్రము ఉన్న తావును చూపి ఆర్యా! నేను స్నానము చేసివైచితిని. కావున నేను ఇప్పుడా వజ్రమును తాకను. మీరే మట్టిని తొలగించి దానిని కొనిపొండు! అని యతనితో చెప్పెను. బ్రాహ్మణుడు ఆ బహుమూల్య వజ్రమును చూచి పరమానందము నొందెను. వెంటనే దానిని గ్రహించి యతడు తన యింటికి గొనిపోవసాగెను. వెడలుచు వెడలుచు ఆ బ్రాహ్మణుడు తనలో ఔరా! ఇదేమి? యీ వజ్రమును జూచి నేనింత సంతోషమును పొందుచుంటినే! మఱి యీ సనాతనుడు దీనిని తాకనైనను తాకలేదే! ఇందులకు కారణము ఏమైయుండును? ఇంతకంటెను మూల్యవంతమైన వస్తువు ఏదియైన అతనికి లభించియుండునా? దానిని చూచికొనియే అతడు ఈ వస్తువును తుచ్ఛమైనదని తలపోసి యుండునా? అదియే నిజమైన నేను కూడ ఆ వస్తువుకొఱకే ప్రాణములను ఒడ్డి ఏల ప్రయత్నింపరాదు? అని తర్కించుకొనెను. ఈ విధమైన యాలోచన కలుగుటతోడనే యీ బ్రాహ్మణుడు ఆ వజ్రముపై తనకు ఉన్న మోహమును వీడి మఱల వెనుకకు సనాతనుని కడకు వచ్చి యతనివలన భక్తితత్త్వప్రబోధమును పొంది నూతన జీవనవిధానమును పొందెను. అచ్ఛమైన సాధువుతోడి వైరాగ్యభరితము, పవిత్రమును అయిన సాంగత్యం యొక్క ప్రభావము ఈ విధముగనే యుండును.

కొంతకాలము బృందావములో ఉండి సనాతనుడు మహాప్రభువును గలిసికొన నెంచి నీలాచలమునకు అరిగెను. త్రోవలో అతనికి చర్మవ్యాధి

యంకురించెను. ఝూర్ఖండు ప్రాంతమందలి కలుషితమును గ్రోలుటవలన అతనికి ఈ వ్యాధి సంప్రాప్తమైనదని కవిరాజు గోస్వామి లిఖించియున్నారు. ఏమైన కానిండు! సనాతనుడు వ్యాధిగ్రస్తుడై నీలాచలమునకు చేరెను. తనను దీనునిగా, హీనునిగా, పతితునిగా భావించుకొని యతడు పోయి హరిదాసు అనుభక్తుని యింట వసించెను. తనకు వ్యాధి ప్రాప్తించినందులకు అతనికి ఆవంతయును చింతలేదు. పైగా సంతోషమే కలుగుచుండెను. ఈ వ్యాధి కారణముగా తన కడకు ఎవ్వరును రాకుందురనియు, ఆ సమయములో తాను ఏకాగ్రతతో భగవద్భజనము చేసుకొనవచ్చుననియు తలచికొని యతడు తృప్తినే పొందుచుండెను. పురాకృతపాపముల ఫలమును ఎంతగా అనుభవించిన అంతగా అవి క్షయ మగుచుండును. అని యాలోచించుకొని యతడు సంతుష్టినే పొందెను. కాని తనకు దాపురించిన కుష్ఠవ్యాధిని గూర్చి ఆవంతయు ఖేదమును పొందలేదు. హరిదాసుగృహమునకు మహాప్రభువు ప్రతిదినము వెడలుచుండువాడు. ఆ మహాభాగుడు పోయి సనాతనుని సందర్శించెను. సనాతనుడు అతనికి దవ్వుల నుండియే ప్రణమిల్లసాగెను. అప్పుడు ప్రభువు పరుగిడి పోయి యతనిని కౌగిలించుకొన యత్నించెను. అంతట సనాతనుడు 'ప్రభూ! మీరు నన్ను తాకరాదు. నేను పరమనీచుడను. నాకు కుష్ఠవ్యాధి సంక్రమించినది. కావున నన్ను మన్నింపుడు!' అని పలికి యా ప్రభువును వారించెను. అప్పుడు మహాప్రభువు 'సనాతనా! నీ శరీరము నా దృష్టిలో చాల పవిత్రమైనదే. నీవు శ్రీకృష్ణభక్తుడవు. నిన్ను ఏవగించుకొన్నవాడే అస్పృశ్యుడు' అని పలికి యతనిని బలిమి మీఱ పట్టుకొని యక్కున జేర్చుకొనెను. సనాతనునకు 'నాయనా! నీ సోదరులు ఇరువురును ఇక్కడకు వచ్చి పది మాసముల కాలము ఉండిరి. అనంతరము రూపుడు బృందావనమునకు మఱలిపోయెను. కాని అనుపముడు మాత్రము ఇచ్చటనే శ్రీకృష్ణసాయుజ్యము నందెను' అని యతనికి ఎఱుగజెప్పెను. తమ్ముని మరణవార్త విని సనాతనునకు ఎంతయో దుఃఖము కలిగెను. అతడు తమ్ముని భక్తిభావమును తలచుకొని తలచుకొని విలపించ సాగెను. ప్రభువు

అతనికి ఊరట గొలిపి 'సనాతనా! నీవు ఇచ్చటనే హరిదాసు చెంత యుండుము! మీకు ఇరువురకును శ్రీకృష్ణుని యందు విశేషానురాగ మున్నది. అనతికాలమందే ఆ భగవానుడు మీపై కృప జూపును' అని తెలియజెప్పెను.

ఇట్లు పలికిన పిమ్మట ప్రభువు ఆ యెడ నుండి వెడలిపోయెను. ఈ విధముగనే దినదినము ప్రభువు అచ్చటకు వచ్చి సనాతనుని ఆలింగనము చేసుకొనసాగెను. అందువలన సనాతనుని మనములో క్షోభము కలుగసాగెను. తన శరీరమునందలి చీమునెత్తురు స్వామి శరీరమున పులుమబడుచున్నందులకు అతనికి మర్మాంతకమగు వేదన గలుగుచుండెను. ఎన్ని విధముల వారించినను ప్రభువు అతనిని స్పృశింపక విడుచుట లేదు. అందుచేత అతడు జగన్నాథస్వామి రథచక్రాల క్రింద బడి యసువులను బాయనెంచెను. దివ్యదృష్టి చేత ఈ విషయమును ప్రభువు తెలుసుకొని సనాతనుని తన చెంతకు రావించి అతనికి ఇట్లు నచ్చజెప్పెను. "సనాతనా! దేహత్యాగము చేయుదమన్న నీ సంకల్పము మంచిది కాదు. దానిని విడుము! అట్లు చేసిననాడు నీకు శ్రీకృష్ణుడు లభింపడు. శ్రీకృష్ణుని తెలియుటకు భక్తి, భజనము ఉపాయములు. నీవు శ్రీకృష్ణుని యెడల అనురక్తి గొన్న భక్తుడవు. నీ శరీరమును నీవు జుగుప్సాకరమైనదని భావించుకొనుచున్నావు. కాని నేనట్లు భావించుటలేదు. నేను సన్న్యాసిని, సన్న్యాసియైనవానికి విష్ఠ, (మలము) చందనము రెండును సమానములుగా తోచవలయును. అట్టి యెడ నేను నీ శరీరమును జుగుప్సితమైనదని నేనెట్లు ఎన్నగలను? అట్లు ఎన్నిననాడు నేను శ్రీకృష్ణుని ముందు అపరాధిని అయ్యెదను." ప్రభువు పలికిన యీ పలుకుల నాలకించి సనాతనుడు 'ప్రభూ! ఏమో? తమ సంకల్పము ఎట్టిదో యెఱుగరాదు. తమరు దీనదయాపరులు. కావుననే నన్ను ఏవగించికొనకున్నారు. నావంటి నికృష్టుల పై కృప జూపుటయే మీ కార్యక్రమమైనది. నా వంటి పతితులు, పామరులును అగు సేవకుల వలననే మీకు స్వామిత్వము, మీవంటి భృత్యులవలననే మావంటి వారికి 'సేవకత్వము యుక్తములైనవి' అని మఱల

వాపోయెను. అప్పుడు ప్రభువు మఱల ఇట్లనెను. – 'సనాతనా! నేను మిమ్ము బిడ్డలనుగా భావించువాడను. ఒకవిధముగా మీరు నన్ను తల్లిగా భావించుకొనవచ్చును. చంటి బిడ్డ కార్చిన చొంగ తల్లిదేహమునందు ఎల్ల యెడల అంటుకొనుట లేదా? ధూళిధూసరిత దేహుడై మలినముగా నుండు పిల్లవానిని తల్లి యెన్నడైన ఏవగించికొనుట సంభవమా?'

మహాప్రభు వాడిన యీ మాటను ఆలకించి సనాతనుని వెంట వచ్చిన హరిదాసు ప్రభునితో ఇట్లనెను– 'దేవా! మీరు ఎవరిమీద ఏవిధముగా కృప జూపుదురో మేము ఎఱుగ జాలము. అది మా బుద్ధికి అందనట్టి విషయము. ఆనాడు వాసుదేవుడను అపరిచితవ్యక్తి యొకడు మీ చెంతకురాగా మీరు అతని భయంకర కుష్ఠురోగమును తత్కాలమందే హరించివైచితిరి. మఱి యీ మీ సనాతనుడు....' అని యిట్లు ఇంత మాత్రము పలికి గద్గదిక కారణముగా హరిదాసు ఇక మాటలాడలేక పోయెను.

హరిదాసు పలికిన యీ పలుకులను విని సనాతనుడు తాను హరిదాసు ముఖమున తన రోగనివారణమును కోరుచుంటినని ప్రభువు భావించునేమో యని తనలో శంకితుడు అయ్యెను. మహాప్రభువు శక్తి యెంతటిదో అతడు ఎఱుగనివాడు కాదు. కాని అతడు సర్వవిధముల మమకారములను అధిగమించిన నిష్కామయోగి. అతనికి శరీరము మీద మమకారము లేదు. అతడు ఎన్నడును సైగల మూలముగా ఐనను తన వ్యాధిని హరింపుమని ప్రభువునకు సూచన చేసి యుండలేదు.

అప్పుడు మహాప్రభువు ఇట్లు పలికెను. – 'సనాతనుని దేహములో ఈ వ్యాధి అతనిని పరీక్షించుటకు ప్రవేశపెట్టబడినది, నేను ఈ వ్యాధిని గాంచి యితనిని ఏవగించుకొందునేని శ్రీకృష్ణభగవానుని ముందు అపరాధిని అయ్యెదను. వింటివా హరిదాసా! కాబట్టి సనాతనా! నీవు చింత మానుము! నేను నిన్ను ఆలింగనము చేసికొనుటలోనే నాకు సుఖము తోచుచుండును. ఈ సంవత్సరము నీవు నా చెంతనే యుండుము! ముందు సంవత్సరము నీవు బృందావమునకు అరుగవలసి యుండును.'

పాఠకులారా! మీరే ఆలోచింపుడు. ప్రభువు సనాతనుని వ్యాధిని ఏల హరింప లేదందురు? ఆస్వామి సనాతనుని మూలమున మనకు మంచి విషయములను ప్రబోధించెనని గుర్తు ఉంచుకొనుడు! అందు ఒకటి, చేసికొన్న పాపకర్మల ఫలమును అనుభవించుట తప్పదు అనునది. రెండు – భక్తుడు ఎన్నడును నీచుడు కాడు. అతడు కుష్ఠురోగి యైనను పూజనీయుడే యగును. కుష్ఠురోగియైన సనాతనుని ప్రభువు ఆలింగనము చేసికొన్న విధముగా మనము భక్తుడైన కుష్ఠురోగిని ఎవనినైన ఆలింగనము చేసికొనగలమా? చేసికొనలేము అనునది. మూడు – భక్తుడైన వాడు అత్యంత దైన్యము వహింప వలయును. ప్రభువు సనాతనుని ఎంతయో గౌరవించుచునే యుండెను. అయినను అందువలన సనాతనునిలో అభిమానము ఉదయించుటలేదు. దానికి బదులుగా అతనిలో దీనత్వమే దినదినప్రవర్ధమాన మగుచున్నది. అనునది. నాలుగు – భక్తుడైనవాడు భగవానుని నుండి ఏమియు అపేక్షింపరాదు అనునది. అయిదు – దీనులు, దుఃఖితులు, కుష్ఠవ్యాధివంటి మహావ్యాధిగ్రస్తులును అయినవారే మానవుల ప్రేమను పొందదగినవారు. అట్టివారిని ప్రేమించినవారే దీనదయాపరతంత్రుడైన దేవునకు ప్రీతిపాత్రులు అగువారు.

భగవానుడు మంగళమయుడు. ఎల్లరకును పరమపిత. అతడు తన సంతానముపై నిత్యము దయగలిగి యుండువాడు. అతనిని ఏమైన కోరుట యన్నది అతని దయామయత్వమును శంకించుటయే యగును. సనాతనుడు తనకు కుష్ఠవ్యాధి వలన ఎంత పీడ కలిగినను దానిని సహర్షముగా సహించెను. కాని యేనాడును తన వ్యాధి నివారణమునకై ప్రభువును ప్రార్థించుటకు సంకల్పము చేయలేదు. ఏమైన చేయుటకు సమర్థుడై యుండియు మహాప్రభువు సనాతనుని యందు ఉన్న యీ ఉత్తమలక్షణములను ఎల్ల వెల్లడి చేయునెంచియే దర్శనమాత్రమున అతని వ్యాధిని నివారింపక యూరకుండెను. ఇట్లుండగా ఒకనాటికి లోకము సనాతనుని యందు ఉన్న నిరుపమానము, నిష్కపటము, నిష్కామమును అయిన భగవత్ప్రేమను, అనుకరణీయమైన దైన్యమును, అతని మహాత్త్వమును

గుర్తించెను. అట్టి గుర్తింపు కలుగుట తోడనే అతడు రోగవిముక్తుడయ్యేను. అనంతరము మహాప్రభువు సనాతనునకు బృందావనమునకు పోయి లోకోద్ధరణమునకై పాటుపడు చుండుమని యాదేశ మిచ్చెను.ప్రభువును వీడి వెడలుటకు సనాతనునకు ఎంతయో దుఃఖము ఒదవెను. కాని యంతకంటెను ఎక్కువుగా ఆ మహాప్రభుని యాజ్ఞను ఉల్లంఘించుట అతనికి దుఃఖదాయకముగా తోచెను. కడకు సనాతనుడు బృందావనమునకు వెడలిపోయెను. రూపుడు కూడ అచ్చటకు చేరెను. ఇరువురును గూడి బృందావన జనతాసముద్ధరణమునకు శ్రీకారము చుట్టిరి.

సనాతనుడు బృహద్భాగవతామృతము, హరిభక్తివిలాము, లీలాస్తవము, స్మరణీయటీక, దిగ్దర్శినీటీక, శ్రీమద్భాగవతములోని దశమస్కంధమునకు వైష్ణవతోషిణీ యనుటీకను రచించెను. రూపుడు భక్తిరసామృత సింధువు, మథురామాహాత్మ్యము, పదావళి, హంసదూతము, ఉద్ధవసందేశము, అష్టాదశకచ్ఛందము, స్తవమాల, ఉత్కలికావళి, ప్రేమేందుసాగరము, నాటకచంద్రిక, లఘుభాగవతతోషిణీ, విదగ్ధమాధవము, లలిత మాధవము, ఉజ్జ్వలనీలమణీ, దానకేళిమానిక, గోవింద విరుదావళి మొదలైన అనుపమానములైన గ్రంథములను ఎన్నిటినో రచించెను. అతడు విదగ్ధమాధవమును విక్రమశకము 1582లో రచించెను. ఈ గ్రంథము లన్నిటియందు భక్తుడు, భక్తి, శ్రీకృష్ణతత్త్వమును గూర్చి విపులమైన వివరణము ఉన్నది. అనుపముని కుమారుడు జీవుడను వాడుకూడ ఇల్లు, వాకిలి వీడి బృందావనమునకు వెడలిపోయెను. అతడు కూడ విశేషకృషి చేసెను. అనేకములైన ఉత్తమోత్తమగ్రంథాలను రచించెను.

బృందావనమునుండి ఏ యాత్రికుడైన నీలాచలమునకు వచ్చుట సంభవము అయినప్పుడు మహాప్రభువు వానిని చేరబిలిచి 'నాయనా! అక్కడ బృందావనములో నా రూపుడు, సనాతనుడును ఎట్లున్నారు? ఏ విధముగా జీవనయాపనము చేయుచున్నారు?' అని అన్నిటికంటె ముందు అమితమైన ప్రీతితో పృచ్ఛ చేయుచుండువాడు. "ఇరువురు సోదరులును తరుతలమున వాసము చేయుచున్నారు. భిక్షాటనము చేయగా ప్రాప్తించిన

భిక్షాన్నమును ఆరగించుచున్నారు. చినిగిన గుడ్డపేలికతో కౌపీనధారణము చేయుచున్నారు. కంథను (గుడ్డపేలికలతో కుట్టిన బొంత) ఒక చిప్పను చెంత నుంచుకొనుచున్నారు. ఎనిమిది జాములలోను నాలుగు గడియల కాలము మాత్రమే నిదురించుచున్నారు. మిగిలిన సమయమున అంతను శ్రీకృష్ణనామసంకీర్తనముతోను, జపముతోను, శాస్త్రగ్రంథ విరచనముతోడను వెళ్లించుచున్నారు" అని ఆ యాత్రికుడు బదులు చెప్పుచుండువాడు.

ఈ విధముగా బ్రదికియున్నంత కాలము లోకకల్యాణము కొఱకును, అన్యకాలమున ఆత్మోద్ధరణము కొఱకును పాటుపడి శ్రీరూప సనాతనులు అనబడు ఆ సోదరులు ఇరువురును బృందావనము నందే దేహత్యాగము చేసి గోలోకవాసులైరి. ఒకప్పుడు ఆ సోదరులు ఇరువురును విద్య, పదవి, ఐశ్వర్యము, ప్రతిష్ఠ మున్నగు వానితో దర్పించి యుండువారు. వారే భగవానుని అవ్యాజకరుణాకటాక్షవీక్షణము కారణముగా నిరభిమానులై, నిర్లోభులై, వైరాగ్యనిధులై, ఆ పరమపురుషుని పరమప్రేమికులుగా పరిణతి నంది ప్రకాశించిరి.

భక్తునకు జయము! భక్తపాలకుడగు భగవానునకు జయము!

* * *

భక్తయవనుడు హరిదాసు

'పరమాత్మా! నన్ను గొట్టిన యీ జీవులు తెరువు మఱచినవారు. వీరిని దయజూడుమా! వీరిని సైరింపుమా! వీరిని అపరాధవిముక్తులను గావింపుమా!' (హరిదాసు)

భక్తహరిదాసు యశోహర్ జిల్లాలోని బూడన్ అనుగ్రామములో ఒక నిరుపేదమహమ్మదీయ గృహములోజన్మించెను. పూర్వ సంస్కారవశమున చిన్ననాటినుండియు అతనికి హరినామమునందు అడపరాని యనురాగము ఏర్పడెను. అతడు ఇల్లు, వాకిలి వీడి వనగ్రామము చెంత బేనాపోర్ అను చోట నున్న యడవిలో వివిక్తస్థానమందు కుటీరము నిర్మించుకొని యందు నివసింప సాగెను. అతడు బహుక్షమాశీలుడు, శాంతస్వభావుడు, నిర్భయుడు, హరినామమునందు అచంచలవిశ్వాసము గల సాధుపుంగవుడు. అతడు ప్రతిదినము బిగ్గఱగా మూడు లక్షల హరినామ జపము చేయువాడని జనులు చెప్పుదురు. అట్లు బిగ్గఱగా నామస్మరణము చేయుటవలన ఆలకించినవారికి కూడ ఆ నామసుధ యందు అభిరుచి కలుగుననిఅతడు భావించువాడు. ఎందఱో భక్తులు నిత్యము హరిదాసును దర్శించుటకు వచ్చి అతని పాదములను తాకి పవిత్రులు అగుచుండువారు. అతడు ఎల్లవారలకును 'అయ్యలారా! హరినామస్మరణము చేయుడు! హరినామమును ఆశ్రయింపకున్న మానవుడు ఉద్ధరింపబడడు' అని ఉపదేశము చేయుచుండువాడు. జీవననిర్వహణమునకై యతడు చెంతనున్న గ్రామమునకు బోయి భిక్షాటనము చేసికొనువాడు. ఏనాడైన అధికముగా భిక్షలభించెనేని శేషించినది ఎల్లపేదలకును, బాలురకును పంచిపెట్టు చుండువాడు. కాని మఱునాటికి సంగ్రహణము చేయువాడు కాదు. ఆ మహాపురుషుని జీవితమునకు సంబంధించిన రెండు మూడు ముఖ్య సంఘటనలను క్రింద పొందుపఱచుచున్నాము. పఠించుడు!

వనగ్రామములో రామచంద్రఖాను అనుకుటిల చిత్తుడైన జమీందారు ఒకడుండెను. అతడు ఒకమాఱు హరిదాసు యొక్క సాధనను భ్రష్టము చేయనెంచి అందులకు ఒకవేశ్యను ధనాశ చూపి సన్నద్ధురాలిని గావించెను. ఆమె మెల్లగా హరిదాసు కుటీరమునకు చేరెను. అప్పుడతడు హరినామస్మరణములో నిమగ్నుడై యుండెను. హరిదాసు యొక్క మనోహరరూపమును గాంచి ఆమె మనములో కూడ వికారము ఉదయించెను. అంతట ఆమె లజ్జవీడి ఎన్నియో కుచేష్టలు చేయసాగెను. హరిదాసు రేయెల్ల జపము చేయుచునే యుండెను. కాని యామెతో ఒక్క మాట కూడ ఆడలేదు. తెల్లవాఱిన పిదప అతడు ఆమెను గాంచి అమ్మా! నామజపము పూర్తికాకపోవుట చేతనేను నిన్ను పలుకరించ లేకపోయితినని పలికి యూరకుండెను.

వేశ్య వరుసగా మూడు రాత్రులు హరిదాసు కుటీరమునకు వచ్చి యతనిని వశీకరించికొనుటకు వివిధములగు కుచేష్టలు చేసి విసిగిపోయెను. కాని యామె యభిలషితము ఫలించలేదు. హరిదాసు యొక్క నామకీర్తనము క్షణముకూడ నిలుచుట లేదు. ఆమె యేమి చేయును? నాలుగవనాడు కూడ ఆమె హరిదాసు కుటీరమునకు వచ్చెను. అప్పుడు కూడ అతడు అనితరమైన ప్రేమతో హరినామసంకీర్తనము చేసికొను చుండెను. అతని కన్నులనుండి ప్రేమాశ్రుధారలు ఉరలి యతని వక్షస్స్థలమున ప్రక్షాళితము చేయుచుండెను. మూడు రాత్రులు వరుసగా వేశ్య హరినామశ్రవణము చేసెను. అందువలన ఆమెకు అంతఃకరణము ఎంతయో పరిశుద్ధ మయ్యెను. అప్పుడామె తనలో ఇట్లు తర్కించుకొనెను. మహాసౌందర్యరాశినైన నావంటి యాడుదాని ప్రలోభనమును గడ్డిపఱకను వలె త్రోసిపుచ్చి యే మానవుడు హరినామస్మరణమునందు ఇంత ఉన్మత్తుడగుచుండునో అతడు సాధారణ వ్యక్తికాడు. లోకములోని సుందరపదార్థములు అన్నియు అతని దృష్టికి తుచ్ఛములుగా తోచుచుండవచ్చును. అనంతరము ఆమె హృదయము మాఱిపోయెను. ఆమె హరిదాసును తన వలలో బంధింప

వచ్చెను. కాని కడకు అతని మనోనిగ్రహము ముందు ఓటమి నంగీకరించి స్వయముగా తానే చిక్కుకొని పోయెను. ఒక ఉత్తమశ్రేణికి చెందిన సాధుపుంగవుని, కొంచెపు దృష్టితో చూచినందువలన గలిగిన పశ్చాత్తాపము కారణముగా కొంచెపుదనము వహించిన చిత్తముతో పోయి ఆమె తలాలున హరిదాసు చరణముల మీద వ్రాలి స్వామీ! నేను మహాపాపాత్మురాలను, నాపై కరుణ వహించి నన్ను ఉద్ధరింపవే! యని అతనిని దీనముగా వేడుకొనెను. అంతట హరిదాసు ఆమెకు పావనహరినామమును ఉపదేశించి యామెను కృతకృత్యురాలిని గావించి యా తావును వీడి వెడలిపోయెను. అటుపిమ్మట ఆవేశ్య తన సర్వస్వమును పేదలకు దీనులకును కొల్లబెట్టి యోగినిగా మారి ఆకుటీరమందే యుండి హరిభజనము చేసుకొన నారంభించెను. అనంతరకాలమున ఆమె మహాభక్తురాలయ్యెను. ఇది యంతయు సాధుసాంగత్యము యొక్కయు, హరినామశ్రవణము యొక్కయు ప్రత్యక్షప్రభావము.

ఈ విధముగా వేశ్యను ఉద్ధరించి హరిదాసు శాంతిపురమునకు వెడలెను. అద్వైతాచార్యుడు అను పేరు ప్రసిద్ధి చెందిన పండితవైష్ణవుడు ఒకడు అక్కడ నివసించుచుండెను. అతడు హరిదాసుని ప్రేమపూర్వకముగా తన యింట నిలిపికొనెను. ఇరువురును కూడి హరిచర్చ చేయ నారంభించిరి. అద్వైతాచార్యుడు భాగవతాదిగ్రంథములను చదివి హరిదాసునకు వినిపించుచుండువాడు. అతడు తన గ్రామము చెంత హరిదాసుకొఱకు ఒక గుహను నిర్మింపజేసెను. అందే యుండి హరిదాసు హరిభజనము చేసికొనుచుండువాడు. కేవలము మధ్యాహ్న సమయమున మాత్రము అద్వైతాచార్యునియింటికి వచ్చి భోజనము చేసి వెడలుచుండువాడు.

శాంతి పురము చెంత ఫులియా అను గ్రామముండెను. అది బ్రాహ్మణులు నివసించుగ్రామము. హరిదాసు యవనుడైనను అతడు అమిత శ్రద్ధాభక్తులతో హరిని సేవించుచుండుట వలన అచ్చటివారు అందఱు

అతని యెడల విశేషాదరమును చూపుచుండువారు. హరిదాసు నిత్యము గంగాస్నానము చేసి హరినామోచ్చారణము చేసికొను చుండువాడు.

ఆ కాలములో మహమ్మదీయుల పాలనము సాగుచుండెను. తమ ధర్మమును అనుసరించి ఆచరణములు చేసికొనుట హిందువులకు కష్టమగు చుండెను. అట్టి తరుణములో హరిదాసు యవనుడై యుండి కూడ హిందువుల ఆచరణ విధములను అనుకరించుట అధికారులకు అవమాన హేతువుగా తోచెను. ఆ కారణమున గోరాయి అను న్యాయాధికారి హరిదాసునకు రాజదండనము విధింప వలె నని దేశాధ్యక్షుని ముందునకు అభియోగమును తెచ్చెను. దేశాధ్యక్షుని ఆజ్ఞానుసారముగా హరిదాసును పట్టి తెచ్చి జైలులో బంధించుట సంభవ మయ్యెను. అతని నిర్బంధము వలన ఫులియాగ్రామవాసుల హృదయములకు దుస్సహమైన యాఘాతము తగిలెను.

అక్కడ జైలులో ఉన్న ఇతర నిర్బంధితులు హరిదాసు నెడల విశేష భక్తిని ప్రదర్శించిరి. అప్పుడు హరిదాసు వారితో 'నాయనలారా! ఇప్పుడు మీరు భగవంతుని యెడల ఎట్టి భక్తిని ప్రదర్శించితిరో అట్టి భక్తినే సర్వదా భగవానుని యందు నిలిపికొనుడు! మీరు రెండు మూడు రోజులలో విడుదల పొందెదరు.' అని హితోపదేశపూర్వకముగా పలికెను. అతని పలుకు సత్యమై అట్లే వారు రెండు మూడు దినముల మీదట వదలి వేయబడిరి.

హరిదాసునకు సంబంధించిన అభియోగము విచారణకు వచ్చినప్పుడు కోర్టులో పెద్ద జనసమూహము ప్రోగుపడెను. న్యాయాధికారి హరిదాసు నెడల ఆదరమును ప్రదర్శించి సుఖముగా కూర్చుండుటకు అతనికి ఆసనమును కల్పించెను. ఆ యధికారి అప్పుడు హరిదాసుతో ఇట్లనెను. – 'అయ్యా! మీరు మహాభాగ్యవశమును మహమ్మదీయ వంశమున జన్మించితిరి కదా! కాఫిరుల దేవతల నామమును ఏలస్మరింతురు? (మహమ్మదీయులు తమ

మతము వారు కానివారిని, ముఖ్యముగా హిందువులను ఉద్దేశించి అవమానపూర్వకముగా కాఫిరులు అనుశబ్దమును ఉపయోగించుచుందురు. కాఫిర్ అనగా ఇతరమతమువాడని యర్థము) వారి యాచరణములను ఏల యనుసరింతురు? నేను అయినచో హిందువుల భోజనమైన చేయనే! ఈ పాపము కారణముగా మీకు చనిపోయిన తరువాత కూడ నిష్కృతి యుండదు. మీరు ఇప్పుడు ఇస్లాము ధర్మపు మూలమంత్రమును పఠించుడు! పఠింపకున్న మీకు రక్షణ ముండదు.' అధికారి పలికిన యీ మాటలను విని హరిదాసు అతనికి వినయపూర్వకముగా ఇట్లు బదులు చెప్పెను - "ఓ గౌరవనీయ న్యాయాధిపతివర్యా! ఈ లోకమునకు అంతకును ప్రభువు ఒక్కడే. హిందువులు, మహమ్మదీయులును ఆ ప్రభువును వేఱు వేఱు పేర్లతో పిలుచుచున్నారు. నాకు ఇష్టమైన విధమున నేను ప్రభువును సేవించికొనుచున్నాను. ఒక హిందువు ఎవడైన మహమ్మదీయమతమును అవలంబించుట సంభవమైననాడు హిందువులు ఎవ్వరును అతనిపై అత్యాచారమునకు పాల్పడరు. ఇక నేనుచెప్పవలయునది ఏమియును లేదు."

యుక్తియుక్తముగాను, వినయపూర్వకముగాను హరిదాసు పలికిన పలుకులను యెల్లరును ప్రసన్నులైరి. న్యాయాధిపతి, దేశాధ్యక్షుడును కూడ ప్రసన్నత చెందిరి. కాని గోరాయి మాత్రము ఏ విధముగను కూడ హరిదాసు మాటలకు హర్షితుడు కాలేదు. అతని హృదయములో ఆవంతయు దయలేదు. అతడు తన పంతమును వీడక న్యాయాధీశునితో సర్కార్! చట్టమును అనుసరించి యీ హరిదాసునకు కఠిన శిక్ష విధింపవలెను. అట్లు కానినాడు ఇతనిని చూచి యితర మహమ్మదీయులు కూడ హిందువులుగా మాఱిపోవగలరు. అందువలన ఇస్లాంమతమునకు ఆఘాతము కలుగును. అని నొక్కి పలికెను. అప్పుడు కోర్టు హరిదాసును ఇట్లు ఆదేశించెను. ఇట్టి పరిస్థితిలో మీరు హరినామస్మరణమును మానివేయవలెను. మానకున్న కఠినశిక్షను అనుభవించ వలసి యుండును.

ఈ యాదేశమును విని హరిదాసు ఇట్లు బదులు చెప్పెను-

ఆ॥ కాయ మెల్ల ఖండఖండంబు లగుగాక!
పాయుగాక! తనువు ప్రాణములను,
బరిహరింపజాల హరినామపావనో
చ్చారణంబు మాన్యజనములార!

ఈ మాట విని న్యాయాధిపతి గోరాయి సూచనను అనుసరించి హరిదాసును ఇరువది రెండు బజారులందును త్రిప్పి అతని వీపుమీద ప్రాణములు పోవువఱకు బెత్తపు దెబ్బలు కొట్టవలెను అని తన తీర్పును వినిపించెను. పాషాణ హృదయులైన సిపాయిలు హృదయవిదారకమైన దారుణకృత్యమును ఆరంభించిరి. అయినను హరిదాసు అయ్యో! అని ఆర్తనాదము చేయలేదు. అతడు ప్రసన్నత మీఱ హరినామస్మరణమే చేయనారంభించెను. హరి యనుటను మానెదవా? మానవా? అనుచు సిపాయిలు అతని దేహముపై బెత్తములతో ప్రహారములు చేయసాగిరి. ఏదీ! మఱియొక్క మాఱు హరియనుమా! మఱియొక్క మాఱు హరి యని పలికె నన్ను కొట్టుడు! అని హరిదాసు పలుకు చుండెను. కడకు సిపాయిల దశను తలచి జాలిచెంది ఓ హరీ! పరమాత్మా! వీరు పొరపడి నన్ను ప్రహరించుచున్నారు. వీరిని అపరాధవిముక్తులను చేయవే! వీరిని క్షమింపవే! వీరిని దయ జూడవే! యని భగవానుని ప్రార్థింపసాగెను. ఇట్లు ప్రార్థించుచు, ప్రార్థించుచు, హరినామస్మరణము చేయుచు కొంత తడవునకు అతడు తెలివి తప్పి పడిపోయెను. అతడు మరణించెనని భావించి, అతడు కాఫిరు కావున అతని శరీరమును ఖననము (సమాధి) చేయురాదని తలచి సిపాయులు అతనిని గంగలో బాఱవైచిరి. కొంత తడవైన పిదప అతడు తెల్విని బొంది మెల్లగా ఒడ్డు మీదకు చేరెను. ఈ విషయము న్యాయాధీశుడైన దేశాధ్యక్షునకు, గోరాయికి తెలిసెను. ఈ సంఘటనము వలన వారు ఇరువురు విశేషముగా ప్రభావితులైరి.

వారు కూడ అతని చరణముల మీద వ్రాలి అతని అనుయాయులైరి. వారు కూడ హరినామస్మరణము చేయ మొదలు పెట్టిరి. క్రమముగా వారికి కూడ అచ్చమైన పవిత్రత యబ్బెను.

ఒకప్పుడు హరిదాసు సప్తగ్రామములో హిరణ్యమజూందారు అను జమీందారు సభలో హరినామ మహత్త్వమును వివరించుచు భక్తితో హరినామస్మరణము చేయుడు! అందువలన మనములో భగవద్భక్తి, భగవత్ప్రేమ ఉదయించును. అదియే హరినామగ్రహణమునకు ఫలము అని ప్రబోధము చేసెను. అంతట గోపాలచక్రవర్తియను జమీందారు యొక్క సేవకుడు ఒకడు ఇవి యన్నియు ఏవియో భావుకత్వపు మాటలు హరినామము వలననే మానవుని నీచత్వము నశించునా? అసంభవము. అట్లే జరిగిన నేను నా ముక్కు కోయించుకొందును అని శపథవచనమాడెను. అప్పుడు హరిదాసు కూడ హరినామస్మరణము, జపము వలన మానవునకు ముక్తిలభించనినాడు నేను కూడ అట్లే నా ముక్కు తెగగోయించుకొందును అని శపథము చేసెను. ఆ గోపాల చక్రవర్తి ముక్కు రెండు మూడు నెలలు గడచిన మీదట కుష్ఠవ్యాధిగ్రస్తమై కరగి యూడిపోయెనని జనులు చెప్పుదురు. నిజమరయుగా హరినామనిందనమునకు ఇంతకంటెను దారుణమైన ఫలమే ప్రాప్తింపవలయును.

ఆకాలమునందే చైతన్య మహాప్రభువు నవద్వీపములో హరినామసుధా ప్రసారము చేయుచుండెను. హరిదాసు కూడ అక్కడకు వచ్చి యుండి నిత్యము హరినామకీర్తన సంబంధమైన యానందమును పొందసాగెను. చైతన్యమహాప్రభుని యాదేశానుసారము హరినామోన్మత్తుడైన హరిదాసు, నిత్యానందుడును గూడి నామసంకీర్తనము, నృత్యము చేయుచు నగరములో తిరిగి తిరిగి పగలెల్ల నరనారీలోకమునందు హరినామసుధను వితరణము చేయసాగిరి.

కడకు శ్రీ చైతన్య మహాప్రభువు సంన్యాసమును స్వీకరించిన మీదట ఆ మహనీయుని ఆదేశానుసారము హరిదాసు పూరీక్షేత్రమునకు వచ్చి కాశీమిశ్రుని తోటలో కుటీరము నిర్మించుకొని అందునివసింపసాగెను. అక్కడనే యితడు మరణించెను. మరణకాలమందు శ్రీచైతన్య మహాప్రభువు తన భక్తమండలితోడ హరిదాసు చెంత నుండెను. హరిదాసు యొక్క మృత శరీరమును చేతులమీదకు ఎత్తి కొని శ్రీచైతన్యప్రభువు నాట్యము చేయసాగెను. కడపట ఆ శరీరము ఒక విమానము వంటిదానిలో ఉంచబడెను. శ్రీచైతన్యప్రభువు హరినామసంకీర్తనము చేయుచు ముందుముందు సాగెను. ఆ మహాప్రభువే హరినామ ధ్వనితో ఆకాశమును ప్రతిధ్వనింప జేయుచు స్వయముగా తన చేతులతో హరిదాసు శవమును సమాధిస్థితము గావించెను.

భక్తునకు జయము! భక్తపాలకగుడు భగవానునకు జయము!

★ ★ ★

భక్త రఘునాథదాసు

త్యాగమునకు సంబంధించిన పాఠమును అందఱును నేర్చుకొన్నవారే. అయినను వారిలో త్యాగధనులుగా ప్రకాశించినవారు ఎందఱు ఉందురందురు? సంసారము (ప్రపంచము) అసారమైనది. సారభూతుడు ఒక్క భగవానుడు మాత్రమే. అయినను సర్వత్ర యిందులకు విపరీత పరిస్థితియే గోచరమగుచుండును. లోకమంతయు అసారమైన సంసారమునే సారభూతమని యెంచి పట్టుకొనును. కేవల సారభూతుడగు పరమాత్మను విస్మరించుచును. భగవానుని కృపవలన సద్బుద్ధిని పడసి, సర్వస్వమును త్యజించి అన్నిటిని దూరముగా వేఱుగా నిలువగల భాగ్యశాలులైన మహాపురుషులు ఎక్కడనో, ఎందో బహుఅరుదుగా నుందురు. భక్త రఘునాథదాసు కూడ ఈ శ్రేణికి చెందిన ఒక భాగ్యశాలియైన మహాపురుషుడు. అతడు మహైశ్వర్యసంపన్నమైన ఒక వంశములో జన్మించెను. కాని యితడు సుఖభోగవైభవములు అన్నియు ఆభాసమాత్రములు, వట్టివి అని యెఱిగి అచ్చపు సుఖమును అన్వేషించువాడయ్యెను.

బెంగాలు రాష్ట్రములో తీస్‌బిఘా అనుస్టేషను ఒకటి యుండెను. దానికి చేరువగా పూర్వము సప్తగ్రామము అను పేరుగల మహాసమృద్ధిశాలియైన నగర మొకటి యుండెను. అందు హిరణ్యదాసు, గోవర్ధనదాసు అను పేర్లు గలిగిన ధనికులుగా ప్రసిద్ధి గన్న సేటులు ఇరువురు ఉండువారు. వారు ఇరువురును అన్నదమ్ములు. వీరు తత్కాలమందు గౌడనగరాధిపతిగా ఉన్న సయ్యద్ హుస్సేనుషాకు పన్నులు వసూలు చేసి అప్పగించునట్టి కంట్రాక్టు తీసుకొని పనిచేయుచుండువారు, ఆ పనిలో వీరు 12 లక్షలు హుస్సేనుషాకు చెల్లింపగా వీరి దగ్గఱ 8 లక్షల ద్రవ్యము మిగులు చుండెడిది. ఆ కాలములో 8 లక్షల సంవత్సరాదాయము అన్న అలంతిది కాదు. ఆ కాలములోని ఎనిమిది లక్షలు ఈ కాలములో ఎనుబది

కోట్లతో సమానము. ఇంతకు చెప్పదలచిన విషయము ఏమన్న ఇట్టి కుటుంబమునందే రఘునాథదాసు జన్మించెను. ఇతని తండ్రి గోవర్ధనదాసు, హిరణ్యదాసు సంతానహీనుడు. గోవర్ధనదాసునకు రఘునాథదాసు కాక వేఱు సంతానము లేదు. ఈ విధముగా రఘునాథదాసే వారికి ఇరువురకును ఆశాస్థాన మయ్యెను.

మఱి కొంచెము తిను! మఱికొంచెము త్రాగు! మఱికొంచెము ఉంచుకో! అన్న పద్ధతి మిక్కిలి గారాబముగా పిల్లవాడైన రఘునాథదాసు యొక్క లాలనము, పాలనము సాగెను. ఉత్తమశ్రేణికి చెందిన పండితులు వానికి చదువు చెప్పుటకు నియమింపబడిరి. పిల్లవాడైన రఘునాథుడు ఎంతయో ఆసక్తితో సంస్కృతమును అభ్యసింప నారంభించెను. అనతికాలమందే అతడు ఆ భాషయందు అభిజ్ఞుడయ్యెను. అంతియే కాదు. ఆ భాషతో బాటుగా అతనికి సంజీవనమూలిక రుచికూడ ప్రాప్తించెను. ఆ రుచి దొరకినప్పుడే విద్య వాస్తవికవిద్యయగుచుండును. ఆ సంజీవనమూలిక యేదందురా? అది భగవద్భక్తి ఇంతకు జరిగిన విషయము ఏమనగా రఘునాథదాసు తమ కులపురోహితుడైన శ్రీబలరామాచార్యుని చెంతకు విద్యాభ్యాసము చేయునరుగు చుండువాడు. ఆ దినములలో ఆ పురోహితుని యింట శ్రీ చైతన్యమహాప్రభుని ప్రధానశిష్యుడగు హరిదాసు నివసించు చుండెను. ఇనుమును ఆకర్షించు అయస్కాంతము వలె సాధుజనులు కూడ జనులను తమవంకకు ఆకర్షించుకొనగల శక్తి కలిగి యుందురు. అతని దర్శనీయము, సౌమ్యమును అగు ఆకారము, నిర్మలమైన భగవన్నిష్ఠ మొదలైన శుభలక్షణములు రఘునాథుని హృదయఫలకము మీద చెఱగని ముద్ర వేసెను. అతనితోడి సత్సంగము కారణముగా సన్నని హరిభక్తిరేఖ యీ పిల్లవాని హృదయములో కూడ ఉదయించెను.

ఆ దినములందే శ్రీ చైతన్యదేవుడు శాంతి పురమునకు విచ్చేసెనన్న వార్త వచ్చెను. ఆ పుణ్యపురుషుని పేరు ఆ ప్రాంతమందలి ప్రతి యింటను మాఱు మ్రోగెను. ఇతడు ఆ కాలమందు తన సమయమంతయు

నిశ్చింతముగా భగవన్నామ ప్రచారము నందు వినియోగింప సంకల్పించుకొని తననే పరమాధారముగా చూచుకొనుచున్న కరుణామూర్తియు, వృద్ధురాలును అగు తన తల్లిని, తరుణవయస్కురాలగు భార్యను పాలించు భారమును భగవంతునిమీద విడిచిపెట్టి సన్న్యాసగ్రహణము చేసియున్నవాడు. ఆకారణమున ఇతనిని భగవత్ప్రేమకు ప్రత్యక్ష ప్రమాణముగా గ్రహించి జనులు ఇతని దెసకు విశేషముగా ఆకర్షింపబడుచుండిరి. ఈ గౌరాంగదేవుడు ఎందు పోయిన అందు తండోపతండములుగా జనులు దర్శనార్థులై వచ్చిపడుచుండిరి. ఆ మహాప్రభువు శాంతి పురమునందు అద్వైతాచార్యుని యింట విడిసియుండె నన్న సమాచారము అందుటతో చుట్టుపట్టుల నున్న భక్తజనుల హృదయములు ప్రఫుల్లములయ్యెను. ఆ వార్తవిని రఘునాథుడు ఆస్వామి దర్శనము కొఱకు ఆరాటపడిపోయెను. అతడు శాంతి పురమునకు అరుగనెంచి తండ్రియనుమతి కోరెను. ఆ తండ్రికి ఇది అనావశ్యకప్రసంగముగా తోచెను. కాని యతనికి తన కుమారుని మొగమున అడపరాని యారాటము చూపట్టెను. పిల్లవానిని నిలువరించుట అనుచితముగా తోచెను. ఆ తండ్రి తన తనయుని ఒక రాజకుమారునివలె మేలైన పల్లకి నెక్కించి సేవకబృందమును తోడిచ్చి శాంతిపురమునకు అంపెను.

శాంతిపురములో రఘునాథుడు సూటిగా అద్వైతాచార్యుని గృహమునకు చేరెను. కానుకలుగా తెచ్చిన వస్తువులు అన్నిటిని గ్రహించి ముందున కరిగి గౌరదేవుని చరణములపై దొరలిపోయెను. ఆ పిల్లవానిని చూచినంతనే వాని భవిష్యత్తు ఎట్లు ఉండునో ప్రభువునకు తెలిసిపోయెను. అయినను రఘునాథునకు ఆ ప్రభువు నాయనా! అనాసక్తభావముతో గార్హస్థ్యమునందు ఉండి కూడ మానవుడు మాధవుని పడయవచ్చు ననుచు అట్టివే మఱికొన్ని మంచి మాటలు చెప్పి యాశీర్వదించి వానిని వాని యింటికి అంపివైచెను. రఘునాథుడు గృహము దిక్కుగా మఱలి వచ్చుచుండెను. కాని యతనికి తన యీ యాగమనము నదీప్రవాహమునకు ఎదురు

ఈదుటవలె విపరీతముగా తోచుచుండెను. తన సేవకులు తనను బలవంతముగా గృహము దిక్కుగా ఈడ్చుకొనిపోవుచున్నట్లు అతడు భావించుకొనసాగెను. గృహమునకు మఱలి వచ్చుటకు అతనికి మనము ఒప్పకుండెను. అతని మొగములో వివశత్వము ఉట్టిపడుచుండెను. తనకు ఱెక్కలు ఉన్నచో క్షణములో తుఱ్ఱున ఎగసి పోయి యాగౌరాంగ దేవుని పదముల ముందు వ్రాలిపోవు వాడనని అతడు తనలో తలపోయుచుండెను. అస్తు!

క్రమముగా అతడు ఎట్లో హార్దిక సంక్షోభమును భరించుచు ఇంటికి చేరి తల్లికి, తండ్రికి, పెదతండ్రికి పాదాభివందనము లాచరించెను. కాని వాని ముఖమునందు ఆ గురుజనులకు తృప్తిలక్షణము కానరాలేదు. వాని మొగమువంకకు చూడగా ఇక ఈ రఘునాథునకు మీ యెల్లరతోడను ఎట్టి సంబంధమును లేదు. వీడు మఱియొకరివాడు అయిపోయినాడు అని అందువ్రాయబడి యుండెనా యనునట్టులు వారికి తోచెను. కాని వారు ఆ విషయమును విచారించుటకు నాడు విశేష ప్రాముఖ్య మీయలేదు. రానురాను రఘునాథదాసు ఉదాసీనతా మూర్తియై కారణమేమని ఎవరైనా పృచ్ఛచేయగా ఏమియు బదులు చెప్పకుండుటతో వాని విషయము నేడు వారికి విచారణీయ మయ్యెను. వీనికి ఏదియో పిచ్చి ధోరణి పట్టుకొన్నది. ఇక వీడు ఏదియో ఒక క్షణమున మౌనముగా ఇల్లు వీడి పోవనున్నాడు, అందులకు ఉపాయము ఆలోచించుచున్నాడు. అని తలచికొని వారు చింతింప సాగిరి. వానిని గౌరాంగదేవుని చెంతకు ఏల పంపితిమని వారు పశ్చాత్తాపము నందిరి. కానిమ్ము! జరిగినది ఏదియో జరిగినది. ఇటుపై ఇక నెట్టి పొరపాటు చేయకూడదని నిశ్చయము చేసికొని వారు వానిపై కావలిని ఏర్పరించి వానిని కంట కనిపెట్టి [illegible]. లోకములో పరమాకర్షకమగు వస్తువు ఏదియున్న అది శ్రీ [illegible]! గొప్పగొప్ప మహాబలాఢ్యులు, పరాక్రమశాలులైన శూరులు, వీరులు, [illegible], [illegible], మహారాజులు, ధనకుబేరులును కూడ శ్రీ ముందు పాదాక్రాంతులు

అగుచుండుటను మనము కనుచున్నాము. వినుచున్నాము. మూఢువంతులు వీనికి పెండ్లి చేసినచో వీని పరిస్థితి చక్కబడవచ్చునని వారు ఆలోచించిరి. తదనుసారముగా గోవర్ధనదాస మజూందారు తత్క్షణమందే తగిన యేర్పాటు చేసి అత్యంత సౌందర్యరాశి యనదగు ఒక బాలికను వెదకి యామెతోడ తన కుమారునకు పెండ్లి చేసివైచెను. కాని పిమ్మట అతనికి తన యభిప్రాయము అయుక్తమైనదని విదిత మయ్యెను. సమస్త మానవీయ బంధనములను తృణప్రాయములుగా భావించి వీడిపోవగల సామర్థ్య మున్నవానికి వివాహబంధము ఒక లెక్క యగునా? లోకములో కామినీ కాంచనములు రెండే సారవంతములైనవని యెంచికొని విషయలంపటులైన జనులను మాత్రమే అవి బంధింప గలవు. కాని సంసారములో సారవంతమైన పదార్థము ఒక్కటియు లేదన్న నిశ్చయబుద్ధిగల మహాపురుషుల చిత్తములు వీనియందును, ఇతరములగు నిట్టి వ్యామోహ జనకములగు వస్తువుల యందును ఎట్లు తగుల్కొనును? కావున వివాహము కూడ రఘునాథునకు నిత్యజీవితములో పరిగణింప నక్కఱలేని ఒక సంఘటనముకంటె ఎక్కువ మహత్త్వము కలదిగా చూపట్టలేదు. అతడు మాటికి మాటికి ఇంటి నుండి పాఱిపోవ యత్నించుటయు, కావలివారు అతనిని పట్టుకొని యింటికి తీసికొని వచ్చు చుండుటయు మొదలయ్యెను. క్రమక్రమముగా ఈ వ్యవహారము ముదిరిపోవుటచేత తల్లిదండ్రులు అతనిని పిచ్చివానిని వలె త్రాళ్ళతో బంధింప జేసివైచిరి. కాని అతికఠినముగా బంధించిన బంధనము నిలువనేరదు. శీఘ్రముగా తునాతునకలు అయిపోవునని వారి వివేకము వారికి ఎఱుగజెప్పెను. ఈ ఆలోచన వచ్చుటతో వారు రఘునాథుని పిచ్చివానినివలె బంధించు తలంపును వీడిరి. కంట కనిపెట్టుచుండునట్టి పరిస్థితిని మాత్రము యథాపూర్వముగా సాగించుచుండిరి.

ఆ దినములలో ఆ దేశములో గౌరాంగుని తరువాత అధిక ప్రశస్తిని, లోక ప్రీతిని గన్నవాడు నిత్యానందుడు. సంన్యాసియై దేశ దేశాంతరములలో

సంచారము సాగించిన పిదప అతడు శ్రీగౌరాంగ దేవుని శరణు పొంది అతని యాజ్ఞానుసారము గౌడప్రాంతములో హరినామప్రచారము చేయసాగెను. అతడు పానీహాటి యను గ్రామమును తన హరినామప్రచారమునకు ప్రధానకేంద్రమును గావించుకొని యుండెను. ఆ గ్రామమునకు చేరి తాను కూడ హరినామ సంకీర్తనమునందు పాలు పంచుకొని యా పావనానందమును చూఱగొనవలెనన్న కోరిక రఘునాథదాసునకు కలిగెను. ఆ విషయములో తండ్రి కూడ అతనిని నిరోధించలేదు. అతడు ఇప్పుడు త్రాటి బిగింపును ఒకింత సడలించునట్టి నీతిని అవలంబించి కార్యసాధనము చేయనారంభించెను. అనగా అతనిపై కట్టడిని ఒకింత సడలించెను. అదుపులోనికి రాక విచలనలక్షణము గల పెంకె గుఱ్ఱము యొక్క త్రాటి కొసను మాత్రము బలముగా పట్టుకొని జనులు ఆః! ఇది యెక్కడకు పోగలదు? త్రాటికొస మన చేతిలోనే ఉన్నది కదా! యని తలచి మిగిలిన త్రాటిని వదులుగా విడిచి దానికి ఇచ్చవచ్చినట్లు గంతులు వేయుటకు స్వతంత్రతను ఇచ్చిదానిని వశీకరించికొనుటకు ప్రయత్నము చేయుచుందురు. ఆ విధముగానే గోవర్ధనదాసు తన కుమారుని మీద బాహిరముగా గానవచ్చు కట్టడిని సడలించి కంట కనిపెట్టుచుండు నియమించిన సేవకులను మాత్రము మఱియింత జాగరూకతతో వ్యవహరించుచుండుడని యాదేశించెను. ఆ కారణమున పరమానందముతోడ పానీహాటికి పోవుటకు రఘునాథునకు అనుమతి లభించెను. కాని నియమానుసారము సేవకులు అనునెపముతో పోలీసుదండును వెంట పంపుటను మాత్రము అతని తండ్రి విస్మరించలేదు. ఎట్లయిన నేమి? రఘునాథదాసు పానీహాటికి వెడలెను. నిత్యానందుని దర్శించి యతడు నేత్రానందమును పొందెను. హరినామసంకీర్తనధ్వనిని ఆలకించి కర్ణరంధ్రములను చరితార్థములను గావించికొనెను. అంతియేకాదు. నిత్యానందుని దయవలన అప్పుడు చేరిన అసంఖ్యాకవైష్ణవజన సముదాయమునకు మహాప్రసాదముగా పెరుగుతో మిశ్రితములైన అటుకులను పంచియిచ్చు సదవకాశము కూడ అతనికి

ప్రాప్తించెను. మఱునాడు విశేషముగా దానధర్మము లాచరించి యతడు నిత్యానందుని సెలవును పొంది తన యింటికి మఱలి వచ్చెను.

అతడు ఇంటికి చేరెను. కాని ఆ చేరుట శారీరకముగా మాత్రమే కాని మానసికముగా కాదు. ఈ సంకీర్తనసమారోహములో పాల్గొని వచ్చిన పిదప అతడు పూర్తిగా వివశుడయ్యెను. గౌడదేశీయులైన వందలాది భక్తులు చాతుర్మాస్యకాల మెల్ల శ్రీ చైతన్యదేవుల చరణ సన్నిధిలో ఉండి వెడలించుకొన నెంచి నీలాచలమునకు అరుగుచున్నారన్న వార్తకూడ అతనికి తెలియవచ్చెను. ఆ కారణమున ఈ సువర్ణావకాశమును జాఱవిడచికొనుటకు అతని మనము సమ్మతింపకుండెను. ఇంటివారు అతని పయికట్టడులను సడలించిరి. కాని కావలిని తొలగించలేదు. ఆ కావలి యందైన నీలాచలమునకు వెడలుటకు గాని, అక్కడ నాలుగు మాసముల కాలము వెడలించుటకు కాని తనవారు అనుమతింతురు అన్న ఆశ అతనికి లేదు. ఒకవేళ ఆ యనుమతి లభించినను ఈ క్రమము ఇట్లు ఎంత కాలము సాగగలదు? ప్రేమించువాడు, ప్రేమింప బడువాడు – ఈ ఇరువురి నడుమ మూడవవాని నిర్వహణము ఎట్లు కుదురును? కాబట్టి అతడు పూర్తిగా అకించనుడు కావలయును. అతడు అట్టి యాలోచనమే చేయుచుండెను. ఆతనియందు ఆ యాలోచనము నేటిది కాదు. చాల కాలముగా సాగుచుండెను. కాని యే కార్యమైన దైవము అనుకూలించినప్పుడే సఫలము అగుచుండును. మనస్సులో కోరిక ప్రబలమైన వేళ భగవానుడు కూడ అనుకూలతను కల్పిం చుచుండును. రఘునాథదాసు ఇప్పటి వఱకు ఇల్లు వీడి పాఱిపోవుటకు ఎన్నియో ప్రయత్నములు చేసెను. కాని ఒక్కటియు ఫలించలేదు. ఇప్పుడు అతని మనోరథము నెఱవేరు తరుణము సమీపించెను. ఆ కారణమున ఒకనాడు భగవానుని ప్రేరణముచేత మహామాయ కావలివారలను ఎల్లరను నిద్రామగ్నులను గావించెను. కనుచీకటిగా ఉండి తెల్లవాఱుచున్న వేళ రఘునాథుడు ప్రాకారము మీదుగా లంఘించి వెలికి వచ్చి ఎవరి కంటను పడకుండ పాఱిపోయెను.

ఇక్కడ రఘునాథుడు లేడన్న విషయము తెలియుటతోడనే భవనములో కోలాహలము మొదలయ్యెను. అతనిని అన్వేషించుటకు నాలుగు దిక్కులకును సేవకులు పరుగెత్తింప బడిరి. కాని వారికి రఘునాథుని నీడ కూడ కానరాలేదు. పంపబడిన సేవకులు క్రోసెడు క్రోసెడు, రెండు క్రోసుల దూరము పోయి అతని జాడలు కానక విఫలప్రయత్నులై వెనుకకు మఱలి వచ్చిరి. అతడు పూరీక్షేత్రమునకు వెడలి యుండునేమో యని యింటిలో నివారికి అనుమానము కలిగెను. ఏమయిన కానిండు! వాడు పూరీక్షేత్రమునకే వెడలిపోయి యుండును అనిగోవర్ధనదాసు కూడ వాకొనెను. "ఇది రథయాత్ర సాగింపబడు కాలము. కాబట్టి పూరీక్షేత్రమార్గమున మనుష్యుని పరుగెత్తించుట మంచిది. మన యూరిలో శివానందసేనుడు ఉన్నాడు కదా! అతడు వందలాది యాత్రికులకు నాయకత్వము వహించి తఱచుగా వారిని పూరీక్షేత్రమునకు గొనిపోవుచుండును. అతడు పూర్తిగా మనవాడు అతనిపేర లేఖ వ్రాసెదను గాక! రఘునాథుడు ఆ యాత్రికులతో కూడి యుండునేని శివసేనుడు వానికి తగిన విధముగా నచ్చజెప్పి యింటికి మఱలించి పంపివేయును. లేకున్న పూరీక్షేత్రమునకు ఏగి వానిని వెదకి తన వెంట తీసుకొని వచ్చును. మనము ఇక్కడ నుండి పంపిన మనుష్యులు వెంట ఉండనే ఉందురు" అని యీ విధముగా ఆలోచించి గోవర్ధనదాసు ఒకలేఖను వ్రాసి యిచ్చి అయిదుగురు ఆశ్వికులను పూరీక్షేత్రమార్గమున భావింపజేసెను. కాని రఘునాథుడు అక్కడ ఉన్న కదా వారికి కానవచ్చునది? భగవానుడు రఘునాథునకు తెలివిని ఇచ్చెను. ఎల్లరు పోవు మార్గమున పోవుట యుక్తము కాదని, అట్లుచేసిన ఎందఱో యాత్రికులు తనను కలియుదురని, ఎవడవు? ఎచ్చటివాడవు? అని వారు తనను ప్రశ్నింతురని, వారికి నిజము చెప్పినచో తన గుట్టురట్టు అగునని, ఆ యాత్రికులలో పరిచితుడు ఎవడైన ఉండునేని అతడు తన పాలిటి గుప్తచరసైనికుడుగా పరిణతుడు కావచ్చునని అతడు తనలోతర్కించుకొని ఒక యడవిలో ప్రవేశించి కాలిబాటలను అనుసరించి ప్రయాణము సాగించెను.

రాత్రి సమయము అగునప్పటికి అతడు ఇంచుమించుగా ముప్పది మైళ్ళ దూరము సాగిపోయెను.

ఇక్కడ గోవర్ధనదాసుచే పంపబడిన మనుష్యులు యాత్రికబృందమును జూచిరి. శివసేనుని గలిసి యతనికి లేఖను అందించిరి. అతడు తమ బృందములో రఘునాథుడు లేడని వారికి ఎఱుగజెప్పెను. అంతట వారు హతాశులై వెనుకకు మఱలి వచ్చిరి. అన్వేషణ మంతయు నిరర్ధక మయ్యెను. ఆశ్వికుల వలన ఈ విషయమును ఎఱిగి గోవర్ధనదాసు మొదలుగా భవనములోనివారు అందఱును దుఃఖాక్రాంతులైరి. అయ్యో! రఘునాథుని దేహముపై ఆవశ్యకములగు వస్త్రములు లేవే! జేబులో డబ్బులు లేవే! ఎందుపోవునో, ఏమి తిని జీవించునో యెఱుగరాదు అని ఆబాలవృద్ధముగా వానికై ఎల్లవారును పరితపించిరి. ఎల్లరను రక్షించువాడు పరమేశ్వరుడు ఒక్కడే. కావున చింతింపరాదు. ధైర్యము వహించుడు అనుచు ఆప్తజనులు, మిత్రులును ఆకుంబము వారి యెడల సానుభూతిని ప్రకటించి వారిని ఊఱడింప సాగిరి. .కాని వారికి ధైర్యము గలుగుట లేదు.

ఈ విషయమును ఇటు ఉండనిండు! ఇప్పుడు ఈ దుఃఖ ప్రకరణమును ఇంతటితో ముగించి మనయా గుప్త . మార్గానుసారియైన బాటసారి రఘునాథుని గతి యేమయ్యెనో పరిశీలింతము. తొలి దినమున రఘునాథుడు ముప్పది మైళ్ళ దూరము సాగిపోయెనని ముందే వివరించి యున్నాము. కదా! పాఠకులారా! ఒకింత మీరే ఆలోచించి చూడుడు! ఏనాడును వాహనమును మాని ఒక్క యడుగైన నడచి యెఱుగని ఒకరాజకుమారుడు ఈనాడు కాలినడకను పయనించు గొప్ప గొప్ప తెరువరులను కూడ మీఱి పోయినాడు. ఆహా! నిష్ఠయనగా అది కదా! మానవుడు ఎప్పుడైన ఒక వస్తువును పడయుటకు అతితరమైన నిష్ఠవహించునేని విక్షిప్తమైన వాని శక్తి యంతయు ఒకచోట కేంద్రితమై బయల్పడుచుండును. ఆ నిష్ఠయే సంసారమెల్ల నశ్వరమైనదని యెంచి దానిని రోసి భగవత్ప్రాప్తి లక్ష్యముగా గలది అయిననాడు ఆశక్తికి హ్రాస మన్నది యుండునా? యుండదు.

మానవుడు ఆ శక్తినిదానము నెడల విముఖత వహించి యుండునంత వఱకు మాత్రమే అందు హ్రాసమునకు అవకాశము లభించుచుండును. అస్తు! తీవ్రవైరాగ్యపథమును అవలంబించిన రఘునాథుని తొలినాటి యాత్ర ముగిసిన పిమ్మట ఒక గొల్లవాని యింట ఉండుటకు అవకాశము లభించెను. ఆ గొల్ల యిచ్చిన పాలను గ్రోలి యా రేయిని అచ్చట వెడలించి రఘునాథుడు తెల్లవాఱినంతనే మఱల ముందు దెసకు పయనము సాగించెను. ఈ విధముగా అతడు దీర్ఘప్రయాణములు చేసి యించుమించుగా ఒకనెల రోజులు పయనింప వలసిన మార్గమును కేవలము పంద్రెండు దినములలో పూర్తి చేసెను. ఈ కాలములో అతడు కేవలము మూడుమాఱులు మాత్రము వంట చేసికొని ఉదరపూర్తిగావించుకొనెను.

ఈ విధముగా ప్రయాణములు సాగించి కడకు రఘునాథుడు శ్రీ చైతన్యమహాప్రభుని చేత సేవింపబడుచున్న నీలాచలక్షేత్రమును దర్శించెను. వెంటనే దానికి నమస్కరించి యా మహాప్రభుని చెంతకు ముందడుగు వేయసాగెను. పూరీక్షేత్రములోని గృహములకు సంబంధించిన ప్రతి యిటుక యందును అతనికి గౌరాంగుడు కానవచ్చు చుండెను. ఏ మనుష్యుని గాంచినను మహాప్రభువే అతని వేషము ధరించి తిరుగాడుచున్నట్లు తోచుచుండెను. చెట్లమీద ఉన్న పక్షుల కిలకిలారావములు అతని చెవులకు ఆ ప్రభుని గుణగానధ్వనుల వలె భాసిల్లుచుండెను. అతని హృదయములో ఆనందాతిరేకవశమున ఏవియో వర్ణింప నలవి కాని భావతరంగములు పెల్లుబుకు చుండెను. ఇట్లు భావుకతా ప్రవాహమున బడి అమందానందానుభూతి నందుచు అతడు క్రమముగా తన లక్ష్యస్థానమునకు చేరుకొనెను. దూరమునుండియే అతనికి చైతన్యమహాప్రభువు గోచరించెను. ఆ స్వామి అప్పుడు ప్రముఖమైన ఒక యాసనమును అలంకరించి యుండి ఎల్లరకును ఏమియో ఉపదేశము చేయుచుండెను. అందఱి దృష్టియు ఆ మహామహుని ముఖమండలము మీద లగ్నమై యుండెను. ఆ స్వామి విస్ఫారితములైన విశాలనయనారవిందములతో, పరిపుష్టములై

వర్తులాకారము దాల్చిన కపోలయుగళముతో, సువర్ణచ్ఛాయ వహించి సుందరముగా తోచు గాత్రముతో, స్వభావసిద్ధమైన అరుణ్యమును వెలిబెట్టునట్టి యధరాధరముతో, ప్రకాశమానమగు విశాల ఫాలదేశముతో ఒడలిపై స్వాభావిక వైరాగ్యలక్షణమును వెల్లడించు కమనీయ కాషాయవస్త్రముతో అద్భుతశోభాసంపన్నుడై ప్రకాశించుచుండెను. భక్తమండలీ పరివేష్ఠితుడైన ఆ మహాప్రభువు మేఘ మాలా పరివేష్టితుడైన చంద్రుని తలపునకు దెచ్చుచుండెను. ప్రసంగవశమున నడుమనడుమ ఆ ప్రభువు మందహాసము గావించిన అది సుధాస్రవంతి జాలువాఱు చున్నట్టులుండెను. ఈ విధముగా దివ్య ప్రభాభాసమానుడై తేజరిల్లు ఆ మహాప్రభువును గన్నయంతనే రఘునాథుని రోమరోమము పులకితమయ్యెను. హర్షాతిరేకవశమున అతనికి పారవశ్యము గలిగెను. అతడు ఇంతకు ముందు ఆ మహాప్రభువును దర్శించి యుండెను. కాని అప్పటి దర్శనమునకు, ఇప్పటి దర్శనమునకు భేదముండెను. అప్ప్డు అతడు ఆంతరంగికముగా ప్రభువునకు చెందినవాడు, బాహిరముగా పరులవాడును అయి వచ్చి ప్రభువును దర్శించెను. కాని నేడు పూర్తిగా ప్రభువునకు చెందినవాడు గానే వచ్చి ఆయనను సమీపించెను. అస్తు!

రఘునాథదాసు శ్రీచైతన్యుల చరణారవిందసన్నిధికి చేరెను. ముందుగా ముకుందదత్తుని దృష్టి అతని మీద పడెను. తోడనే ఆః! వచ్చివైచితివా రఘునాథదాసూ! అని అతడు రఘునాథుని పలుకరించెను. అప్ప్డు గౌరాంగుని దృష్టి కూడ అతనిమీద పడెను. అతడు కూడ ప్రసన్నతతో పులకించి పోయెను. నాయనా! రఘునాథా! వచ్చితివా? మంచి పని చేసితివి అని రఘునాథునకు స్వాగతవచనములు పలికి అతడు తనకు ప్రణమిల్లిన పిదప తటాలున అతనిని లేవనెత్తి ప్రభువు గాఢముగా కౌగిలించుకొనెను. చెంత కూర్చుండబెట్టుకొని అతని సిరమును కరముతో నిమురసాగెను. అంతట రఘునాథుని ప్రయాణపు బడలిక యంతయు తీరిపోయెను. మహాప్రభుని కరుణాశీలతను గాంచి పులుకు పులుకున

అతని కన్నుల నుండి ప్రేమాశ్రువులు ఉరలిపాఱసాగెను. ఆ కన్నీటి ధారలను కూడ ప్రభువు తన కరకమలములతోనే తుడిచెను. ఆనంతరము రఘునాథుడు ఇతర భక్త బృందమునకు కూడ అభివాదనములు చేసెను. అప్ప్డు ప్రభువు ఎల్లవారలకును రఘునాథుని పరిచితుని గావించెను. ఆ స్వామి అచ్చట ఉన్నవారికి అందఱకు అతడు ఎట్టి యింట పుట్టిన బిడ్డయో, ఏ విధముగా అతడు ఇచ్చుటకు చేరగలిగెనో యెఱుగ జెప్పెను. ఆ సందర్భమునందు ఆ మహాప్రభువు ఇట్లు పలికెను. "భక్తవరులారా! ఉక్కు సంకెలకంటె బంగారు సంకెల భయంకరమైనది. లోకములో లక్ష్మీపుత్రులు జమీందారులని పిలువబడుదురు. భాగ్యశీలులుగా తలపడుదురు. నిజమరయగా వారిని మించిన అభాగ్యులు వేఱెవ్వరును గారు. రేబవళ్ళు భోగపరతంత్రులై యున్న కారణమున వారు సర్వవిధముల భగవానుని యెడ విముఖత వహించియుందురు. అట్టివారిలో నూటికి, కోటికి ఒకడుగా ఎన్నదగిన రఘునాథుని వంటివానికి ఎవనికో కరుణావరుణాలయుడగు భగవానుని కృపవలన తీవ్రవైరాగ్యము ఉదయించి అతడు ఈ జననమరణరూపమాయామయసంసారబంధములను త్రెంచుకొని ముక్తుడగుట సంభవము అగుచుండును."

అటు పిమ్మట ప్రభువు స్వరూపదామోదరుని తన చెంతకు పిలిచి స్వరూపా! ఇదిగో! చూడు! ఈ రఘునాథుని నీకు అప్పగించుచున్నాను. ఇటుపై ఇతని అన్నపానములు మొదలు సాధన, భగవద్భజనపర్యంతముగా గల భారము అంతయు నీది అని పలికి అతనిని స్వరూపునకు అప్పగించెను. మంచిది! మీ ఆజ్ఞను శిరసావహించుచున్నాను అని బదులు చెప్పి స్వరూపుడు రఘునాథుని తన కుటీరమునకు గొనిపోయెను. అనంతరము రఘునాథుడు సముద్రస్నానము చేసి వచ్చెను. అంతలో స్వరూపుడు అతని కొఱకు పలువిధములైన జగన్నాథస్వామి ప్రసాదములను, మహాప్రసాదమును తెచ్చి సిద్ధముగా ఉంచెను. రఘునాథుడు వానిని ప్రేమతో ఆరగించెను. ప్రతిదినము అదియే క్రమము సాగుచుండగా చూచి

అతనికి ఒక ఆలోచనము కలిగెను. ఈ విధముగా ప్రతిదినము మేలైన భోజనములు చేయుచున్నచో వైరాగ్యము ఎట్లు స్థిరపడును అన్నదే ఆ యాలోచనము. కడకు అతడు నాలుగైదు దినములు అతిక్రమించిన పిదప ఈ వ్యవస్థను మార్చి వైచుకొనెను. నేనొక రాజకుమారుని స్థాయికి చెందినవాడను అని తనలో శేషించియున్న రాజస్వభావమును కూడ త్రోసిపుచ్చి అతడు ఒక సాధారణభిక్షుకుని వలె జగన్నాథస్వామి సింహద్వారము చెంత నిలిచి భిక్షను కోర మొదలుపెట్టెను. ఆ విధముగా ఉదరపూర్తి చేసికొనుచు అతడు సానందముగా దినములను వెడలింప సాగెను. కాని మాయ పరమ వంచకురాలు. అది తనను కోరువాని కంటికి కానరాదు. విడనాడినవాని వెంట పడుట మానదు. ఆ మాయ యిక్కడ మన సర్వసంగపరిత్యాగి యైన రఘునాథదాసు మార్గములోనికి కూడ వచ్చి నిలిచెను. ఇతడు పెద్ద యింటి పిల్లవాడై యుండి యీ దశకు చేరినాడని అచ్చటి జనులకు తెలిసిపోయెను. వారు అతనికి వివిధ పదార్థములను అధిక పరిమాణములో భిక్షగా సమర్పింప సాగిరి. అంతట ఆరాటము చెంది రఘునాథుడు ఈ క్రమమును మానివైచెను. ఇప్పుడు అతడు ఒక అన్నక్షేత్రము (సత్రము)నకు బోయి అచ్చట నుండి రుచులతో సంబంధములేని రూక్షమైన భిక్షను గ్రహించి దానితో కాలము గడప నారంభించెను. అతని గతి విధుల మార్పులు ఎప్పటికప్పుడు చైతన్యప్రభువునకు తెలియుచునే యుండెను. అతనిలో దినదిన ప్రవర్ధమాన మగుచున్న యీ వైరాగ్యలక్షణమును గాంచి యీ మహాప్రభువు ఎంతయో సంతోషించెను. ఆ స్వామి చెంత రెండు అపూర్వములైన వస్తువులు ఉండెను. అవి ఆయనకు అత్యంత ప్రీతిపాత్రములైనవి. అవి ఒకటి గోవర్ధనశిల. రెండవది గుంజామాల. ఈ రెండు వస్తువులను ఒకప్పుడు శంకరానంద సరస్వతి బృందావనము నుండి తెచ్చి ఆ స్వామికి అర్పించి యుండెను. వానిని ఆస్వామి రాధాకృష్ణుల జ్ఞాపకచిహ్నములుగా ఎంచుకొని పరమాదరముతో తన చెంత ఉంచుకొనెను. వానిని ఇప్పుడు రఘునాథుని

యెడల తనలో ఏర్పడిన ప్రేమాతిరేకము కారణముగా ప్రభువు అతనికి బహూకరించివైచెను. వానిని పడసి రఘునాథుడు తనకు అలౌకికనిధి ప్రాప్తించినట్లు అమందానందమును అందెను. అతడు మిక్కిలి భక్తిశ్రద్ధలతో నియమపూర్వకముగా ఆ రెండు వస్తువులను పూజించు కొనసాగెను. అతనిలోని తీవ్రమైన జిజ్ఞాసను గాంచి మహాప్రభువు ఒకనాడు సాధన సంబంధముగా ఒకింత సదుపదేశము చేసెను. ఆ సందర్భమందు ప్రభువు అన్న మాటలు ఇవి. "నాయనా! రఘునాథా! నేను నిన్ను స్వరూపదామోదరునకు అప్పగించివైచితిని కదా! కావున అతడే నీకు నిజమైన గురువు. అయినను నీ విషయములో నేనే ఏమియో చేయవలెనని నీవును కోరుకొను చున్నావు. అతడును కోరుచున్నాడు. కావున నేను నీకు ఇప్పుడు సమస్త శాస్త్రముల సారమును ఎఱిగించుచున్నాను. వినుము! లోకములో శ్రీకృష్ణభగవానుని నామమును స్మరించుటయు, కీర్తించుట మాత్రమే కల్యాణప్రాప్తికి సాధనము. కాని యీ సాధనకు పాత్రతను పడయుగోరిన మానవుడు నిరంతరము సాధుజనసాంగత్యము చేయవలెను. లౌకిక ప్రసంగములకు దూరముగా ఉండవలెను. పరనిందను పరిహరించ వలెను. తాను అభిమానరహితుడై పరులయెడ సమ్మానభావమును ప్రకటించవలెను. ఎవరి మనమును నొప్పించరాదు. ఆత్మప్రతిష్ఠను నిష్ఠగా (మలము) పరిగణించ వలెను. సరళస్వభావము గలిగి సచ్చరిత్రత గలిగి జీవనయాపనము చేయవలెను" ఇట్టివే యింకను మఱికొన్ని మాటలు ప్రభువు రఘునాథునకు ఉపదేశించెను.

పాఠకులారా! రండు! మనమిప్పుడు రఘునాథుని కొఱకు [illegible] విలపించుచున్న అతనికుటుంబమువారి పరిస్థితి యెట్లున్నదో విచారింతము. పూరీక్షేత్రములో చతుర్మాస్యకాలము ముగిసిన పిదప వచ్చుటకు వెడలిన గౌడదేశమువారగు భక్తజనులు ఎల్లరును తమతమ తావులకు మరలి వచ్చిరి. అప్పుడు గోవర్ధనదాసు ఒక మనుష్యుని తన కుమారుని [illegible] ఏమైన తెలిసెనేమో తెలిసికొని రమ్మని శివానందసేనుని కడకు [illegible]

ఆ మనుష్యుడు విషయము తెలిసికొని వచ్చి ఆర్యా! గృహత్యాగియైన తమ కుమారుడు పూరీక్షేత్రములో ఉన్నవాడట. కడుపు మంటను చల్లార్చికొనుటకై పట్టెడు అన్నమును కోరి అతడు దీనులు, హీనులు అయిన అనాథులవలె ఆలయసింహద్వారము చెంత నిలిచి గంటలకొలది సమయమును వెడలించుచుండెనట. అని గోవర్ధన దాసునకు ఎఱిగించెను. ఆ మాట వినుటతోడనే ఆ మాతాపితరుల హృదయములు ముక్కలయ్యెను. ఈనాడు ఎవరు ఔదార్యము మీఱ అసంఖ్యాక జనవర్గములకు అన్నము పెట్టువారై ప్రకాశించుచున్నారో హా! వారి కుమారునకా ఇట్టి దురవస్థ? కానివారు ఏమి చేయగలరు? గుండెను బండఱాయిని గావించుకొనుట తప్ప వారికి వేఱు ఉపాయమేమి యున్నది? అవధులు లేనంత వైరాగ్యమునకు ఆటపట్టు అయిన అంతరంగము గల పిల్లవాడు మఱల యింటికి వచ్చునన్న మాట కల్లగదా! కాని సాధించగలిగినచో ఒక్క ఉపాయమున్నది. అది యేమన్న ఆ పిల్లవాడు సమ్మతించినచో ఆ పూరీక్షేత్రమందే అతడు రాజకుమారునివలె జీవింప గలుగుటకు వలయు ఏర్పాటులు గావింప వచ్చును. కాని అతడు ఈ విధానమును సమ్మతించునన్న యాశలేదు. వానిదృష్టిలో అన్నపానములకు ఉన్న విలువ యెంత?

ఈ విధముగా ఎంత యాలోచించినను గోవర్ధనదాసునకు మార్గము ఏదియు గోచరము కాలేదు. కాని మోహము బహువిచిత్రమైనది. ఇది సాధ్యము కాదు అని మానవునకు వివేకము తెలియజేయుచుండును. బహుశః సాధ్యము కావచ్చును. నా మాటవిని ప్రయత్నము చేయుమని మోహము దానిని ముందునకు ద్రోయుచుండును. తన కుమారుని చిత్తవృత్తి యెట్టిదో గోవర్ధనదాసు పూర్తిగా ఎఱుగును. అయినను పుత్రవాత్సల్యము కారణముగా అతడు ప్రయత్నము మాని యూరకుండలేక పోయెను. అతడు భయపడుచు, భయపడుచు నాలుగువందల రూప్యములను, మఱికొన్ని ఆవశ్యకములైన యితర సామగ్రులను ఇచ్చి కొందరు మనుష్యులను తన కుమారుని చెంతకు పూరీక్షేత్రమునకు అంపెను.

గోవర్ధనదాసు చేత పంపబడిన మనుష్యులు క్రమముగా సామగ్రులు అన్నియు గ్రహించి రఘునాథుని కడకు చేరిరి. కాని రఘునాథుడు ఆ సామగ్రులను తీసుకొని ఏమి చేయును? అవి అతనికి ఎందులకు పనికి వచ్చును? త్యజించిన వస్తువులను మఱల గ్రహించుట యెట్లు? కాని ఆ వస్తువులను వెనుకకు త్రిప్పి పంపివేయుటయు యుక్తము కాదు గదా! అట్లు చేసినచో చచ్చినవానిని చంపినట్లు అగును గదా! తనకొఱకు కాక బాధపడుచున్నవారి సంతుష్టిని కోరియైన ఆ సామగ్రిని స్వీకరించరాదా? అట్లు స్వీకరించిన కలుగు నష్టము ఏమి? స్వీకరించిన పిదప వానిని ఏమి చేయవలయును? జనములు తనకు భిక్షగా మేలైన పదార్థములను అర్పించుచున్న కారణమున ఆలయసింహద్వారము కడ భిక్షాగ్రహణమునకు స్వస్తి పలికినట్టి తాను ఈ పరిగ్రహణమునకు ఎట్లు సమ్మతింప గలడు? తన వైరాగ్యమునకు అవరోధము ఏదైన లభించిన మేలగునుగదా! ఈ విధముగా ఆలోచనము చేసి కడకు రఘునాథుడు ఆ వస్తువులను, ద్రవ్యమును స్వీకరించి గౌరాంగదేవుని సేవకు వినియోగింప నిశ్చయించికొనెను. అనంతరము అతడు ఆ వస్తువులను, ధనమును తీసికొనివారిని పంపివైచెను. నెలకు రెండు మాఱులు ప్రభువును భోజనార్థము తన కుటీరమునకు ఆహ్వానించు నేర్పాటు చేసికొనెను. అతని సంతోషము కొఱకు ప్రభువు అతని కుటీరమునకు ప్రసాదగ్రహణమునకై విచ్చేయ సాగెను. కాని ఆ వ్యవస్థయందు అగునట్టి వ్యయము ఎంత? చాల తక్కువ. ఆ దినములలో వస్తువులు అతి చౌకగాలభించెడివి. ఆ కారణమున గౌరప్రభువునకు ప్రసాదమును అర్పించు వ్యవస్థకు కేవలము ఎనిమిది అణాల ద్రవ్యము మాత్రమే వ్యయమగుచుండెను (అణా అనగా రూపాయిలో 16వ భాగము. పూర్వము ఉండెడివి. 1957లో రద్దు చేయబడినవి) రానురాను ఆ వ్యవస్థను కూడ రఘునాథుడు విడిచి పెట్టెను. కారణము ఏమన్న "ఏమో? ఈ ద్రవ్యము ఎట్లు కూడ బెట్టబడినదో? ఇది ప్రభువు యొక్క సేవకు వినియోగింప దగినది

కాకపోవచ్చును. ఆ స్వామి నోట పవిత్రద్రవ్యముతో సమకూర్చబడిన అన్నము పెట్టవలయును. కాని తద్భిన్నమైనదానిని పెట్టరాదు" అను నిట్టి యాలోచనము అతనికి కలిగెను. తోడనే అతడు ఆక్రమమును మానివైచెను. ఈ రహస్యమును ఎఱిగి ప్రభువు కూడ సంతోషించెను. మొదట ఆ మహాప్రభువు రఘునాథుని సంతుష్టికొఱకే అతని ప్రస్తావనకు తన సమ్మతిని దెలిపెను.

ఎల్ల అనర్థాలకు మూలము మనస్సు అని విజ్ఞులందురు. నిశ్చయముగా అది అట్టిదే అనుటలో సందేహము కూడ లేదు. ఎందుచేత అని యందురా? అది సర్వతంత్ర స్వతంత్రతత వహించుటయే అందులకు కారణము. ఎవ్వరును దానిని నియంత్రించుటకు ప్రయత్నించుట లేదు. నిరంకుశత్వము ప్రాప్తించినప్పుడు ఎంతటి యనర్థమును సృష్టించుటకైన పూనుకొనక ఊరకుండువాడు ఎవ్వడు? ఒకింత నిశితముగా ఆలోచించిచూచినచో ఇక్కడ దోషము మనస్సుది కాదు, దానిని నడపించువానిది, దానినికలిగి యున్న వానిది అని తేటతెల్లమగును. దానిని కలిగి యున్నవాడు దానిని నియంత్రించి వశీకరించి కొన్నవాడు అది వాని సైగలను అనుసరించి నర్తింపసాగును. నిరంతరము ఏదియో ఒక ధోరణిలో లేక ఆలోచనలో లేక భావనలో నిమగ్నమై యుండుట మనస్సు చేయుపని. ఈనాడు విషయభోగముల ధోరణిలో తగుల్కొని యున్న మనస్సును ఆ ధోరణి నుండి మఱలించి మనము ఒకింత ప్రయత్నిచి పరమార్థపుధోరణిలో ప్రవేశ పెట్టవలయును. ఆ గాడిలో అది పడవలయునే కాని పడిన తరువాత అది మఱి విషయముల వంకకు తల యెత్తి కూడ చూడదు. విషయాల సుడిగుండములో చిక్కిన మనస్సు అనెడి నావను వెలికి లాగి భగవదభిముఖముగా సాగు ప్రవాహములోనికి చేర్చుట వఱకు మాత్రమే మనము శ్రమపడవలయును. అటుపిమ్మట మహావేగముతో ఆ ప్రవాహమే దానిని లాగుకొని పోవును. అందులకు మన రఘునాథదాసే ఉదాహరణము. అతడు ఇచ్ఛాపూర్వకముగాను, అనిచ్ఛాపూర్వకముగాను

రాజకుమారుడుగా ఉన్నంతకాలము ఉండెను. ఇప్పుడు అతడు విరాగియైపోయెను కావున అతని వైరాగ్యము కూడ దినదిన ప్రవర్ధమానము కాసాగెను. తొలుత అతడు అన్న క్షేత్రమునకు (సత్రము) ఏగి భిక్ష తెచ్చి కొనువాడు. ఇప్పుడు అతడు అది కూడ మానివైచెను. కారణము ఏమన్న ఇతడు గొప్ప వంశమువాడు అన్న విషయము భండారాధిపతికి తెలిసిపోయెను. అది మొదలు అతడు రఘునాథునకు అర్పించి భిక్షను అధికము చేసెను. ఆ కారణమున రఘునాథుడు ఆ వ్యవస్థను కూడ మాని మఱియొక మార్గమును అనుసరింప వలసినవాడయ్యెను. అతడు నూతనముగా ఎన్నుకొన్న మార్గమందు అతనికి పూర్తిగా స్వేచ్ఛయుండెను. ఆ మార్గము ఏదియన్న పూరీక్షేత్రములో భగవానుని ప్రసాదరూపమగు అన్నము, పప్పు మున్నగునవి అంగడులలో విక్రయింపబడును. ఆ ప్రసాదము అమ్మబడినది అమ్మబడగా శేషించిన పదార్థము కొన్ని దినములుగా నిల్వయున్న కారణమున అప్పుడప్పుడు క్రుళ్ళిపోవుట సంభవించుచుండును. అట్టి పదార్థమును ఎవరును కొనుటకు ఇచ్చగించరు. ఆ పదార్థమును విక్రేతలు రోడ్లమీద పాఱవేయుచుందురు. అట్లు పాఱవేయబడినదానిని గోవులు ఆరగించుచుండును. ఆ పదార్థములనే సేకరించికొని దానితో జీవికానిర్వహణము చేయుట రఘునాథునకు నిర్ద్వంద్వమైన పద్ధతిగా తోచెను. అంతట అతడు ఆ పదార్థమును ఒకింత సేకరించి తెచ్చుకొనసాగెను. దాచి అందు ఒకింత ఉప్పును గలిపి దానితో తన కడుపుమంటను చల్లార్చుకొనుట మొదలు పెట్టెను. ఒకనాడు స్వరూపుడు రఘునాథుని అట్టి పదార్థమును ఆరగించుచుండగా చూచెను. అప్పుడు అతడు అదేమి? రఘునాథా! ఆ ప్రసాదమును నీవు ఒక్కడవే ఆరగించుచున్నావు? అంత స్వార్థము తగునా నీకు? మాలో ఎవరితోను చెప్పలేదేమి? ఒక్కనాడు నాకు కూడ ఆ ప్రసాదమును చవి చూపరాదా? అని నవ్వుచు పలికెను.

స్వరూపగోస్వామి ఇంత మాత్రము పలికి యూరకుండెను. కాని మహాప్రభువు అట్లు చేయలేదు. ఈ విషయము తెలియుటతోడనే ఆ

మహాప్రభువు అలికిడి చేయకుండ మెల్లగా రఘునాథుని కుటీరమునకు వచ్చి ఒకచో దాగియుండి రఘునాథుడు ప్రసాదమును ఆరగించు వేళ కోతివలె అతడు ఉన్న యెడకు తటాలున దుమికి అతని యాకులోని ప్రసాదమును ఒక పిడికెడు చేత గ్రహించి ఔరౌర! ఇదేమి న్యాయము? భోజనార్థము నన్ను నిమంత్రించుట మానివైచి ఇట్టి భగవత్ప్రసాదమును అంతను నీవు ఒక్కడవే ఆరగించివేయుచున్నావా? అనుచు నోట బెట్టుకొనెను. అది గాంచి రఘునాథుడు అయ్యయ్యో! మహాప్రభూ! ఇదేమి పని? ఈ మహాపాపము నుండి నాకు నిష్కృతి యెట్లు? అనుచు వెంటనే తన ప్రసాదపుటాకును రెండు చేతులతో ప్రభువునకు దొరకని విధముగా మీదకు ఎత్తి పట్టుకొనెను. లజ్జా సంకోచములు కారణముగా అతని కన్నులలో కన్నీరు ఉరలెను. మహాప్రభువు తన నోట నిడుకొన్న పదార్థమును నములుచు రఘునాథునివంకకు కరుణాపూరితదృక్కులను సారించుచు ఘటిమొక్క మాఱు అతనిచేతిలోని పదార్థమును హరించుటకు ముందునకు ఉఱికెను. అంతట రఘునాథుడు క్షమించుడు మహాప్రభూ! అనుచు ప్రసాదపు దొన్నెతో వెలికి పాఱిపోయెను. అంతలో ఈ గొడవను ఆలకించి స్వరూపగోస్వామి కూడ ఆ యెడకు వచ్చెను. బలవంతముగా రఘునాథుని ఉచ్ఛిష్టమును హరించి తినుటకు ఉద్యమించుచున్న మహాప్రభువును చూచి ప్రభూ! దయతో నామాటను ఆలించి మీరు ఈ పనిని విరమించుడు! ఇందువలన పరుల జన్మకర్మలు భ్రష్టములు కావచ్చును అని చేతులు జోడించుకొని వేడుకొనెను.

చైతన్యదేవుడు నోటిలో ఉన్న ప్రసాదమును నములుచునే 'స్వరూపా! నీతో నిజము చెప్పుచున్నాను. ఇంతటి సుస్వాదిష్ట పదార్థమును నేను ఇంతకు ముందు ఎన్నడును తినియుండలేదు సుమా!' అని అతనికి బదులు చెప్పెను.

ఈ విధముగా శ్రీ గౌరాంగదేవుల కృపాదృష్టివలన ప్రోత్సాహనమును అందుచునే రఘునాథుడు అచ్చటనే ఆ పూరీక్షేత్రమందే యుండి

పదునాఱు వత్సరముల కాలమును వెడలించెను. శ్రీ చైతన్యమహాప్రభువు రేబవళ్ళు సమాధిదశ వంటి ప్రేమోన్మాద (పారవశ్య) దశలో నిమగ్నుడై యున్న తరుణమున ఇతడే ఆస్వామి దేహమును కాపాడుటకు ఎల్లవేళల చెంత నుండువాడు. ఇతడు ఆ స్వామికి అత్యంత నిష్ఠ వహించి సేవలు చేయుచుండువాడు. ఆ దేవుని ముఖమునుండి వినిర్గతమైన వచనామృతమును గ్రోలువాడు. ఇట్లుకాలము గడచు చుండగా ఒకనాడు శ్రీ చైతన్యమహాప్రభువు తన యవతారమును చాలించి యదృశ్యుడయ్యెను. అప్పుడు రఘునాథుడు ఎంతయో విలపించెను. ప్రభువు వెడలిపోయిన తరువాత కొంతకాలమునకు స్వరూప గోస్వామి కూడ దేహత్యాగము చేసి దివంగతుడు అయ్యెను. అంతట రఘునాథుడు పూరీక్షేత్రమును వీడి బృందావనమునకు వెడలిపోయెను. అక్కడ అతడు రాధాకుండతటమున కుటీరము గల్పించుకొని అందుండి కఠోరసాధనలో నిమగ్నుడయ్యెను. ఆ కాలమున అతడు కేవలము మజ్జిగ త్రాగి జీవములను నిలిపికొనువాడు. రాత్రివేళ కేవలము గంట, గంటన్నఱ కాలము మాత్రమే నిదురించువాడు. మిగిలిన సమయమంతయు భగవద్భజనముతోనే వెడలించువాడు. ప్రతిదినము ఒక లక్షనామజపము చేయు నియమము అతనికి ఉండెను. రఘునాథుని సుగుణములు అసంఖ్యాకములని శ్రీ చైతన్య చరితామృతమును రచించిన మహాభాగుడు తెలిపెను. రఘునాథుని నియమములు చాలా కఠినములుగ నుండి చెక్కు చెదరనివని యెన్న దగినది. అతని అన్నపానములు, నిద్ర ఆదిగా గల సర్వమును నాలుగు గడియల కాలములో ముగిసిపోయెడిది. మిగిలిన సమయు మంతయు సాధనతో గడచిపోయెడిది. వైరాగ్యవిషయమున అతడు మూర్తస్వరూపమే. జిహ్వాచాపల్యము అననేమియో అతడు ఎఱుగడు. వస్త్రములు అతనివి గుడ్డపేలికలు. వానిని అతడు కేవలము లజ్జానివారణమును, శైత్య పీడానివృత్తిని గోరి చెంత ఉంచుకొనువాడు. ప్రభువు యొక్క ఆజ్ఞనే అతడు భగవదాజ్ఞగా స్వీకరించి సాగుచుండువాడు.

ఈ రఘునాథునకు చక్కని సంస్కృత భాషాజ్ఞానము ఉండెను. బృందావన నివాసకాలములో ఇతడు సంస్కృతమున కొన్ని గ్రంథములను రచించెను. శ్రీ చైతన్య చరితామృతమును రచించిన కవిరాజగు శ్రీకృష్ణదాసునకు ఇతడు దీక్షాగురువు. తన గ్రంథ రచనమునకు వలయు విషయములు అన్నియు అధికభాగము అతనికి ఇతనివలననే ప్రాప్తించెను. 85 ఏండ్ల వఱకు పరిపూర్ణ వైరాగ్యమయ జీవితమును గడపి భగవద్భజనము చేసికొనుచు అంతమందు ఇతడు భగవానుని దివ్యశ్రీచరణారవింద సన్నిధికి చేరుకొనెను.

భక్తునకు జయము! భక్తపాలకుడగు భగవానునకు జయము!

* * *